www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 7-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 280
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి సా. 4.27 తదుపరి నవమి; నక్షత్రం: రేవతి సా. 5.50 తదుపరి అశ్వని; వర్జ్యం: శేషం ఉ.7.58; దుర్ముహూర్తం: ఉ.9.03-9.47, రా.10.07-10.58; అమృతఘడియలు: మ.3.33-5.04; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.51 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భర్త చనిపోయి ఆరు రోజులైనా..

ఒకే ఇంట్లో ఉండీ గుర్తించని భార్య
ఆ దంపతుల మధ్య పదేళ్లుగా మాటల్లేవు
కోయంబత్తూరులో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య ఏర్పడే అగాధం ఎంతటి విపరీతానికి దారి తీస్తుందో ఈ సంఘటనే ఓ ఉదాహరణ! ఒకే ఇంట్లో ఉంటున్నా ఆ దంపతుల మధ్య పదేళ్లుగా మాటల్లేవ్! దీంతో భర్త ఏమయ్యాడో కూడా

మిగతా 2వ పేజీలో...

సహకరించండి

తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటునందించండి.. మీ లక్ష్యసాధనలో భాగమవుతాం



చర్లపల్లి టెర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ; సమావేశంలో పాల్గొన్న రైల్వే మంత్రి వైష్ణవ్, సీఎం రేవంత్‌రెడ్డి

బందర్-హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్‌హైవే, ప్రత్యేక రైల్వే లైన్, రీజినల్ రింగ్‌ రైల్, మెట్రో రెండోదశ మంజూరు చేయండి
వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ ఏర్పాటుకు అవకాశమివ్వండి
ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ
త్వరలో వందేభారత్ స్లీపర్ రైళ్లు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం కొనసాగాలి: బండి

రాజీ పడం.. మోదీతో కొట్లాడతాం!

13

హైదరాబాద్ అభివృద్ధికి మజ్లిస్‌తో కలిసి నడుస్తాం
అతిపెద్ద వంతెనల నిర్మాణం కాంగ్రెస్ సర్కారులోనే
అక్బరుద్దీన్, నేను చిన్ననాటి స్నేహితులం.. కలిసి తిరిగాం
జూపార్కు- ఆరాంఘర్ వంతెన ప్రారంభోత్సవంలో రేవంత్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): "మనదేశం ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికాభివృద్ధి సాధించాలన్న మీ లక్ష్యంలో భాగస్వామి అయ్యేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. ఇందు కోసం తెలంగాణ అభివృద్ధికి సంపూర్ణంగా సహకరించండి" అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి.. ప్రధాని నరేంద్రమోదీతో అన్నారు. ఏపీలోని బందర్ పోర్టు నుంచి హైదరాబాద్ వరకు ప్రత్యేక రైల్వేలైను, ప్రత్యేక గ్రీన్‌ఫీల్డ్ హైవే అత్యంత కీలకమని, ఈ రెండింటినీ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రీజినల్ రింగ్ రోడ్డుతో పాటు రీజినల్ రింగ్ రైల్‌కు సహకరించాలన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశకు సంబంధించి కేంద్రానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, ఈ ప్రాజెక్టుకు సంపూర్ణ సహకారం కావాలని అన్నారు. సోమవారం చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న చర్లపల్లి టెర్మినల్‌ను పూర్తిచేసి ప్రారంభించినందుకు రాష్ట్ర ప్రజల తరఫున ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. "తెలంగాణలో పోర్టు లేదు. ఏపీలోని బందరు పోర్టు మాకు దగ్గర్లో ఉంది. అక్కడి నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక గ్రీన్‌ఫీల్డ్

మిగతా 14వ పేజీలో...

వికసిత్ భారత్‌లో రైల్వేల అభివృద్ధి కీలకం

14

మౌలిక సౌకర్యాలను ఆధునీకరిస్తున్నాం
దేశంలో త్వరలోనే బుల్లెట్ రైలు పరుగులు
రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో ప్రధాని

టెర్మినల్ అప్రోచ్ రోడ్డుపై కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య సంవాదం!

14

గ్రాంటు ఇవ్వండి: మంత్రి శ్రీధర్‌బాబు
మీదే బాధ్యత: కేంద్ర మంత్రి సోమన్న
రాష్ట్రం పనులు చేపట్టాలి: కిషన్‌రెడ్డి

ఎందరు జైలుకెళ్తారో!

ప్రతి నేత వెళ్తేనే కష్టాలు తెలుస్తాయి
జైల్లో తనకు వండి పెట్టిన వ్యక్తిని సీఎం రేవంత్ ఇప్పటికీ మర్చిపోలే
నేనూ 50 రోజులు జైలులో ఉన్నా
పాతబస్తీ మెట్రోను ఐదుగురు సీఎంలు పట్టించుకోలేదు: అసద్

13

హెచ్ఎంపీవీ కలకలం

భారత్‌లో ఐదు కేసులు

బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో ఆ వైరస్ బారిన పడ్డ ఐదుగురు శిశువులు
అందరూ నెలల వయసు చిన్నారులే!
భయపడొద్దు.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం: కేంద్రం
పాత వైరస్సే.. ఆందోళన చెందనక్కర్లేదు.. డాక్టర్ ఎంవీ రావు, యశోద ఆస్పత్రి
పిల్లల్లోనే తీవ్రత.. రాజీవ్, కామినేని ఆస్పత్రి



బెంగళూరులో 2 హెచ్ఎంపీవీ కేసులు నమోదైన ఆస్పత్రి

బెంగళూరు, చెన్నై, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజులుగా చైనాను కలవర పెడుతున్న 'హ్యూమన్ మెటాన్యూమోవైరస్ (హెచ్ఎంపీవీ)' వైరస్.. మనదేశంలోకీ అడుగుపెట్టింది. బెంగళూరులో ఇద్దరు చిన్నారులు.. గుజరాత్‌లో ఒక శిశువు, చెన్నైలో మరో ఇద్దరు చిన్నారులు ఈ వైరస్ బారిన పడినట్టు భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ప్రకటించింది. బెంగళూరులో.. బ్రాంకో న్యూమోనియాతో బాధపడుతున్న మూడు నెలల పాపను ఆస్పత్రిలో చేర్చగా, వైద్య పరీక్షల్లో హెచ్ఎంపీవీ పాజిటివ్‌గా తేలింది. అయితే, ఆ పాపకు చికిత్స చేసి, డిశ్చార్జి కూడా చేసినట్టు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. అదే ఆస్పత్రిలో.. అదే సమస్యతో బాధపడుతున్న ఎనిమిది నెలల వయసున్న బాబుకు కూడా హెచ్ఎంపీవీ పాజిటివ్ వచ్చింది. ఆ బాబుకు చికిత్స చేస్తున్నామని.. ప్రస్తుతం కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. అలాగే.. రాజస్థాన్‌లోని దుంగార్పూర్‌కు చెందిన రెండు నెలల వయసున్న బాబు శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆ శిశువును అహ్మదాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. డిసెంబరు 26న ఆ బాలుడికి హెచ్ఎంపీవీ పాజిటివ్ వచ్చింది. తొలుత ఆ చిన్నారికి వెంటిలేటర్ చికిత్స అవసరమైందని, ఇప్పుడతని

మిగతా 2వ పేజీలో...

కొత్త వైరస్ కాదు పాతదే..

2

హెచ్ఎంపీవీపై ఆందోళన చెందవద్దు
ప్రమాదకరం కాదు..
చిన్నారుల్లోనే వ్యాప్తి ఎక్కువ
టీకా, ప్రత్యేక చికిత్సల్లేవు
గతంలో చైనాలో 10 శాతంలోపే వ్యాప్తి
ఇప్పుడు 90%.. అందుకే ఆందోళన
జాగ్రత్తలు తప్పనిసరి
వైద్యనిపుణుల సూచన

11 లక్షల కోట్ల సంపద ఫట్

11

వైరస్ కలకలంతో సెన్సెక్స్ 1,258 పాయింట్లు.. నిఫ్టీ 388 పాయింట్లు డౌన్

ఫార్ములా-ఈలో క్విడ్ ప్రోకో!

గ్రీన్ కో నుంచి బీఆర్ఎస్‌కు 41 కోట్ల విరాళం
2022లో అనుబంధ సంస్థల ద్వారా చెల్లింపు
తర్వాత 2 నెలలకే పుట్టిన కంపెనీ ఏస్ నెక్ట్స్ జెన్
గ్రీన్ కో సంస్థ డైరెక్టర్లతోనే ఏర్పాటు
దాంతోనే ఫార్ములా-ఈ ఒప్పందం
ఏపీ, తమిళనాడుల్లో గ్రీన్ కో భారీ ప్రాజెక్టులు
హైదరాబాద్‌లో పుట్టి దేశమంతా విస్తరణ
దేశవ్యాప్తంగా ప్రాజెక్టుల విలువ లక్ష కోట్లు

హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట దక్కేనా?

ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌పై నేడు తీర్పు

ఈ నెల 22న కేసీఆర్ విచారణ!

23, 24 తేదీల్లో హరీశ్‌రావు, ఈటల కూడా
17న హైదరాబాద్‌కు జస్టిస్ పినాకి చంద్రఘోష్


ఏసీబీ కార్యాలయానికి వచ్చి వెళ్తున్న కేటీఆర్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా-ఈ కార్ల రేసు నిర్వహణ రూపంలో గ్రీన్ కో ఎనర్జీస్ కంపెనీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య పరస్పర లబ్ధి(క్విడ్ ప్రో కో) జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటై దేశవ్యాప్తంగా దాదాపు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు నిర్వహిస్తున్న ఆ సంస్థ ఇక్కడి ప్రభుత్వం నుంచి ఏదో ఒక రూపంలో లబ్ధి పొందే లక్ష్యంతో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితికి భారీ ఎత్తున విరాళాలు ఇచ్చిందని అంచనా వేస్తున్నాయి. సొంతంగా, అనుబంధ సంస్థల ద్వారా అధికారికంగానే ఎన్నికల బాండ్ల రూపంలో

మిగతా 12వ పేజీలో...

ఒంటరిగా రావాల్సిందే

12

ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ ఝలక్
విచారణకు న్యాయవాదులతో వచ్చిన కేటీఆర్
బృందాన్ని లోపలికి అనుమతించని ఏసీబీ
బయట 40 నిమిషాల హైడ్రామా
ఏసీబీకి లేఖ ఇచ్చి వెనుదిరిగిన బీఆర్ఎస్ నేత
9న రావాలని కేటీఆర్‌కు మరోసారి నోటీస్
పోలీసులపై నమ్మకం లేకే లాయర్లతో వచ్చా
ఏసీబీ సోదాల పేరుతో నా ఇంట్లో ఏవో వస్తువులు పెట్టేందుకు రేవంత్ కుట్ర: కేటీఆర్
నేడు జరగాల్సిన ఈడీ విచారణ వాయిదా

దొంగ ఫైళ్లు పెట్టించి కేటీఆర్‌పై కుట్ర

రేవంత్ ప్రయత్నం బెడిసికొట్టింది: జగదీశ్‌రెడ్డి
ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు: వేముల



ట్రూడో రాజీనామా!

నాయకత్వ ఎంపిక జరగ్గానే వైదొలుగుతా
ప్రకటించిన కెనడా ప్రధాని

10

ధరాఘాతం, వలసలు, విధాన నిర్ణయాలే కౌంట్‌డౌన్‌కు కారణం!
ట్రంప్ విజయంతో చుట్టుకున్న చిక్కులు
కెనడాపై టారిఫ్ పెంచుతానన్న ట్రంప్
భారత్‌నూ తరచూ విమర్శిస్తున్న ట్రూడో

కారులో కూర్చుని.. నిప్పంటించుకొని..

ప్రేమజంట బలవన్మరణం.. ఘట్‌కేసర్‌లో ఘోరం
ఇద్దరిలో అమ్మాయి మైనర్.. ఐదేళ్లుగా ప్రేమలో..
డబ్బులివ్వకపోతే ప్రేమ గురించి ఇంట్లో చెబుతా అంటూ బాలికకు సమీపబంధువు బెదిరింపులు
అతడికి రూ.1.35 లక్షలు ఇచ్చిన ప్రియుడు
అయినా డబ్బులడగడంతో ఆత్మహత్యకు నిర్ణయం
స్నేహితుడి నుంచి కారు తీసుకున్న యువకుడు
లోపల బాలికతో కలిసి ఒంటిపై పెట్రోలు
కారు దగ్ధం.. గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలు
బంధువులకు వాట్సాప్‌లో సూసైడ్ నోట్


మంటల్లో దగ్ధమవుతున్న కారు

ఘట్‌కేసర్ రూరల్/బీబీనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇద్దరూ బలవన్మరణానికి పాల్పడిన తీరు మాత్రం అత్యంత హృదయవిదారకంగా, ఒళ్లు గగుర్పొడిచేలా ఉంది. ప్రేమికుల్లో అమ్మాయి మైనర్. ప్రేమ విషయాన్ని ఇంట్లో చెబుతానని బాలికను ఆమె సమీప బంధువు బ్లాక్‌మెయిల్ చేయడంతో ఆ జంట భయపడిపోయింది. కారులో కూర్చున్న ఇద్దరూ ఒంటిపై పెట్రోలు

మిగతా 10వ పేజీలో...

మావోయిస్టుల మందుపాతర 8 మంది జవాన్ల మృతి

వాహనం డ్రైవర్ కూడా దుర్మరణం
25 అడుగులు ఎగిరిపడ్డ ఎస్‌యూవీ
మాంసపు ముద్దలుగా మృతదేహాలు
50 కిలోల పేలుడు పదార్థాలు ఉపయోగించిన మావోయిస్టులు
ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో ఘటన
కూంబింగ్‌కు అబూజ్‌మడ్ నుంచి దంతేవాడ వెళుతుండగా ఘటన
మృతులంతా దంతేవాడ వాసులే
'హిడ్మా ఆపరేషన్'పై అనుమానాలు


ఐఈడీ పేలుడు ధాటికి ఏర్పడ్డ భారీ గొయ్యి; తుక్కయిన కారు

చర్ల, చింతూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బస్తర్‌లో మావోయిస్టులు మరో మారు పంజా విసిరారు. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనాన్ని 50 కిలోల ఐఈడీతో పేల్చేశారు. పేలుడు శబ్దం 10 కిలోమీటర్ల వరకు వినిపించగా.. రోడ్డుపై ఐదు మీటర్ల మేర, ఐదడుగుల లోతుతో గొయ్యి ఏర్పడింది. పేలుడుధాటికి ఆ వాహనం 25 అడుగుల ఎత్తుకు ఎగిరిపడగా.. డ్రైవర్, 8 మంది జవాన్ల దేహాలు ఛిద్రమైపోయాయి. వీరంతా దక్షిణ అబూజ్‌మడ్‌లో ఎన్‌కౌంటర్(నలుగురు నక్సల్స్ చనిపోయారు) నుంచి దంతేవాడకు ఎస్‌యూవీలో

మిగతా 2వ పేజీలో...

ఇద్దరు పిల్లలను హతమార్చి..
టెకీ దంపతుల ఆత్మహత్య

2

బెంగళూరు సదాశివనగర్‌లో దారుణం
కుమార్తె ఆరోగ్య సమస్యలతో వేదన?


అనూప్, రాఖి

పాప పుట్టినరోజు విషయమై గొడవ..
సాఫ్ట్‌వేర్ దంపతుల ఆత్మహత్య

ఉరేసుకున్న భార్య.. అది చూసి భర్త బలవన్మరణం
అనాథలైన 3 ఏళ్ల పాప, 14 నెలల బాబు
సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన

10



2

అంతరిక్షంలో మొలకెత్తిన అలసందలు

వాటికి రెండేసి ఆకులు.. ఇస్రో 'క్రాప్స్' ప్రయోగం సక్సెస్

ఇద్దరిని బలిగొన్న పొగమంచు

నడిచి వెళ్తున్న శ్రీవారి భక్తులపైకి దూసుకెళ్లిన అంబులెన్స్
ఒకరి పరిస్థితి విషమం.. మరో నలుగురికి గాయాలు
అదే 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు
ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రగిరి మండలంలో ఘటన

10

ఇద్దరు పిల్లలను హతమార్చి.. టెకీ దంపతుల ఆత్మహత్య

» బెంగళూరు సదాశివనగర్‌లో దారుణం

బెంగళూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సదాశివనగర్‌లో టెకీ దంపతులు తమ ఇద్దరు పిల్లలను హతమార్చి, ఆత్మహత్య చేసుకున్నారు. మృతులను అనూప్(38), ఆయన భార్య రాఖీ(35), కూతురు అనుప్రియ(5), కుమారుడు ప్రియాంశ్(2)గా పోలీసులు గుర్తించారు. ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అనూప్ బెంగళూరులో ఓ కంపెనీకి సాఫ్ట్‌వేర్ కన్సల్‌టెంట్‌గా పనిచేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పెద్దకూతురు అనుప్రియ అరోగ్య సమస్యతో దంపతులు ఒత్తిడికి, తీవ్ర ఆవేదనకు గురయ్యే వారని తెలుస్తోంది. వీరి ఇంట్లో ముగ్గురు పనివారు ఉన్నారు. ఇద్దరు వంటపని చేసేవారు కాగా ఒకరు ప్రియాంశ్‌ను చూసుకునేవారు. ఒక్కొక్కరికి రూ.15వేల దాకా జీతం ఇచ్చేవారు. సోమవారం ఉదయం పాండిచ్చేరి వెళుతున్నామని, తొందరగా పనికి రావాలని ఆదివారం సూచించారు. కుటుంబం ప్రయాణానికి ఆదివారం ప్యాకింగ్ పనులను కూడా పనివారు చేశారు. వీరు సోమవారం ఉదయం వచ్చేసరికి దంపతులు ఇద్దరూ ఉరి వేసుకుని కనిపించారు. బిడ్డలిద్దరికీ విషం ఇచ్చి చంపినట్టు, ఆ తరువాత దంపతులు ఉరి వేసుకున్నట్టు భావిస్తున్నారు. అనూప్ కుటుంబం ఆర్థికంగా పటిష్ఠంగా ఉందని, ఎలాంటి ఆర్థిక సమస్యలు లేవని సమాచారం.

పేపర్ లీక్ నిరసనలతో జైలుకు ప్రశాంత్ కిశోర్

పట్నా, జనవరి 6: బిహార్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (బీపీఎస్సీ) నిర్వహించిన పరీక్షా పేపరు లీక్ అయిన వ్యవహారంపై ఆందోళన చేస్తున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, జన్ సురాజ్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కిశోర్‌ను పట్నాలో పోలీసులు అరెస్టుచేశారు. షరతులతో కూడిన బెయిల్‌ను తీసుకునేందుకు నిరాకరించడంతో ఆయనను జైలుకు తరలించారు. పబ్లిక్ సర్వీసు కమిషన్ నిర్వహించిన పరీక్షా పేపరు గత ఏడాది డిసెంబరు 13న లీకైన విషయం తెలిసిందే. దీనిపై బిహార్‌లో తీవ్ర రాజకీయ నిరసనలు కొనసాగుతున్నాయి. బీపీఎస్సీ పరీక్షలను రద్దుచేయాలంటూ బాధిత అభ్యర్థులు, ప్రతిపక్షాలు ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ తన మద్దతుదారులతో కలిసి ఐదు రోజులుగా పట్నాలోని గాంధీ మైదానంలో నిరశన దీక్ష చేస్తున్నారు. అయితే, నిషిద్ధ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా దీక్ష చేపడుతున్నారంటూ సోమవారం ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అడ్డుకోబోయిన 43 మంది మద్దతుదారులను కూడా అదుపులోకి తీసుకున్నారు.

దల్లేవాల్‌ను కలిసిన సుప్రీంకోర్టు ప్యానెల్

న్యూఢిల్లీ/ చండీగఢ్, జనవరి 6: అన్నదాతల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 41 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌ను సుప్రీంకోర్టు ప్యానెల్ కమిటీ సోమవారం కలిసింది. పంజాబ్ హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ నవాబ్ సింగ్ నేతృత్వంలోని కమిటీ.. అనారోగ్యంతో బాధపడుతున్న దల్లేవాల్‌ను వైద్య సాయం తీసుకోవాలని కోరింది. భేటీ అనంతరం జస్టిస్ నవాబ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. 'మేమంతా వైద్య సాయం తీసుకోవాలని దల్లేవాల్‌ను పదే పదే కోరాం. ఆయన ఆరోగ్యం బాగుండాలని ప్రార్థిస్తున్నాం. ఆందోళన విరమించమనేందుకు ఇక్కడికి రాలేదని.. ముందు మీరు ఆరోగ్యం గురించి ఆలోచించండని చెప్పి చూశాం. తన ఆరోగ్యం కంటే రైతుల సమస్యలు తీర్చడమే ముఖ్యమని దల్లేవాల్ అన్నారు. ఏదేమైనా మేం ఇక్కడే ఉంటామని ఆయనకు చెప్పాం' అని వెల్లడించారు.

కుంభమేళాను అడ్డుకుంటాం: పన్నూన్

న్యూఢిల్లీ, జనవరి 6: ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ప్రయాగరాజ్‌లో ఈ నెల 13నుంచి ఫిబ్రవరి 26 వరకు జరిగే మహాకుంభమేళాను అడ్డుకుంటామంటూ వీడియో విడుదల చేశాడు. 'మహాకుంభ్ ప్రయాగరాజ్ 2025 యుద్ధ భూమిగా మారుతుంది', 'హిందుత్వ భావజాలాన్ని హత్య చేయండి,' 'ప్రయాగరాజ్, లఖ్‌నవూ విమానాశ్రయాల్లో ఖలిస్థాన్ జెండాలను ఎగురవేయండి' అంటూ వ్యాఖ్యలు చేశాడు. 'చలో ప్రయోగరాజ్' అంటూ మద్దతుదార్లకు పిలుపునిచ్చాడు. కుంభమేళాను వ్యతిరేకిస్తూ పన్నూన్ హెచ్చరికలు చేయడం పది రోజుల్లో ఇది రెండోసారి. కుంభమేళాలో ముఖ్య రోజులైన సంక్రాంతి(జనవరి 14), మౌని అమావాస్య(జనవరి 29), బసంత పంచమి(ఫిబ్రవరి 3)న ఆటంకాలు కలిగిస్తామని మొదట హెచ్చరించాడు.

బ్రహ్మపుత్ర డ్యామ్ ప్రభావం భారత్‌పై ఉండదు

న్యూఢిల్లీ, జనవరి 6: టిబెట్‌లో భారత సరిహద్దు సమీపంలో బ్రహ్మపుత్ర నదిపై తాము నిర్మించబోయే డ్యామ్‌తో ఇండియాపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడబోదని చైనా పేర్కొంది. డ్యామ్ కారణంగా భారత్‌లో బ్రహ్మపుత్ర నదీ ప్రవాహంలో మార్పు ఉండదని స్పష్టం చేసింది. డ్యామ్ నిర్మాణానికి అనేక శాస్త్రీయ అంశాలను పరిగణలోకి తీసుకున్నామని ఆ దేశ విదేశాంగ శాఖ సోమవారం వెల్లడించింది. బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌ను నిర్మించాలని గత నెలలోనే చైనా నిర్ణయించింది. అయితే, దీనిపై దిగువ దేశాలైన భారత్, బంగ్లాదేశ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డ్యామ్ కారణంగా బ్రహ్మపుత్ర నది ప్రవాహంలో మార్పులు జరిగి, ఈ రెండు దేశాల్లో పలు రాష్ట్రాలు ముంపు సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందన్న అభిప్రాయాలున్నాయి.

భర్త చనిపోయి 6 రోజులైనా..

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకోలేకపోయిన భార్య.. ఎట్టకేలకు ఆరు రోజుల తర్వాత ఇంట్లోనే పడివున్న అతడి మృతదేహాన్ని గుర్తించింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన తమిళనాడులోని కోయంబత్తూరులో చోటుచేసుకుంది. కోయంబత్తూర్ ఇరుగూర్ ఈశ్వరన్ ఆలయ వీధిలో రాజమాణిక్యం (73), రాజసులోచన (63) దంపతులు నివాసముంటున్నారు. పిల్లలిద్దరికీ వివాహమై వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. ఈ దంపతుల మధ్య తలెత్తిన విభేదాల కారణంగా పదేళ్లుగా వారు మాట్లాడుకోవడం లేదు. మిద్దెపై ఉన్న గదిలో ఉంటున్న రాజమాణిక్యం, రోజూ కిందికి వచ్చి భోజనం, తాగునీరు తీసుకెళ్లేవాడు. ఈ నేపథ్యంలో గత నెల 29వ తేదీ మధ్యాహ్నం కిందికి వచ్చిన రాజమాణిక్యం.. అన్నం తీసుకెళ్లాడు. ఆయనకు అదే ఆఖరి భోజనం. ఆరు రోజులైనా అతడు కిందికి రాకపోవడంతో వేరే ఊరికి వెళ్లి ఉంటాడని రాజసులోచన భావించింది. ఈ క్రమంలో శనివారం రాత్రి పైగది నుంచి దుర్వాసన రావడంతో రాజసులోచన అక్కడికి వెళ్లగా, తలుపు మూసి ఉంది. కిటికీ నుంచి చూడగా, రాజమాణిక్యం మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది.


అమెరికా కాంగ్రెస్ భవనం వద్ద మంచును తొలగిస్తున్న సిబ్బంది

అమెరికాలో మంచు తుఫాను బీభత్సం

» 6 కోట్ల మందిపై ప్రభావం.. 6 రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ విధింపు

వాషింగ్టన్, జనవరి 6: అమెరికాను భారీ మంచు తుఫాను వణికిస్తోంది. మధ్య అమెరికాలో శనివారం ప్రారంభమైన ఈ విధ్వంసంతో దాదాపు 6 కోట్ల మందిపై ప్రభావం పడే ప్రమాదం నెలకొంది. పోలార్ వర్టెక్స్ (ధ్రువపు అల్పపీడనం) కారణంగా ఈ తుఫాను సంభవించింది. దాదాపు 30 రాష్ట్రాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చోట్ల రోడ్లపై మంచు 15 అంగుళాల వరకు పేరుకుపోయిందని, విజిబులిటీ కూడా సరిగా లేదని, ఇలాంటి సమయంలో ప్రయాణాలు చేయడం ప్రమాదకరమని నేషనల్ వెదర్ సర్వీస్ (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరించింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పలు రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. ఇప్పటికే కెంటుకీ, వర్జీనియా, వెస్ట్ వర్జీనియా, కాన్సాస్, అర్కాన్సాస్, మిస్సోరి రాష్ట్రాల్లో ఇప్పటికే ఎమర్జెన్సీ ప్రకటించారు.

కొత్త వైరస్ కాదు.. పాతదే

హెచ్‌ఎంపీవీపై ఆందోళన వద్దు.. ప్రమాదకరం కాదు.. చిన్నారుల్లోనే వ్యాప్తి ఎక్కువ

» టీకా, ప్రత్యేక చికిత్స రెండూ లేవు

» జాగ్రత్తలు తప్పనిసరి: వైద్యనిపుణులు

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మెటాన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే చైనాలో విజృంభిస్తున్న హెచ్‌ఎంపీవీ కేసులు మనదేశంలో ఒక్క సోమవారంనాడే ఐదు నమోదు కావడం భయాన్ని రేకెత్తిస్తోంది. అయితే.. ఇదేమీ కొత్త వైరస్ కాదని పాతదేనని.. దీన్ని 2001లో నెదర్లాండ్స్‌లో గుర్తించారని వైద్యనిపుణులు చెబుతున్నారు. చలికాలంలో దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని.. చైనాలో గతంలో కూడా ఉండేదని.. అయితే, వ్యాప్తిరేటు 10 శాతంగా మాత్రమే ఉండేదని, ఇప్పుడది 90 శాతానికి చేరుకోవడంతో పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయని వారు వివరిస్తున్నారు. చైనా ఉత్తర భాగమంతా ఈ కేసులు నమోదు కావడంతో ఇదొక వేవ్‌ను తలపిస్తోందంటున్నారు. కరోనా వైరస్ సృష్టించిన విలయం నేపథ్యంలో.. ఇప్పుడు వైరస్ అంటేనే అందరిలోనూ భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. హెచ్‌ఎంపీవీ భయంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గతంలో కొవిడ్‌తో తీవ్రంగా ఇబ్బందిపడ్డవారు అప్పుడే వైద్యుల సలహాల కోసం సంప్రదిస్తున్నారు. అయితే.. ఇది పాత వైరస్ కావడంతో మెజారిటీ ప్రజల్లో దీన్ని సమర్థంగా ఎదుర్కొనే రోగనిరోధక శక్తి ఉందని వైద్యులు భరోసా ఇస్తున్నారు.

ఇవీ లక్షణాలు..

హెచ్‌ఎంపీవీ బారిన పడినవారిలో ఫ్లూ లక్షణాలు కనిపిస్తాయి. దగ్గు, జ్వరం, ముక్కు కారడం, శ్వాస తీసుకోవడంలో సమస్యలుంటాయి. వైరస్ తీవ్రత మరీ ఎక్కువగా ఉంటే బ్రాంకైటిస్, న్యూమోనియాకు దారి తీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు బయటపడటానికి కనీసం 3-6 రోజులు పడుతుందని.. నవజాత శిశువులు, చిన్నారులు, వృద్ధుల్లో, ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిలో ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు.

ప్రమాదకరమా?

శాస్త్రజ్ఞులు ఇప్పటిదాకా గుర్తించిన లక్షలాది వైరస్‌లలో ఇదొకటని వైద్యనిపుణులు చెబుతున్నారు. దీనివల్ల వచ్చే ఇబ్బందులు సాధారణమైనవేనని.. కొవిడ్, ఇన్‌ఫ్లూయెంజా మాదిరిగా ప్రమాదకరం కాదని ఆస్ట్రేలియాలోని ఫ్లైండర్స్ యూనివర్సిటీలో పబ్లిక్ హెల్త్ విభాగాన్ని చూసే డాక్టర్ జాక్విలిన్ స్టెఫెన్ వెల్లడించారు.


సోమవారం వైద్యాధికారులతో కర్ణాటక ఆరోగ్య మంత్రి దినేశ్ భేటీ

ఎవరికి రిస్కు?

ఇప్పటికే బ్రాంకైటిస్, న్యూమోనియా వంటి శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారికి.. చిన్నపిల్లలు, 65 ఏళ్లు దాటినవారికి, అవయవ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని ఇమ్యూనిటీని అణచివేసే మందులు వాడుతున్నవారికి.. ఆటోఇమ్యూన్ వ్యాధులతో బాధపడేవారికి.. ఈ వైరస్ సోకే ప్రమాదం, లక్షణాల తీవ్రత ఎక్కువగా ఉండే ముప్పుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

నిర్ధారణ.. చికిత్స

హెచ్‌ఎంపీవీ వైరస్‌ను పీసీఆర్ (పాలిమరేస్ చైన్ రియాక్షన్) పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. అలాగే యాంటీజెన్ పరీక్షతో పాటు సిరాలజికల్ టెస్టు ద్వారానూ నిర్ధారించవచ్చు. తీవ్రమైన కేసుల్లో అయితే ఛాతీ ఎక్స్‌రే, సీటీ స్కాన్ కూడా అవసరం కావొచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. హెచ్‌ఎంపీవీ నిరోధించే టీకా ఏదీ లేదని.. దీనికోసమే అభివృద్ధి చేసిన యాంటీవైరల్ ఔషధాలు కూడా అందుబాటులో లేవని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వ్యాక్సిన్లు అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. ఈ వైరస్ బారిన పడినవారికి లక్షణాల ఆధారంగా చికిత్స అందించాల్సిందేనని స్పష్టం చేశారు.

తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యలు

చేతులను తరచుగా సబ్బు, నీరు లేదా ఆల్కహాల్ బేస్డ్ శానిటైజర్‌తో 20 సెకన్లపాటు శుభ్రం చేసుకోవాలి. రద్దీగా ఉండే ప్రదేశాలకు వెళ్తే మాస్క్ ధరించాలి. కరచాలనాలు చేసుకోవడం ఆపేయాలి. ఒకరు వాడిన రుమాలు మరొకరు వాడకూడదు. చేతులతో ముఖాన్ని కళ్లు-ముక్కు-నోటి భాగాలను పదే పదే తాకకుండా ఉండాలి. ఇక, వైరస్ బారిన పడ్డవారు ఇతరులకు దూరంగా ఉండాలి (సెల్ఫ్ ఐసోలేషన్). తుమ్మేటప్పుడు, దగ్గేటప్పుడు నోటికి అడ్డంగా చేతి రుమాలు లేదా టిష్యూ పేపర్ పెట్టుకోవాలి. ఆ వ్యర్థాలను నిర్ణీత పద్ధతుల్లో డిస్పోజ్ చేయాలి. నోరు, ముక్కు, కళ్లను చేతులతో తాకకూడదు. వైద్యుల సిఫారసుతో మందులు వాడాలి.

వ్యాప్తి ఇలా...


ఈ వైరస్ సోకినవారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా, ఆ తుంపర్లు పడిన ప్రాంతాలను/ వస్తువులను ఇతరులు తాకడం వల్ల, వైరస్ బారిన పడ్డవారితో సన్నిహితంగా మెలగడం వల్ల.. ఇతరులకు సోకుతుంది.

హెచ్‌ఎంపీవీ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అయితే ఈ వైరస్ గురించి అంతగా ఆందోళన చెందాల్సిన పని లేదని.. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఐసీఎంఆర్‌తోపాటు, ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ నెట్‌వర్క్ వద్ద ఉన్న తాజా సమాచారం ప్రకారం.. దేశంలో ఫ్లూ తరహా కేసులు, తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల సంఖ్య అసాధారణ స్థాయిలో ఏమీ పెరగలేదని స్పష్టం చేసింది. అయినా, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని.. సంవత్సరం పొడుగునా హెచ్‌ఎంపీవీ వ్యాప్తి తీరును ఐసీఎంఆర్, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ పరిశీలిస్తూనే ఉంటాయని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా.. భయపడాల్సిన పని లేదని ప్రజలకు భరోసా ఇచ్చాయి. బెంగళూరులో గుర్తించినవి ఇప్పటికే దేశంలో ఉన్న పాత వైరస్ రకాలేనని.. అవి ప్రాణాంతకం కాదని, కాబట్టి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కర్ణాటక ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావ్ ప్రకటించారు. బెంగళూరులో రెండు కేసులు నమోదైన నేపథ్యంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులతో ఆయన భేటీ అయి పరిస్థితిని సమీక్షించారు. ఆ శిశువులిద్దరి ఆరోగ్యం సాధారణంగానే ఉందని తెలిపారు. ఇప్పటికైతే దీనికి సంబంధించి అసహజమైన పరిణామాలేవీ లేవు కాబట్టి.. ఈ వైరస్‌వ్యాప్తి కట్టడికి కొవిడ్ తరహా ప్రోటోకాల్స్ పాటించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 8నెలల చిన్నారి కూడా మంగళవారం డిశ్చార్జ్ కానున్నట్టు ఆయన వెల్లడించారు. ఇక.. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నామని గుజరాత్ ఆరోగ్య మంత్రి రుషీకేశ్ పటేల్ ప్రకటించారు. మరోవైపు.. కేసుల సంఖ్య పెరిగినా ఎలాంటి ఇబ్బందీ లేకుండా చికిత్స చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఢిల్లీ ప్రభుత్వం దేశరాజధానిలోని ఆస్పత్రులకు సూచించింది.

లోకం తీరు



ప్రమాదకారి కాదు



హెచ్‌ఎంపీవీ వైరస్ ఎప్పటినుంచో ఉంది. కాబట్టి ప్రజల్లో ఇప్పటికే రోగనిరోధక శక్తి కూడా వచ్చి ఉంటుంది. ఇది ప్రమాదరక వైరస్ కాదు. ప్రజలు భయాందోళనలు చెందవద్దు. చలికాలం పోయేటప్పుడు ఇది వ్యాప్తిస్తుంటుంది. ముఖ్యంగా 6-12 నెలల పిల్లల్లో 90 శాతం మందికి ఈ తరహా వైరస్‌లు వచ్చిపోతుంటాయి. ఇది మళ్లీ మళ్లీ రావొచ్చు. ప్రాణాపాయం ఉండదు. అయితే దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారిలో దీని తీవ్రత కాస్త ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. హెచ్‌ఎంపీవీలో ఏ1, ఏ2, బీ1, బీ2 అనే రకాలున్నాయి. వీటిల్లో ఏ రకం మ్యుటేట్ అయిందో జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ ఎంవీ రావు, సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్, యశోద ఆస్పత్రి, హైదరాబాద్

పిల్లల్లోనే తీవ్రత ఎక్కువ



కొవిడ్ తీవ్రత పెద్దల్లో ఎక్కువగా కనిపిస్తే.. హెచ్‌ఎంపీవీ మాత్రం చిన్నారుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్నవారిలో ఆయాసం, దగ్గు తీవ్రంగా ఉంటాయి. ఆక్సిజన్ స్థాయులు తగ్గుతాయి. అటువంటి పరిస్థితి వస్తే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలి. హెచ్‌ఎంపీవీ వైరస్ తీవ్రత, వ్యాప్తిని ఇప్పుడే అంచనా వేయలేం. ప్రజలు తప్పకుండా మాస్కులు ధరించాలి. కరచాలనం వద్దు.

– డాక్టర్ ఎం. రాజీవ్, కన్సల్టెంట్ పల్మనాలజిస్టు, కామినేని ఆస్పత్రి, హైదరాబాద్

విశాఖ ఉక్కును విక్రయించొద్దు!

నిధులిచ్చి బలోపేతం చేయాలి

» ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలి

» కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు కార్మిక సంఘాల వినతి



న్యూఢిల్లీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మకానికి పెట్టవద్దని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) సహా పలు కార్మిక సంఘాలు కేంద్రాన్ని కోరాయి. ఈ కర్మాగారంతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను కూడా విక్రయించవద్దని.. సాధ్యమైనంత మేరకు వాటికి నిధులు కేటాయించి బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌కు సన్నాహకంగా నిర్వహించే ప్రి-బడ్జెట్ సంప్రదింపుల్లో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సోమవారం 11 కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. వారి నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. సంఘ్ పరివార్ అనుబంధ సంస్థ అయిన బీఎంఎస్ ప్రతినిధి పవన్‌కుమార్ విశాఖ ఉక్కు కర్మాగారంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాన్ని ఈ సందర్భంగా తీవ్రంగా వ్యతిరేకించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త పింఛను పథకాన్ని రద్దు చేసి పాత పింఛను పథకాన్నే (ఓపీఎస్) పునరుద్ధరించాలని సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఇళ్లలో పనిచేసేవారి డేటా సేకరించి వారికి సామాజిక భద్రత కల్పించే విషయం పరిశీలిస్తామని నిర్మల హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈపీఎఫ్ కనీస పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని, ఐటీ మినహాయింపు పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని, 'గిగ్' కార్మికులకు కనీస వేతనాలు కల్పించాలని సంఘాలు విజ్ఞప్తి చేశాయి.

ఓట్ల కోసం నా తండ్రిని దూషిస్తారా?



» బిధూరీ అనుచిత వ్యాఖ్యలపై ఢిల్లీ సీఎం ఆతిశీ కన్నీరు

న్యూఢిల్లీ, జనవరి 6: ఢిల్లీ సీఎం ఆతిశీ మీడియా ముందు భావోద్వేగానికి గురయ్యారు. కల్కాజీ అసెంబ్లీ స్థానంలో తనపై పోటీచేస్తున్న బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరీ వృద్ధుడైన తన తండ్రిని నిందించారని కన్నీరు పెట్టుకున్నారు. ఓట్ల కోసం ఓ వృద్ధుడిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఆతిశీ తన తండ్రినే మార్చేశారని.. ఇదివరకు తన ఇంటిపేరు మర్లేనా అని చెప్పారని.. ఇప్పుడు సింగ్ అంటున్నారని బిధూరి ఆదివారం ఓ సభలో అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఆతిశీ సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఉబికివచ్చే కన్నీటిని ఆపుకోవడానికి విఫలయత్నం చేస్తూ.. 'నా తండ్రి తన జీవితమంతా ఉపాధ్యాయుడిగా పనిచేశారు. ప్రస్తుతం ఎవరి సాయమూ లేకుంటే నడిచే పరిస్థితుల్లో లేరు. ఎన్నికల కోసం అలాంటి వృద్ధుడిని నిందించే స్థాయికి బిధూరి దిగజారారు. దేశ రాజకీయాలు ఇంత దిగజారుతాయని నేననుకోలేదు. నా తండ్రిని దూషిస్తూ ఆయన ఓట్లు అడుగుతున్నారు' అని అన్నారు.


సోడి కోస్రా మాడ్కమి హరీశ్ పండ్రూ సోముడు సుబర్నాథ్ సుదర్శన్

మావోయిస్టుల మందుపాతర.. 8 మంది జవాన్ల మృతి

(మొదటి పేజీ తరువాయి)

తిరిగి వస్తుండగా.. ఈ ఘటన చోటుచేసుకుంది. ఇద్దరుముగ్గురు జవాన్ల తల భాగాలు గుర్తించేలా ఉండగా.. మిగతా వారి శరీర భాగాలు చెల్లాచెదురయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. ఇటీవల దక్షిణ అబూజ్‌మడ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సల్స్(ఇద్దరు మహిళలు) మృతిచెందారు. ఆ తర్వాత దంతేవాడ, బీజాపూర్, నారాయణపూర్, బస్తర్, కొండగాం జిల్లాల డీఆర్జీ బలగాలు.. సీఆర్పీఎఫ్ జవాన్లు కూంబింగ్ కొనసాగించారు. అదనపు బలగాలు రావడంతో పలు బృందాలు వెనుదిరిగాయి. ఈ క్రమంలో దంతేవాడ డీఆర్జీకి చెందిన జవాన్లు బామన్ సోడి, బుద్రామ్ కోస్రా, దుమ్మ మాడ్కమి, హరీశ్, పాండ్రూ, సోముడు, సుబర్నాథ్ యాదవ్, సుదర్శన్ వెట్టి, డ్రైవర్(పేరు తెలియాల్సి ఉంది)తో కలిసి ఎస్‌యూవీ(సీజీ17-కేడబ్ల్యూ7937)లో.. మరికొందరు జవాన్లు ఇతర వాహనాల్లో సోమవారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమయ్యారు. వరుస ఎన్‌కౌంటర్లతో రగిలిపోతున్న మావోయిస్టులు.. ఈ సమాచారం అందుకుని, బెద్రా గ్రామశివారులో కుత్రు రహదారిపై సుమారు 50 కిలోల ఐఈడీని అమర్చారు. సోమవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో.. జవాన్ల వాహనాల శ్రేణి ఆ ప్రాంతాన్ని దాటుతుండగా.. చివరి వాహనం ఆ ప్రాంతానికి రాగానే ఐఈడీని పేల్చారు. శక్తిమంతమైన పేలుడు జరగడంతో.. వాహనం 25 అడుగుల ఎత్తుకు ఎగిరి.. 30 అడుగుల దూరంలో పడింది. డ్రైవర్, 8 మంది జవాన్లు మృతిచెందారు. మృతదేహాలు ఛిద్రమైపోయాయి. డ్రైవర్ మృతదేహం చిన్నచిన్న ముక్కలుగా తెగిపోయిందని పోలీసులు తెలిపారు. పేలుడు ధాటికి ఈ వాహనానికి ముందున్న ఎస్‌యూవీలో వెళ్తున్న ఏడుగురు జవాన్లకు గాయాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. ముందు వాహనాల్లో ఉన్న జవాన్లు వెంటనే కిందకు దిగి.. సహాయక చర్యలు చేపట్టారు. జవాన్లపై మావోయిస్టుల దాడిని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌సాయి ఖండించారు. వీర జవాన్ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 2026 నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తామని అమిత్‌షా పునరుద్ఘాటించారు.

ఛత్తీస్‌గఢ్ జర్నలిస్టు హత్యకేసు.. హైదరాబాద్‌లో నిందితుడి అరెస్టు

చర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాకు చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు ముఖేశ్ చంద్రాకర్ హత్యకేసు నిందితుడిని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఆదివారం హైదరాబాద్‌లో అరెస్టు చేసింది. నిందితుడు సురేశ్ చంద్రాకర్ హైదరాబాద్‌లోని తన డ్రైవర్ ఇంట్లో తలదాచుకున్నట్లు గుర్తించామని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసేందుకు 200 సీసీ కెమెరాల ఫుటేజీని జల్లెడపట్టామని, 300 సెల్‌ఫోన్ల కాల్ డేటా రికార్డ్(సీడీఆర్)ను విశ్లేషించామని చెప్పారు. ఓ ఆంగ్ల జాతీయ చానల్‌కు వార్తలు అందజేసే ముఖేశ్ ఈ నెల 3న దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.! ఆయన మృతదేహం ఓ సెప్టిక్ ట్యాంకులో లభించగా.. పోస్టుమార్టం నివేదికలో అతని తలపై 15 దెబ్బలు, కాలేయంలో నాలుగు పోట్లు, గుండె భాగంలో గాయాలు, మెడ ఎముకలు నాలుగు చోట్ల విరిగి ఉన్నట్లు తేలింది. ఐదు పక్కటెముకలు విరిగినట్లు వైద్యులు గుర్తించారు. "నా 12 ఏళ్ల కెరీర్‌లో ఎన్నడూ ఇంతటి దారుణ హత్యను నేను చూడలేదు" అని పోస్టుమార్టంలో పాల్గొన్న ఓ వైద్యుడు మీడియాకు చెప్పారు.

సిరియాలో ఉద్యోగులకు జీతాలు 400% పెంపు

డమాస్కస్, జనవరి 6: సిరియాలో ప్రభుత్వ ఉద్యోగులకు ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ ఆర్థిక మంత్రి మొహమ్మద్ అబ్జాద్ తీపి కబురు చెప్పారు. వచ్చే నెల నుంచి వారి జీతాలను 400% పెంచనున్నట్లు ఆయన ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అతి తక్కువగా నెలకు 25 డాలర్ల (రూ. 2,140) జీతం మాత్రమే అందుకున్నారని, దాంతో వారు ఆర్థికంగా తీవ్ర కష్టాలు చవిచూశారని చెప్పారు. ఆర్థిక భద్రతతో పాటు ఉద్యోగుల్లో సమర్థత, జవాబుదారీతనం పెంచడానికి జీతాలను 400% పెంచుతున్నట్లు తెలిపారు. దీని వల్ల ప్రభుత్వంపై సుమారు వెయ్యి కోట్ల భారం పడుతుందని అంచనా వేశామని చెప్పారు. దీని కోసం పన్నుల విధింపులో మార్పులు చేయడానికి నిర్ణయించామని పేర్కొన్నారు. అంతర్యుద్ధం వల్ల సిరియా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, అయితే తమ నూతన ప్రభుత్వానికి అరబ్ దేశాలు సాయం చేస్తామని హామీ ఇచ్చాయన్నారు.

కక్ష్యలో అలసంద మొలకలు.. వాటికి రెండేసి ఆకులు..

ఇస్రో 'క్రాప్స్' ప్రయోగం విజయవంతం



బెంగళూరు, జనవరి 6: పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగంలో భాగంగా ఇస్రో రోదసీలోకి పంపిన అలసంద విత్తనాలు మొలకెత్తాయని, వాటికి రెండేసి ఆకులు కూడా వచ్చాయని ఇస్రో సోమవారం ప్రకటించింది. రాకెట్ నాలుగో దశలోని పీఎస్ఎల్వీ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్ (పోయెమ్-4) ద్వారా 24 పేలోడ్లను ఇస్రో రోదసీలోకి పంపింది. వాటిలో కంపాక్ట్ రిసెర్చ్ మాడ్యూల్ ఫర్ ఆర్బిటల్ ప్లాంట్ స్టడీ (క్రాప్స్) అనే పరికరం కూడా ఉంది. దీన్ని తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) అభివృద్ధి చేసింది. అంతరిక్షంలో సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణంలో మొక్కల ఎదుగుదలపై అధ్యయనం చేసేందుకు రూపొందించిన ప్లాట్‌ఫాం ఇది. దీనిలో ఎనిమిది అలసంద గింజలు పెట్టి స్పేస్‌లోకి పంపించగా.. అవి నాలుగు రోజుల్లోనే మొలకెత్తాయని, ఇప్పుడవి రెండు ఆకుల దశకు వచ్చాయని ఇస్రో తెలిపింది. 'ఈ విజయం అంతరిక్షంలో మొక్కలు పెంచగల ఇస్రో సామర్థ్యాన్ని తెలియజేయడమే కాకుండా.. భవిష్యత్తులో దీర్ఘకాలిక మిషన్లకు అవసరమైన విలువైన సమాచారాన్ని అందిస్తుంది' అని ఇస్రో ఎక్స్‌లో పేర్కొంది. వ్యోమగాములకు ఆహారాన్ని ఉత్పత్తి చేయగల, గాలి, నీటిని పునరుత్పత్తి చేయగల లైఫ్ సపోర్ట్ వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి, మొక్కలు సూక్ష్మ గురుత్వాకర్షణకు అనుగుణంగా ఎలా మారతాయో అర్థం చేసుకోవడానికి ఈ ప్రయోగం చాలా ముఖ్యమని ఇస్రో వెల్లడించింది. 'క్రాప్స్' విజయం అంతరిక్షంలో సుస్థిర మానవ ఉనికి దిశగా ఆశాజనకమైన ముందడుగు అని పేర్కొంది.

స్పేడెక్స్ డాకింగ్ రెండు రోజులు వాయిదా

ఇస్రో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) మిషన్‌లో కీలకమైన డాకింగ్ ప్రక్రియ రెండు రోజులపాటు వాయిదా పడింది. గత నెల 30న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా జంట ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చిన సంగతి తెలిసిందే. ఈ మిషన్‌లోని ఛేజర్ (ఎస్‌డీఎక్స్01), టార్గెట్ (ఎస్‌డీఎక్స్02) ఉపగ్రహాలను ఈ నెల 7న (మంగళవారం) అనుసంధానించాలని ఇస్రో భావించింది. అయితే.. మరింత కచ్చితత్వం కోసం క్షేత్రస్థాయిలో కొన్ని సిమ్యులేషన్లు పూర్తిచేసేందుకు డాకింగ్ ప్రక్రియను ఈ నెల 9వ తేదీకి వాయిదా వేయాలని నిర్ణయించినట్టు ఇస్రో సోమవారం తెలిపింది.

హైడ్రాకు 83 ఫిర్యాదులు

- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజావాణి
- పార్కులు, ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాలాల ఆక్రమణపై ఫిర్యాదుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పౌరుల నుంచి నేరుగా ఫిర్యాదుల స్వీకరణను హైడ్రా ప్రారంభించింది. ఇన్నాళ్లూ ఆన్‌లైన్ వేదికగా ఫిర్యాదులు తీసుకున్న హైడ్రా.. సోమవారం ప్రజావాణిని చేపట్టింది. ఉదయాన్నే టోకెన్లు ఇచ్చిన అధికారులు.. రెండు విడతలుగా ఫిర్యాదులను స్వీకరించారు. చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, నాలాల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు మాత్రమే ఈ సందర్భంగా స్వీకరించారు. ఇతర విభాగాలకు సంబంధించినవైతే.. ఆయా శాఖల ఉన్నతాధికారులను కలవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు 83 ఫిర్యాదులు రాగా, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా పాల్గొన్నారు. ఫిర్యాదుదారులు చెప్పే విషయాలను ఆసాంతం విన్న కమిషనర్.. ఆయా అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వారంలో నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. అధికారుల మొబైల్ నంబర్లను ఫిర్యాదుదారులకు ఇచ్చి.. వారితో టచ్‌లో ఉండాలని పేర్కొన్నారు. 3వారాల అనంతరం తనను మరోసారి కలిస్తే తీసుకున్న/తీసుకోబోయే చర్యలు చెబుతామన్నారు.


ఫిర్యాదుదారు సమస్య వింటున్న రంగనాథ్

మాజీ సైనికుడి ఫిర్యాదు

ప్రభుత్వం తనకు కేటాయించిన ఇంటి స్థలంతో పాటు పక్కనున్న పార్కు స్థలాన్ని ఆక్రమించిన మహిళపై చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లికి చెందిన మాజీ సైనికుడు సీతరామరాజు కోరారు. జవహర్‌నగర్‌లో సర్కారు భూమిని నోటరీలు చేసి విక్రయిస్తున్నారని, మొత్తం 6వేల ఎకరాల్లో 2500 ఎకరాలు మాత్రమే మిగిలిందని, దానిని కూడా ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ముఖేశ్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అక్కడ ఒకే వ్యక్తి 15 ఎకరాలను కాజేసే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. నీటిపారుదల శాఖ నాలాను ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని 60 గజాల చొప్పున ప్లాట్లు చేసి అమ్ముతున్నారని చిలుకా నగర్ కార్పొరేటర్ భర్త ప్రవీణ్ ముదిరాజ్ రంగనాథ్ దృష్టికి తీసుకొచ్చారు. అనాజ్‌పూర్‌లో తన ప్లాటుకు ఒకవైపు ఉన్న రహదారిని పక్క ప్లాటుతో కలిపి విక్రయించారని, అదేంటని అడిగితే తనపై అట్రాసిటీ కేసు నమోదు చేశారని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఒకరు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ అనుమతుల పేరిట ఒకే స్థలానికి రెండు, మూడు లే అవుట్లు వేసి విక్రయించారని హయత్‌నగర్‌కు చెందిన ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేశారు. హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట, కుంట్లూరు తదితర ప్రాంతాల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. సాధారణంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వస్తాయనుకుంటే.. అందుకు భిన్నంగా తూర్పు వైపు ప్రాంతాల నుంచి వచ్చాయని అధికారులు చర్చించుకోవడం కనిపించింది.

రాష్ట్రంలో మహిళా ఓటర్లే అధికం

- మొత్తం ఓటర్లు 3,35,27,925 మంది
- మహిళలు 1,68,67,735, పురుషులు 1,66,41,489 మంది
- సవరించిన ఓటర్ల జాబితా వెల్లడించిన ఎన్నికల సంఘం

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ప్రకటించిన సవరణ ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం విడుదల చేసిన ఈ జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం 3,35,27,925 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో మహిళలు 1,68,67,735, పురుషులు 1,66,41,489, థర్డ్ జెండర్ ఓటర్లు 2,829 మంది ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే.. 7,65,982 మందితో అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గంగా శేరిలింగంపల్లి నిలిచింది. తర్వాతి స్థానంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం (7,45,155 మంది ఓటర్లు) ఉంది. అతితక్కువగా భద్రాచలం నియోజకవర్గంలో 1,54,134 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి 18-19 ఏళ్ల వయసున్న 5,45,026 మంది ఓటు హక్కు పొందారు. 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 2,22,091, దివ్యాంగులైన ఓటర్లు 5,26,993, ఎన్ఆర్ఐ ఓటర్లు 3,591 మంది ఉన్నారు. 2024 ఫిబ్రవరిలో ఎన్నికల సంఘం వెల్లడించిన జాబితాతో పోల్చితే.. ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 4,90,318 పెరిగింది. పెరిగిన ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా గతంలో ఉన్న 35,358 పోలింగ్ స్టేషన్లకు అదనంగా 551 పెంచడంతో వాటి సంఖ్య 35,907కు చేరింది.

ఉపాధి రంగాలవైపు యువతను ప్రోత్సహిస్తాం

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): భారీగా ఉపాధి అవకాశాలున్న రంగాలవైపు రాష్ట్ర యువతను ప్రోత్సహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. మెరైన్ రంగంలో దేశంలో వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలున్నాయని ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య పాఠ్యాంశాల్లోనూ మార్పులు చేస్తున్నామని, పరిశ్రమలతో అనుసంధానం అవుతున్నామన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి రూపొందించిన నూతన సంవత్సర డైరీ, టేబుల్ క్యాలెండర్‌ను ఆయన.. వైస్ చైర్మన్లు ఆచార్య ఈ.పురుషోత్తం, ఆచార్య ఎస్‌కే.మహమూద్‌లతో కలిసి విడుదల చేశారు. అనంతరం బాలకిష్టారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ దిశగా ఈ నెల 7, 8న హెచ్ఐసీసీలో జాతీయస్థాయి సదస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఉపాధి అవకాశాలు ఎక్కువుండే మరిన్ని కోర్సులు ప్రారంభిస్తామని, ఇందులో బీఏ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ కూడా ఉందని తెలిపారు.

డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంతో పసికందు మృతి

- వికారాబాద్ ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన

వికారాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంతో రెండు రోజుల పసికందు మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం జరిగింది. నవాబుపేట మండలం మాదిరెడ్డిపల్లికి చెందిన భిక్షపతి, స్వప్న దంపతులకు జనవరి 4న వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మగబిడ్డ జన్మించాడు. సోమవారం తెల్లవారుజామున బాబుకి ఎక్కిళ్లు ప్రారంభం కాగా డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో... ఎక్కిళ్లు ఎక్కువై స్పృహ కోల్పోయాడు. పిల్లల డాక్టర్ వచ్చి చూసి చనిపోయినట్లు నిర్ధారించారు. డ్యూటీ డాక్టర్ నిర్లక్ష్యంతోనే తమ బాబు మరణించాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. బాబు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఎంపీవీ గురించి భయం వద్దు

- ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొంటాం
- అన్ని రకాల వైద్య సదుపాయాలున్నాయి
- తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర



హైదరాబాద్, జనవరి6(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మెటానిమో వైరస్(హెచ్ఎంపీవీ) అనేది కొత్త వైరస్ కాదని, 2001 నుంచే ప్రపంచవ్యాప్తంగా ఈ వైరస్ వ్యాప్తిలో ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. ఈ వైరస్ శ్వాసకోశ వ్యవస్థపై స్వల్ప ప్రభావమే చూపిస్తుందన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు అతని నోటి నుంచి వచ్చే తుంపర్ల ద్వారా మరొకరికి వైరస్ వ్యాపిస్తుందన్నారు. చైనాలో ఈ ఏడాది హెచ్ఎంపీవీ కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్నట్టు తెలిసిందని చెప్పారు. ఇతర దేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులతో, మన రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నారని చెప్పారు. ఈ వైరస్ విషయంలో ప్రస్తుతానికి భయపడాల్సిన అవసరం లేదని, జాగ్రత్తగా ఉంటే సరిపోతుందన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి పరిస్థితిని అయినా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ సిద్ధంగా ఉందన్నారు. డిసీజ్ సర్వైలెన్స్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, అన్నిరకాల వనరులతో సిద్ధంగా ఉండాలంటూ ఉన్నతాధికారులను, జిల్లా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా నిరాధార, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తే, ప్రభుత్వం చాలా సీరియస్‌గా పరిగణిస్తుందని హెచ్చరించారు.

కాకినాడ నుంచి సండూర్ దాకా!

విజయసాయిపై ఈడీ ప్రశ్నల వర్షం.. కాకినాడ 'డీల్'పై సుదీర్ఘ విచారణ.. 'సండూర్'పైనా ప్రశ్నలు


- పెట్టుబడులు ఎక్కడివని ఆరా
- కాకినాడ పోర్టు, సెజ్‌లపైనా ప్రశ్నలు
- అవసరమైతే మళ్లీ పిలిపిస్తామన్న ఈడీ

హైదరాబాద్/అమరావతి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీపోర్టు, సెజ్‌లో వాటాలను బలవంతంగా లాగేసుకున్న కేసులో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. 'కాకినాడ'కే పరిమితం కాకుండా... జగన్ అక్రమాస్తుల కేసులో కీలకమైన 'సండూర్ పవర్'లో పెట్టుబడులపైనా ప్రశ్నలు సంధించారు.. అనూహ్యంగా సండూర్ కేసు తెరపైకి రావడంతో విజయసాయి అవాక్కయినట్లు తెలిసిది.. కాసేపు ఆగి 'తెలియదు', 'గుర్తు లేదు' అని బదులిచ్చినట్టు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం...

కాకినాడ సీ పోర్ట్స్, సెజ్‌ల్లోని తన వాటాను వైసీపీ హయాంలో బలవంతంగా లాగేసుకున్నారంటూ ప్రముఖ వ్యాపారవేత్త కర్నాటి వెంకటేశ్వరరావు (కేవీ రావు) ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతోంది. ఈ వ్యవహారంలోని మనీ ల్యాండరింగ్ కోణంపై ఈడీ దృష్టి సారించింది. నిందితులను ఒక్కొక్కరిగా పిలిచి విచారిస్తోంది. ఈ క్రమంలో విజయసాయి సోమవారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. సుమారు ఆరు గంటలకు పైగా సాగిన విచారణలో కాకినాడ సెజ్, కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ షేర్ల బదలాయింపునకు సంబంధించిన అంశాలపై ఈడీ అధికారులు ప్రశ్నించారు. షేర్లకు సంబంధించిన నగదు బదలాయింపులపైనా అధికారులు ఆరా తీశారు. రంగనాథం అండ్ కంపెనీ, సంతానం అండ్ కంపెనీలను ఎవరు ప్రభుత్వానికి పరిచయం చేశారు... 'అరబిందో' శరత్ చంద్రారెడ్డి ఎలా పరిచయం అంటూ ప్రశ్నించారు. దానిపై విజయసాయి రెడ్డి ఇచ్చిన సమాధానాలను ఈడీ అధికారులు రికార్డు చేశారు. ఎక్కువ ప్రశ్నలకు ఆయన సమాధానం దాట వేసినట్లు తెలిసింది. 'తెలియదు, నాకు సంబంధం లేదు' అని చెప్పినట్లు సమాచారం.

సండూర్ గురించీ తెలియదనే...

సండూర్ పవర్ కేసులో జగన్ ఏ1 కాగా, విజయసాయి రెడ్డి ఏ2గా ఉన్నారు. ఆ కంపెనీ ఆడిటర్ కూడా ఆయనే. కాకినాడ పోర్టు, సెజ్‌కు సంబంధించిన ప్రశ్నలకు తగిన 'సమాధానాల'తో సిద్ధమై వెళ్లిన సాయిరెడ్డి... అక్కడ సండూర్ పవర్ అంశం తెరపైకి వచ్చేసరికి షాక్‌కు గురైనట్లు తెలిసింది. 'సండూర్ పవర్‌లో పెట్టుబడులు ఎక్కడ నుంచి వచ్చాయి?' అని ప్రశ్నించగా... 'తెలియదు' అని బదులిచ్చారు. "ఈ కేసులో మీరు రెండో నిందితుడు. పైగా కంపెనీ ఆడిటర్. అయినా పెట్టుబడుల గురించి తెలియదా' అని ప్రశ్నించగా... "కావొచ్చు. ఎప్పుడో ఇరవై సంవత్సరాల క్రితం వ్యవహారం అది. ఇప్పుడెలా గుర్తుంటుంది?" అని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. పెట్టుబడుల విషయాలు ఇప్పుడు తనకేవీ గుర్తు లేవని చెప్పినట్లు తెలిసింది. అవసరమైతే మళ్లీ విచారణకు పిలుస్తామని సాయిరెడ్డిని ఈడీ అధికారులు పంపించారు. ఈడీ విచారణ తర్వాత బయటికి వచ్చిన సాయి రెడ్డి.. ఈడీ పాత కేసుల్లో ఉచ్చు బిగిస్తున్నట్లు అనుమానంగా ఉందని తన సన్నిహితులకు చెప్పినట్లు సమాచారం.



కేవీ రావు ఎవరో తెలియదు: సాయిరెడ్డి

ఈడీ విచారణ అనంతరం విజయసాయి రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ అధికారులు నన్ను ప్రశ్నించారు. నేను మే 2020లో కేవీ రావుకు ఫోన్ చేసి విక్రాంత్ రెడ్డితో కాకినాడ సీ పోర్ట్స్ విషయం మాట్లాడాలని చెప్పాననేది నాపై ప్రధాన ఆరోపణ. రంగనాథన్ అండ్ కంపెనీ చార్టెడ్ అకౌంటెంట్స్, శ్రీధరన్ అండ్ కంపెనీ చార్టెడ్ అకౌంటెంట్స్...ఈ రెండు కంపెనీలను ఫోరెన్సిక్ ఆడిటింగ్‌కు నేను సిఫారసు చేశానని కేవీ రావు ఆరోపణలు చేశారు. ఈ విషయంలో ఈడీ అధికారులు ప్రశ్నించగా, కేవీ రావు అనే వ్యక్తి ఎవరో నాకు తెలియదు అని చెప్పాను. కేవీ రావు ఫిర్యాదులో వాస్తవాలు ఉంటే ఆయన పేరులోనే వెంకటేశ్వరరావు అని ఉంది కాబట్టి... తిరుపతి వెంకటేశ్వర స్వామి సమక్షంలో ఆయన ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలు వాస్తవమని స్వామివారి ముందు చెప్పాలి. మా ఇద్దరికి క్రాస్ ఎగ్జామినేషన్ ఏర్పాటు చేయాలని అడిగాను. కేవీ రావు ఇచ్చిన ఫిర్యాదు తప్పుడు ఫిర్యాదు అని రుజువైనా...ఆ కేసును ఏపీ ప్రభుత్వం విత్‌డ్రా చేసుకున్నా... కోర్టు ఈ ఫిర్యాదు తప్పుడు ఫిర్యాదు అని చెప్పినా... కేవీ రావుపై సివిల్, క్రిమినల్ పరువునష్టం దావా వేస్తానని ఈడీ అధికారులకు చెప్పాను. ఈడీ అడిగిన 25 ప్రశ్నలకు సమాధానం చెప్పాను. సుబ్బారెడ్డి కొడుకుగా మాత్రమే విక్రాంత్ రెడ్డి తెలుసునని చెప్పాను" అని విజయసాయి రెడ్డి మీడియాకు వెల్లడించారు.

ప్రజాప్రతినిధుల కోర్టులో జగన్‌కు ఎదురుదెబ్బ

- 'పాస్‌పోర్టు' పిటిషన్‌ను కొట్టేసిన న్యాయస్థానం

విజయవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తాను విదేశాలకు వెళ్లడానికి వీలుగా పాస్‌పోర్టు ఇప్పించాలని, దీనిపై పాస్‌పోర్టు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. విదేశాల్లో ఉన్న తన కుమార్తెల జన్మదిన వేడుకలకు వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని జగన్ గత ఏడాది ఆగస్టులో హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఐదేళ్ల కాలానికి పాస్‌పోర్టు ఇవ్వాలని సీబీఐ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టు మాత్రం.. పాస్‌పోర్టును ఏడాది మాత్రమే పునరుద్ధరిస్తామని, జగన్ తమ ముందు హాజరై రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఆ షరతులను పాక్షికంగా సవరించారు. ఐదేళ్ల పాటు పాస్‌పోర్టు జారీకి వీలుగా ఎన్‌వోసీ జారీ చేయాలని ప్రజాప్రతినిధుల కోర్టును ఆదేశించారు. గత ఏడాది సెప్టెంబరు 20వ తేదీతో జగన్ పాస్‌పోర్టు గడువు ముగిసిపోయింది. దీనిపై వారం క్రితం ఆయన తరఫున న్యాయవాది వెంకటేశ్వర్లు ప్రజాప్రతినిధుల కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. పాస్‌పోర్టు ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది తెల్లాప్రగడ సుబ్బారావు వాదనలు వినిపిస్తూ.. జగన్ పాస్‌పోర్టుకు 2024 సెప్టెంబరులోనే గడువు ముగిసిందని.. గడువు తేదీకి ఆరు నెలలకు ముందే పాస్‌పోర్టు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసి ఉందని గుర్తుచేశారు. ఆయన వాదనలతో ఏకీభవించిన న్యాయాధికారి ఎస్.శ్రీదేవి.. పాస్‌పోర్టు కోసం ఆ కార్యాలయంలో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశిస్తూ జగన్ పిటిషన్‌ను కొట్టివేశారు.

రెండోసారీ సిండికేటయ్యారు!

- జొన్నల కొనుగోళ్లలో గుత్తేదారుల తీరు
- తక్కువ ధరకు టెండర్లు.. రద్దు చేసిన అధికారులు

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ జొన్నల విక్రయ టెండర్లు రద్దు చేసింది. గుత్తేదారులు తక్కువ ధర కోట్(నమోదు) చేయడంతో టెండర్లు రద్దు చేశారు. 2023-24 యాసంగి సీజన్‌లో రైతుల నుంచి కనీస మద్దతు ధరకు 94 వేల మెట్రిక్ టన్నుల జొన్నలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. వీటిని వేలంపాట ద్వారా విక్రయించేందుకు మార్క్‌ఫెడ్ టెండర్లు పిలిచింది. తొలిసారి టెండరు నోటిఫికేషన్ విడుదల చేస్తే 15 మంది గుత్తేదారులు పాల్గొన్నారు. క్వింటాలుకు రూ.1,800 చొప్పున కోట్ చేశారు. కాని మార్క్‌ఫెడ్ రైతుల నుంచి క్వింటాలుకు రూ. 3,180 చొప్పున కనీస మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు చేసింది. గుత్తేదారులు చాలా తక్కువ ధర కోట్ చేయడంతో ఆ టెండర్లను రద్దు చేశారు. ఇటీవల రెండోసారి టెండర్లు పిలిచారు. ఈసారి 12 మంది గుత్తేదారులు రెండోసారి కూడా సిండికేట్‌గా ఏర్పడి... క్వింటాలుకు రూ.1,800 చొప్పున బిడ్లు దాఖలు చేశా రు. ఈ టెండర్లను కూడా రద్దు చేసినట్లు మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డి, ప్రొక్యూర్మెంట్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు.

పెరిగిన ఏపీ తీరం పొడవు

- తాజా లెక్కలతో 1053.07 కి.మీ.గా తీరం
- దేశంలో మొత్తం 11,098.81 కి.మీ. తీర ప్రాంతం
- మలుపులు, ఒంపుల లెక్కతో పెరిగిన పొడవు

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరం పొడవు పెరిగింది. గతంలో 973.70 కిలోమీటర్లుగా ఉన్న తీరం పొడవు 79.37 కి.మీ. (8.154 శాతం) పెరిగి 1053.07 కి.మీ.కు చేరింది. అదే సమయంలో దేశం తీరం పొడవు 7,516.60 కి.మీ. నుంచి 11,098.81(48 శాతం) కి.మీ.లకు పెరిగినట్టు తాజాగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇండియన్ నేవల్ హైడ్రోగ్రాఫిక్ ఆఫీస్, సర్వే ఆఫ్ ఇండియా కలిసి 1970లో చేసిన సంయుక్త సర్వే ప్రకారం 973.7 కి.మీ. తీర ప్రాంతంగా గుర్తించారు. అయితే నేషనల్ మారిటైమ్ సెక్యూరిటీ కో-ఆర్డినేటర్ రూపొందించిన విధి విధానాల మేరకు నిర్వహించిన రీ వెరిఫికేషన్‌లో ఏపీలో తీరం పొడవు 1,053.07 కి.మీ.కు పెరిగినట్టు హోం మంత్రిత్వ శాఖ నివేదికలో వెల్లడైంది. ఇటీవల మలుపులు, ఒంపులు కూడా లెక్కించడంతో తీరం పొడవు పెరిగిందని విశాఖలో జాతీయ సముద్ర అధ్యయన విజ్ఞాన సంస్థ చీఫ్ సైంటిస్ట్ వీవీఎస్ఎస్ శర్మ చెప్పారు. తాజా వివరాల ప్రకారం.. దేశంలో సముద్ర తీరం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీ మూడో స్థానం(గతంలో రెండో స్థానం)లో నిలిచింది. గతంలో ప్రథమ స్థానంలో ఉన్న గుజరాత్ ఇప్పుడు 2,340.62 కి.మీ.ల పొడవుతో అదే స్థానంలో కొనసాగగా, 1,068.69 కి.మీ.లతో తమిళనాడు రెండో స్థానంలో నిలిచింది. అలాగే గతంలో దేశంలో తీర ప్రాంతం 7,516.60 కి.మీ.లుగా ప్రకటించారు. నూతన విధివిధానాలను అనుసరించి భారత తీరం పొడవు 3,582.21 కి.మీ. పెరిగి 11,098.81 కి.మీ.లకు చేరిందని వెల్లడైంది.

అట్టడుగు వర్గాల బాగోగులు మోదీకి పట్టవు

- దేశ సంపద కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం: డి. రాజా

ఖైరతాబాద్, హైదరాబాద్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తమ చెమట చుక్కలను ధారపోసి దేశ సంపదను సృష్టిస్తున్న 90 శాతం మంది దళిత, ఆదివాసీ, అట్టడుగు శ్రామిక వర్గాల బాగోగులు ప్రధాని మోదీకి పట్టవని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా విమర్శించారు. పేదలు కాయకష్టంతో సృష్టించిన సంపదను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడీఆర్ఎం)జాతీయ రెండో మహాసభలు సోమవారం ప్రారంభమయ్యా యి. మహాసభలను డి.రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజా మా ట్లాడుతూ.. దేశంలో కుల వ్యవస్థను నిర్మూలించేందుకు వామపక్ష ప్రగతిశీల శక్తులన్నీ ఏకంకావాలని రాజా పిలుపునిచ్చారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, దళిత సోషల్ ముక్తి మంచ్ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ రాధాకృష్ణన్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఫామ్ డీ విద్యార్థి మృతి

- వరంగల్ జిల్లా మగ్దుంపురం ప్రైవేట్ హాస్టల్‌లో ఘటన
- వార్డెన్ నిర్లక్ష్యమే కారణమంటున్న సహ విద్యార్థులు


అవినాష్‌రెడ్డి(ఫైల్)

నర్సంపేట టౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ(ఫామ్-డీ) విద్యార్థి మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లాలో జరిగింది. హాస్టల్ విద్యార్థులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వి గ్రామానికి చెందిన కొండల్‌వాడీ దత్తారెడ్డి-లక్ష్మీ దంపతుల ఏకైక కుమారుడు కొండల్‌వాడీ అవినాష్‌రెడ్డి(18) నర్సంపేట మండలం మగ్దుంపురంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ మొద టి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ఎదురుగా ఉన్న ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం హాస్టల్ వార్డెన్ హాస్టల్ భవనంపైనున్న ట్యాంక్‌లోకి నీరు రావడం లేదని మోటార్‌లో నీరు పోయాలని అవినాష్‌రెడ్డిని పురమాయించి కరెంట్ స్విచ్ ఆన్‌చేసేందుకు వెళ్లాడు. నీళ్లు పోస్తుండగా మోటార్ పైపు పక్కనే విద్యుత్ వైరుకు అవినాష్‌రెడ్డి ఎడమచేయి తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే హాస్టల్ నిర్వాహకుడు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రి వైద్యులు అవినాష్‌రెడ్డికి వైద్యపరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వల్లే అవినాష్‌రెడ్డి మృతి చెందాడని, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

9న నూతన ఇంధన పాలసీ

- పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు స్వీకరిస్తాం
- రాష్ట్రం వెలుపల కూడా థర్మల్, గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లు పెడతాం
- మున్ముందు మిగులు విద్యుత్తు రాష్ట్రంగా తెలంగాణ: భట్టి


అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు. మహ్మద్ అలీ షబ్బీర్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన వనరులకు ప్రాధాన్యం కోసం ఆ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈనెల 9న నూతన ఇంధన పాలసీని విడుదల చేయనున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. సోమవారం సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం ముందు జరిగిన కార్యక్రమంలో ఆయన జెన్‌కోలో ఎంపికైన 315 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, కెమిస్ట్‌లకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పదేళ్లపాటు ప్రత్యేక విధానం అంటూ లేకపోవడంతో ఇంధన రంగంలో పెట్టుబడులు రాలేదన్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు తగ్గకుండా విద్యుత్తు అందించాలని నిర్ణయించుకున్నామన్నారు. థర్మల్, గ్రీన్ ఎనర్జీని తేవాలని నిర్ణయం తీసుకున్నామని, రాష్ట్రం వెలుపల కూడా ప్లాంట్లు పెట్టనున్నామని పేర్కొన్నారు. ఒడిసాలో నైనీ బ్లాకును కేటాయించినా, గత ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తి దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఆ రాష్ట్ర సీఎంను కూడా కలిసి, నైనీ బ్లాకులో తవ్వకాలు చేపట్టే పనిని చేపట్టామన్నారు. ఆ బ్లాకు వద్ద కూడా థర్మల్ ప్లాంట్‌ను పెట్టనున్నామన్నారు. రాష్ట్రంలో సోలార్, పవన, హైడ్రోజన్, జలవిద్యుదుత్పాదన తేనున్నామన్నారు. 20 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన గ్రీన్ ఎనర్జీని తేనున్నామని, దీనికోసం కొత్త ఇంధన విధానాన్ని మంత్రివర్గంలో ఆమోదించామన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల ప్లాంట్లను పెట్టించనున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో తెలంగాణను మిగులు విద్యుత్తు రాష్ట్రంగా మార్చనున్నామని ప్రకటించారు. ఇంధన రంగంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా ఉండనుందన్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో ప్రధాన పాత్ర విద్యుత్తు రంగానిదేనన్నారు. ఈ సందర్భంగా సింగరేణికి చెందిన కార్మికుల పిల్లలకు కార్మికులుగా మిగలకుండా, దేశంలో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన, శిక్షణ కల్పించడానికి వీలుగా 'చెమట చుక్కలకు తర్ఫీదు' అనే పథకం లోగోను భట్టి ఆవిష్కరించారు.

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె విరమణ

గత 29 రోజులుగా సమ్మె చేపట్టిన తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె విరమించారు. పొరుగు సేవ, ఒప్పంద ప్రాతిపదికన నాలుగు క్లస్టర్ల పరిధిలో ఉన్న సుమారు 19 వేల మంది ఉద్యోగులు 30 డిమాండ్లతో సమ్మెకు దిగారు. డిసెంబరు 9న స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ చర్చలకు పిలిచినా వీరు వెళ్లలేదు. ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, అందరినీ టెర్మినేట్ చేయాలనే దిశగా ఆలోచన చేస్తుందనే ప్రచారం జరిగింది. దీంతో ఉద్యోగులు ఆందోళనకు గురయ్యారు. సోమవారం సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం నేతలు, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రొఫెసర్ కోదండరాం, ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నా రెడ్డి నేతృత్వంలో భట్టి విక్రమార్కను కలిశారు. ఆర్థికేతర అంశాలను పరిశీలిస్తామని, ఆర్థిక పరమైన విషయాలపై కేబినెట్ సబ్‌కమిటీలో చర్చిస్తామని వారికి భట్టి హామీ ఇచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్–అఫ్ఘాన్ వైరం!

అఫ్ఘానిస్థాన్‌మీద పాకిస్థాన్ వైమానికదాడులు జరిపి అనేకమంది ప్రాణాలు తీయడం గర్హనీయమని, ఖండిస్తున్నామని భారత దేశ విదేశాంగశాఖ ప్రతినిధి సోమవారం వ్యాఖ్యానించారు. ఎంతో మంది మహిళలు, పిల్లలు మరణించారంటూ ఘాటుగా విమర్శించడమే కాక, తన చేతగానితనానికి పొరుగుదేశాలను ఆడిపోసుకోవడం పాకిస్థాన్‌కు అలవాటేనని అన్నారాయన. దాదాపు పదిరోజుల క్రితం అఫ్ఘానిస్థాన్‌లోని తెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) స్థావరాల మీద పాకిస్థాన్ యుద్ధవిమానాలు బాంబులు కురిపించడంతో నలభై ఆరుమంది మరణించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రకటించిన తాలిబాన్ మరో నాలుగురోజుల్లోనే పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో దాడులు జరిపింది. ఈ వరుస దాడుల్లో మంచిచెడ్డలను అటుంచితే, అఫ్ఘానిస్థాన్ పక్షాన పాకిస్థాన్‌ను భారతదేశం గట్టిగా తప్పుబట్టడం మారుతున్న రాజకీయానికీ, హెచ్చుతున్న సాన్నిహిత్యానికీ నిదర్శనం.

పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో రెండువైపులా పెద్దసంఖ్యలో సైన్యాలు మోహరించివున్నాయని వార్తలు వస్తున్నాయి. తెహ్రీక్ తాలిబాన్‌మీద పాకిస్థాన్ వైమానికదాడులు చేయడం ఇది రెండోసారి. గత ఏడాది మార్చిలో కంటే ఇప్పుడు దాడులమీద తాలిబాన్ మరింత తీవ్రంగా స్పందించింది, ప్రతీకారం కూడా తీర్చుకుంది. అమెరికా అర్థంతరంగా అఫ్ఘానిస్థాన్‌ను వదిలేసి, తట్టాబుట్టా సర్దేసిన కొద్దిగంటల్లోనే, ఆ దేశం తాలిబాన్ల వశమైన విషయం తెలిసిందే. వారిని ఎదిరించలేక, అమెరికా శిక్షణ పొందిన అఫ్ఘాన్‌సైనికులు, పోలీసులు పరుగులు తీసిన దృశ్యాలు చూశాం. తాలిబాన్ల పునరాగమనంతో అఫ్ఘాన్లు వొణికిపోయారు. వందలాదిమంది దేశం విడిచిపోయారు. యావత్ ప్రపంచం తాలిబాన్ రాకకు భయపడుతూంటే, పాకిస్థాన్ మాత్రం ఎగిరిగంతేసింది. అమెరికా తనమాట విని దేశాన్ని తాలిబాన్‌కు వదిలేసినందుకు సంతోషించింది. అల్లా దయతోనే ఇదంతా జరిగిందన్నారు ఇమ్రాన్‌ఖాన్. అధికారాన్ని కైవసం చేసుకోవడానికి మార్గాన్ని సుగమంచేసిన తనపట్ల తాలిబాన్ విధేయంగా ఉంటుందని పాకిస్థాన్ పాలకులు భ్రమపడ్డారు. కానీ, అనతికాలంలోనే ఉభయుల మధ్యా వ్యవహారం పూర్తిగా చెడింది. గత అవతారానికి కాస్తంత భిన్నంగా, స్వతంత్రంగా వ్యవహరిస్తున్న తాలిబాన్ ఈ మారు పాకిస్థాన్ ఆదేశాలను, ఆలోచనలను లక్ష్యపెట్టలేదు.

ఇక, తాలిబాన్ ఆశీస్సులతోనే టీటీపీ తనపై ఇంతగా రెచ్చిపోతున్నదన్న పాకిస్థాన్ వాదన కాదనలేనిది. తాలిబాన్ మధ్యవర్తిత్వంతో 2021లో ఇమ్రాన్ ప్రభుత్వం టీటీపీతో చర్చలు జరిపింది. అవి ఫలితానివ్వకపోవడంతో పాటు, అమెరికా వదిలిపోయిన చాలా ఆయుధాలు ఈ సంస్థ చేతుల్లో పడటంతో అది మరింత బలోపేతమైంది. టీటీపీ విషయంలో పాకిస్థాన్ ఎప్పటికప్పుడు తాలిబాన్‌ను హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోయింది. టీటీపీని నియంత్రించిన పక్షంలో అందులోని సాయుధులంతా ఐసిస్‌వంటి సంస్థల్లో చేరిపోయి తన ఉనికికే ప్రమాదం తేవచ్చునని తాలిబాన్ భయం. ఇతర ఉగ్రసంస్థలను నిలువరించడానికి తాలిబాన్‌కు టీటీపీతో స్నేహం ఉపకరిస్తోంది. టీటీపీని పెంచిపోషిస్తున్నందుకు పాకిస్థాన్ తీవ్రంగా మండిపడుతున్నప్పటికీ తాలిబాన్ లక్ష్యపెట్టడం లేదు. పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతాలతో అది సాగిస్తున్న విధ్వంసానికి తాలిబాన్ పరోక్షంగా సాయపడుతున్నది కూడా. ఒకపక్క టీటీపీ, మరోపక్క బలూచ్, పష్తూన్ తిరుగుబాటుదారుల విధ్వంసకాండలతో పాకిస్థాన్ నలిగిపోతోంది. చైనా, సౌదీ పెట్టుబడులకు భద్రతకల్పించలేని స్థితికి అది జారుకుంది. తాలిబాన్‌తో నేరుగా యుద్ధానికి దిగి గెలిచేస్థితిలో పాకిస్థాన్ లేదు. కానీ, ఇలా అడపాదడపా సరిహద్దుల్లోకి చొరబడి, ఏవో కొన్ని దాడులు జరుపుతూ ఉగ్రవాదంమీద యుద్ధం చేస్తున్నట్టుగా ప్రజలను సమాధానపరచే ప్రయత్నమైతే పాక్ పాలకులు చేస్తున్నారు. పాకిస్థాన్‌లో ఉంటున్న లక్షలాదిమంది అఫ్ఘాన్లను వెళ్ళగొట్టిన ఘటన ఉభయదేశాల మధ్యా మరింత దూరం పెంచింది. ఒకవైపు పాకిస్థాన్‌తో సంబంధాలు ఇలా పతనమైపోతూంటే, మరోపక్క అఫ్ఘాన్-భారత్ సాన్నిహిత్యం పెరుగుతోంది. ఇటీవలే భారతదేశంలో అఫ్ఘానిస్తాన్ రాయబారిగా యువవిద్యార్థి ఇక్రముద్దీన్ కమిల్ నియమితుడైనాడు. పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదసంస్థలను తన భూభాగంలో అనుమతించకుండా, భారతదేశానికి వ్యతిరేకంగా వ్యవహరించకుండా తాలిబాన్ ఉన్నంతకాలం ఈ స్నేహం కొనసాగుతుంది. పాకిస్థాన్‌ను తల ఎగరేయకుండా సరిహద్దుల్లో ఉంచేందుకు తాలిబాన్‌తో స్నేహం ఉపకరిస్తుంది.

మైలారం గుట్టపైన మైనింగ్ భూతం!

ప్రకృతిని గర్భశోకానికి గురిచేయకుండా అభివృద్ధి సాధించడం మన పాలకులకు సాధ్యం కాదా? అభివృద్ధి పురోగమనానికి ప్రకృతి విధ్వంసం పూర్వ రంగం కావాలని అర్థశాస్త్రంలో ఎక్కడా లేదు. కానీ ప్రకృతి విధ్వంసం చేయకుండా, జీవావరణాన్ని దెబ్బతీయకుండా అభివృద్ధి ప్రాజెక్టులను పట్టాలెక్కించడాన్ని పెద్ద సవాలుగా భావిస్తున్నాయి ప్రభుత్వాలు. ఎక్కడ చూసినా అభివృద్ధి పేరిట గుట్టల విధ్వంసం, పచ్చని చెట్లు నరికివేత, పంట పొలాల వినాశనం, అడవుల విధ్వంసం, విచ్చలవిడిగా కొనసాగుతుంది. 1952 జాతీయ అటవీ విధానం ప్రకారం దేశ భూభాగంలో 33 శాతం విస్తీర్ణంలో అడవులు కలిగి వుండాలి. కాని నేడు 24 శాతం మాత్రమే అడవులు ఉన్నాయి. ప్రకృతి విధ్వంసం ఇదే రీతిలో కొనసాగితే రానున్న కాలంలో మనిషి ఊపిరి తీసుకోవడానికి ప్రాణవాయువు కూడా దొరకని దుర్భర పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా సమతుల్య సాధనకు నడుం బిగించాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారం, చెట్లను నరికివేత, పరిశ్రమల స్థాపన, అంతులేని అక్రమ మైనింగ్ వంటి చర్యలు అడవుల విధ్వంసానికి కారణమవుతున్నాయి.

దాదాపుగా 2300 కి.మీ.లలో విస్తరించిన నల్లమల అడవి అంచున ఉన్న గ్రామం మైలారం. ఇది నాగర్‌కర్నూలు జిల్లా, బల్మూరు మండల కేంద్రంలోకి వస్తుంది. ఈ గ్రామం మైలారం గుట్టని ఆనుకొని వుంది. ఈ గుట్ట ఆ ప్రజలకు జీవనాధారం. ప్రాణవాయువును, కలపను సమృద్ధిగా అందిస్తుంది. అనేక ఫల వృక్షాలకు, ఔషధ మొక్కలకు, ఇతర వృక్ష జంతు జలవనరులకు ఈ గుట్ట ఆలవాలం. వేంకటేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, మారెమ్మతల్లి, ఈదమ్మ, శివుడు కొలువై వున్న ప్రశాంతమైన ప్రాంతం ఇది. జాతీయ పక్షి నెమలి, ఇతర పక్షులు, అనేక రకాల జంతువులతో అలరారుతుంటుంది. 120 ఎకరాల ఈ గుట్ట చుట్టూ ఆహ్లాదకరమైన చెరువులు, కుంటలు నిండుకుండలై మరింత శోభను తెచ్చిపెట్టాయి. కాకతీయుల కాలంనాటి సమాధులు, శివాలయం, పురాతన చరిత్రకు ఆధారాలుగా మిగిలాయి. ఈ గ్రామ స్త్రీలు ప్రకృతిలో భాగమైన ఈ గుట్టతో అనుసంధానం కలిగి ఉంటారు. 77 ఏళ్ళ స్వతంత్ర భారతంలో గిరిజన, బహుజన, దళిత, వ్యవసాయ మహిళా కూలీలకు ప్రాతఃకాలపు ఆత్మగౌరవ ప్రతీకగా ఈ గుట్ట నిలిచింది. ఈ గుట్ట అందించే ఔషధ మొక్కలతో ప్రాణాలను కాపాడుకోవడం, అది అందించే ఫలాలను తిని బ్రతకడం మాత్రమే వారికి తెలుసు. వారు ఈ గుట్టను తల్లిగా భావిస్తారు. కలలో కూడా ఈ గుట్టకు హాని తలపెట్టరు. అయితే ఈ గుట్టపై ఇటీవల ఓ పెట్టుబడిదారుడు రాబందులా వాలి తన ఇనుప గోళ్ళతో ఆ తల్లిలాంటి గుట్ట పొట్టను చీల్చుతున్నాడు. ఆ గుట్ట గర్భంలోని లేత వర్ణపు గోధుమ రంగు స్ఫటిక రాళ్ళ (క్వార్ట్జ్ & ఫెల్డ్‌స్పార్) కుప్పను ఎత్తుకెళుతున్నారు. గ్రామస్థుల కడుపుకొట్టి విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. గ్రామస్థులంతా ఒక్కటై గుట్ట తవ్వకాలను వ్యతిరేకిస్తున్నారు.



గ్రామస్థులంతా ఒక్కటై మైలారం గుట్ట తవ్వకాలను వ్యతిరేకిస్తున్నారు. 'మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ'గా నిర్మాణమై గట్టిగా ప్రతిఘటిస్తున్నారు. గిరిజన, బహుజన, దళిత, వ్యవసాయ మహిళా కూలీలకు ప్రాతఃకాలపు ఆత్మగౌరవ ప్రతీకగా ఈ గుట్ట నిలిచింది. ఈ గుట్ట అందించే ఔషధ మొక్కలతో ప్రాణాలను కాపాడుకోవడం, అది అందించే ఫలాలను తిని బ్రతకడం మాత్రమే వారికి తెలుసు. వారు ఈ గుట్టను తల్లిగా భావిస్తారు.

'మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ'గా నిర్మాణమై గట్టిగా ప్రతిఘటిస్తున్నారు. గుట్టను ధ్వంసం చేసి అందులోని విలువైన ఖనిజాన్ని తరలిస్తున్న కాంట్రాక్టరు పోలీసులను దింపి హింసకు పాల్పడుతున్నాడు. గ్రామ యువకులను, పెద్దలను విచక్షణారహితంగా అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పోలీసులు పెట్టుబడిదారుల చేతిలో కీలుబొమ్మలయ్యారు. ఊరిలో పోలీసు క్యాంపు వెలసింది. మహిళలు, పిల్లలు, వ్యవసాయ కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుట్ట తవ్వకాలు తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. భారీ వాహనాలు, లారీలు, జేసీబీలు, డ్రిల్లింగ్ మిషన్‌లు, తిరుగాడుతుండంతో రోడ్లు మట్టికొట్టుకుపోతున్నాయి. డ్రిల్లింగు మిషన్‌ల శబ్దాలకు చంటి పిల్లలు నిద్రలోనే ఉలిక్కిపడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుండి తనకు అన్ని అనుమతులు ఉన్నాయని ధీమాగా వ్యవహరిస్తున్నాడు కాంట్రాక్టరు. ఆ అనుమతులన్నీ మోసపూరితంగానే తెచ్చుకున్నాడు. గుట్ట మైనింగును నిలిపివేయాలని ప్రభుత్వ యంత్రాంగానికి అనేక విన్నపాలు సమర్పించుకున్నారు గ్రామస్థులు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. నల్లమల రిజర్వు ఫారెస్టుకు అతి సమీపంలో ఉన్నా కూడా అటవీ అధికారులు దీనిని నిలువరించడం లేదు. చివరకు గ్రామస్థులే నడుం బిగించారు. తమ సమస్యలే ఆ ప్రజలను చైతన్యవంతుల్ని చేశాయి. అందులోంచి నాయకత్వాలు ఎదుగుతున్నాయి.

'మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీకి' యువకులు నాయకత్వం వహిస్తున్నారు. పెద్దలు సలహాలు సూచనలు అందజేస్తున్నారు. మరోవైపు న్యాయపోరాటానికి కూడా సిద్ధపడ్డారు. ఇంకోవైపు ప్రభుత్వం ఉద్యమాన్ని ఆదిలోనే అణచివేయాలని నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అరెస్టులకు, రిమాండులకు పాల్పడుతున్నది. దామగుండం అటవీ ప్రాంతంలో నిర్మించ తలంచిన రాడార్ స్టేషన్ కింద నలిగిన ప్రజలు, లగచర్ల ఉద్యమంలో జైలుపాలైన రైతులు, ఇథనాల్ కంపెనీ వల్ల పచ్చని పొలాలు కోల్పోతున్న రైతులు, హైడ్రా జేసీబీల దాడి కింద చితికిపోయిన ప్రజలు, మూసీ పరీవాహక ప్రాంతంలోని నిర్వాసితులు ఈ ఉద్యమానికి సంఘీభావంగా నిలవాలని కోరుతున్నారు. పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, ప్రజాసంఘాలు, పౌర సమాజం తమ న్యాయమైన పోరాటానికి అండగా నిలవాలని కోరుకుంటున్నారు.

○ లక్ష్మణ్ గడ్డం
పౌరహక్కుల సంఘం అధ్యక్షులు

ఆదివాసుల సమస్య అడవికే పరిమితమా?

కష్టాలు వేరు; అణిచివేత వేరు. కష్టాలు అందరికీ వుంటాయి. గౌతమ్ అదానీకీ, నరేంద్ర మోదీకీ కూడా కష్టాలు వుంటాయి. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా అణిచివేతకు గురవుతున్నది ఎవరూ? అని ప్రశ్నించుకుంటే మాత్రం మనకు రెండు సమూహాలు గుర్తుకు వస్తాయి. మొదటిది; ఆదివాసులు. రెండోది; ముస్లింలు.

ఆదివాసీ, ముస్లిం సమూహాలు ఈ భూమి మీద వుండడం మెగా కార్పొరేట్లకు ఇష్టం లేదు. ఎందుకంటే, ఆదివాసుల కాళ్ళ కింద వుండే ఖనిజాలు, ముస్లిం దేశాల్లో వున్న చమురు నిల్వలు మొత్తంగా వాళ్ళకు కావాలి. రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను మనం తరచూ విడదీసి చూస్తుంటాం. అవి ఒకే శరీరానికి వున్న రెండు తలలు అనుకోం. పైగా, మోదీ ప్రధాని కావడం వల్ల కొన్ని మెగా కార్పొరేట్ల సంపద పెరుగుతోంది అనే అపోహలో ఉంటాము. కానీ తమ సంపదను పెంచుకోవడానికి మెగా కార్పొరేట్లు తగిన ప్రధానమంత్రిని కూడా ఎన్నుకోగలవేమో అన్న ఆలోచన మనకు రాదు.

ఆదివాసులు, ముస్లింలను అంతరించిపోతున్న జాతులు అనాల్సినంతగా పరిస్థితులు మారిపోతున్నాయి. చంపాల్సిన కుక్కను పిచ్చిది అని ప్రచారం చేయాలన్నది ఓ కుటిలనీతి. ఇప్పుడు ఆదివాసులు, ముస్లింల మీద అలాంటి కుటిల ప్రచారమే జరుగుతున్నది. "ఆదివాసులు అనాగరీకులు; ముస్లింలు మూర్ఖులు"... ఇదీ ఆ ప్రచారం సారాంశం. ఈ ప్రచారాన్ని ఎక్కువమంది నమ్మరు. కానీ ఓటర్లలో ఓ మూడోవంతు నమ్మి ఓటేసినా దేశాధినేతలు మళ్ళీమళ్ళీ గెలువగలరు.

ఆ మధ్య కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతిని (UCC) అమలు చేయాలని ఒక ప్రయత్నం మొదలెట్టింది. ముస్లిం సమూహాన్ని ఇబ్బంది పెట్టడానికి తాము ఒక చట్టాన్ని తెస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ పెద్దలు గట్టి సంకేతాలు ఇచ్చారు. తమ ప్రత్యేక ఉనికిని కోల్పోతున్నట్టు ముస్లిం సమాజం కూడ ఆందోళన చెందింది. మైదాన సమాజం 'అనాగరికులు' అంటూ తరచూ కించపరిచే ఆదివాసులకు ఈ చట్టం వెనుకనున్న అసలు కుట్ర అర్థం అయింది. మన దేశంలో ప్రస్తుతం ఏడు వందల రకాల ఆదివాసీ సమూహాలు ఉన్నాయి. ప్రతి ఒక్క సమూహమూ ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలని పాటిస్తాయి. వైవిధ్యపూరితమైన తమ సంస్కృతిని అంతం చేయడానికే ఉమ్మడి పౌర స్మృతిని తెస్తున్నట్టు వాళ్ళకు బోధపడింది. ఆదివాసి సంఘాలు ఝార్ఖండ్‌లో పెద్ద సభ జరిపి ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన చేయాలని తీర్మానం చేశాయి.

నక్సల్‌బరీ శ్రీకాకుళం రైతాంగ సాయుధ ఉద్యమాల రూపంలో భారత గడ్డ మీద కమ్యూనిజానికి తిరిగి ప్రాణం పోసింది ఆదివాసులే. ఆ ఉద్యమాలను చూసి ఉలిక్కిపడిన ప్రభుత్వాలు మైదాన ప్రాంతాల్లో భూపరిమితి చట్టాల్ని, అటవీ ప్రాంతాల్లో ఆదివాసీ భూముల పరిరక్షణ చట్టాల్ని తెచ్చాయి. ఇప్పుడు ఆ చట్టాలను వరుసగా రద్దుచేసే పనిలో పడ్డాయి.



ఆదివాసులు, ముస్లింలను అంతరించిపోతున్న జాతులు అనాల్సినంతగా పరిస్థితులు మారిపోతున్నాయి. చంపాల్సిన కుక్కను పిచ్చిది అని ప్రచారం చేయాలన్నది ఓ కుటిలనీతి. ఇప్పుడు ఆదివాసులు, ముస్లింల మీద అలాంటి కుటిల ప్రచారమే జరుగుతున్నది. "ఆదివాసులు అనాగరీకులు; ముస్లింలు మూర్ఖులు"... ఇదీ ఆ ప్రచారం సారాంశం. ఈ ప్రచారాన్ని ఎక్కువమంది నమ్మరు. కానీ ఓటర్లలో ఓ మూడోవంతు నమ్మి ఓటేసినా దేశాధినేతలు మళ్ళీమళ్ళీ గెలువగలరు.

మణిపూర్‌లోని కొండలు అటవీ భూముల మీద ఆదివాసులైన కుకీజోలకు సాంప్రదాయిక హక్కు ఉంది. లోయలో ఉండే నాగరీకులయిన మెయితీలకు కూడా కొండలు, అటవీ భూముల మీద హక్కు కల్పిస్తూ కొత్త చట్టం చేయడంతో అక్కడ మంటలు రాజుకున్నాయి. ఇదంతా బహిరంగ రహస్యమే. దీని వెనుక అంతకుమించిందేదో ఉందని కుకీజోలకు గట్టి అనుమానం.

ఏడాదిన్నరగా అల్లర్లు చెలరేగుతున్నా మణిపూర్ మీద ప్రధాని కనీసం స్పందించలేదు. వారు మౌనంగా వుంటూనే పార్లమెంటులో ఇంకో పని చేశారు. అంతర్జాతీయ సరిహద్దుల నుండి వంద కిలోమీటర్ల లోపు ఉన్న అటవీ భూముల్ని దేశ ప్రయోజనాలకు అవసరమైన వ్యూహాత్మక ప్రాజెక్టుల కోసం వాడుకునేలా చట్ట సవరణ చేశారు.

ఇండియాకు ఏడు దేశాలతో అంతర్జాతీయ సరిహద్దులు ఉన్నాయి. వీటి పొడవు 15 వేల కిలోమీటర్లు. ఆ లెక్కన అటవీ భూముల సవరణ చట్టం కేటాయించిన భూముల విస్తీర్ణం దాదాపు 15 లక్షల చదరపు కిలో మీటర్లు. అంటే, 37 కోట్ల ఎకరాలు. ఇంతటి విస్తీర్ణమయిన భూమిని ఎవరి కోసం సేకరిస్తున్నారూ అనేది ఇప్పుడు చాలామందిని వేధిస్తున్న ప్రశ్న. దేశానికి వ్యూహాత్మక ప్రాజెక్టులంటే రక్షణ శాఖ ప్రాజెక్టులని ఎక్కువమంది భావిస్తారు. అదానీ, అంబానీలకు అవసరమైన భూముల్ని కూడ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలకు అవసరమైన వ్యూహాత్మక ప్రాజెక్టులుగా పరిగణించే వీలు లేకపోలేదు.

ఈశాన్య రాష్ట్రాల్లో మణిపూర్‌తో సహా అనేకం ఈ వంద కిలోమీటర్ల పరిధిలోకి వస్తాయి. అంటే వ్యూహాత్మక ప్రాజెక్టులు వస్తే ఈ రాష్ట్రాలు అంతరించిపోతాయి. దేశంలోని రేవు పట్టణాలన్నీ ఈ పరిధిలోనికే వస్తాయి. ఆ వంద కిలోమీటర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఎలాంటి అధికారాలు వుండవు.

మణిపూర్ మీద ఎందుకింత ప్రత్యేక ఆసక్తి? అనేది ఎవరికయినా రావలసిన సందేహం. ఈ సందర్భంగా అనేక వాదనలు వినిపిస్తున్నాయి. మణిపూర్‌ను ఆనుకుని మయన్మార్, లావోస్, థాయిలాండ్ దేశాలున్నాయి. మెకాంగ్, రువాక్ నదులు ఇక్కడే కలుస్తాయి. ఈ మూడు దేశాల సరిహద్దులు కలిసే ప్రాంతానికి 'గోల్డెన్ ట్రయాంగిల్' (బంగారు త్రిభుజి) అనే పేరుంది. ఓపియం, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు ఇది ప్రపంచ కేంద్రం.

పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్, ఇరాన్ సరిహద్దులు కలిసే ప్రాంతాన్ని 'గోల్డెన్ క్రెసెంట్' (బంగారు నెలవంక) అంటారు. అది సహజ మాదకద్రవ్యాల కేంద్రమయితే, 'బంగారు త్రిభుజి' సింథటిక్ మాదకద్రవ్యాల కేంద్రం. 'యాబా' అని పిలిచే మెథంఫెటమైన్ (Methamphetamine) సింథటిక్ మాదకద్రవ్యం వాణిజ్యం ఇటీవల ఈ ప్రాంతంలో విపరీతంగా పెరిగింది. డ్రగ్స్‌తో పాటు ఆయుధాలు, కమర్షియల్ సెక్స్ రవాణాలకు ఇది ట్రాన్సిట్ పాయింట్.

ప్రపంచ వాణిజ్యంలో నిజానికి ఆయుధాలకన్నా మాదకద్రవ్యాలది చాలా పెద్ద వాటా. ఐక్యరాజ్య సమితి ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ (UNODC) అంచనా ప్రకారం మాదకద్రవ్యాల వాణిజ్యం 426 బిలియన్ డాలర్లు. ఆయుధాలకన్నా మాదకద్రవ్యాల అమ్మకాలు నాలుగు రెట్లు ఎక్కువగా వుండడానికి కారణం ఏమంటే, మనుషులు ఆయుధాలను ఎప్పుడో ఒకసారి వాడుతారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ప్రతిరోజూ వాటిని కొనాల్సి వుంటుంది. అంచేత, వాణిజ్యంలో భారీ టర్నోవర్ ఆశించే మెగాకార్పొరేట్లు ఇప్పుడు మాదకద్రవ్యాల మీద దృష్టిపెట్టారని, గోల్డెన్ ట్రయాంగిల్ మీద పట్టుకోసమే మణిపూర్‌ను మండిస్తున్నారని కుకీ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అడవుల నుండి ఆదివాసుల్ని తరిమేస్తున్నట్టే పట్టణ శ్రామికవాడల నుండి ముస్లింలని ఒక పథకం ప్రకారం బుల్‌డోజర్లతో తరిమేస్తుండడాన్ని మనం తరచూ చూస్తున్నాం. భారత ముస్లింలలో కొందరు వ్యాపారులు, కొండొకచో కార్పొరేట్లు కూడ ఉన్నారు. కానీ, అత్యధికులు యంత్రయుగపు కులవృత్తుల్లో జీవిస్తున్నారు.

మెగా కార్పొరేట్ల ఆగడాలు అడవులకే పరిమితం కావు. అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ నుండి పాతికేళ్ళపాటు సోలార్, పవన విద్యుత్తును అధిక ధరకు కొనడానికి జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీని కోసం నీకెంత నాకెంత (Quid pro quo) పద్ధతిలో భారీగా ముడుపులు అందుకుందని ఇటీవల అంతర్జాతీయ వేదికల మీద పెద్ద దుమారం రేగడం మనకు తెలుసు. ఒప్పుకున్న షరతుల ప్రకారం భారీ నష్టపరిహారాన్ని చెల్లించాలి గనుక ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడమూ చంద్రబాబు ప్రభుత్వానికి కుదరదు. ఫలితంగా ఆ భారాన్ని రాష్ట్ర ప్రజలే భరించాల్సి వుంటుంది. ఇది కూడా మనకు తెలుసు. కానీ మనకు తెలియాల్సిన మరో పార్శ్వం ఏమంటే అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థకు గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్లాంట్లున్నాయి. వీటి నిర్మాణానికి ఆయా ప్రాంతాల్లో ఆదివాసులతోపాటు, మత్స్యకారులు, వ్యవసాయదారులు, పేదవర్గాల్ని భారీ సంఖ్యలో సామూహిక స్థానభ్రంశానికి గురిచేశారు.

అణచివేత ఒకచోట మొదలయితే అది ఒకటి రెండు సమూహాలకు పరిమితమై ఆగిపోదు. హిట్లర్ ముందు కమ్యూనిస్టుల్ని, యూదుల్ని అణిచివేయాలనుకున్నాడు. అది అతిశయించి మొత్తం తన దేశ ప్రజల్ని అణచివేయడానికి సిద్ధమయ్యాడు. అత్యాశపరులయిన కార్పొరేట్ల ఆగడాలకు బలవుతున్నది అడవుల్లో ఆదివాసులు, పట్టణాల్లో మరొకరు మాత్రమే అనుకోవడానికి వీల్లేదు. వాటి దుష్ప్రభావాలు దేశ ప్రజలు అందరి పైనా ఉంటాయి; ఉంటున్నాయి.

■ డానీ

కొంచెం జాగ్రత్తపడదాం!

చైనాలో తాజాగా వైరస్ వ్యాప్తితో ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి రోగులు తామరతంపరగా పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎప్పటిలాగే ఆ దేశం వాటిపై నిఖార్సయిన సమాచారం ఇతర దేశాలతో పంచుకోకపోవడంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. ఈ వ్యాధికి హెచ్ఎంపి వైరస్ కారకంగా తెలియవస్తోంది. అదే వైరస్ కేసులు ఇతర ప్రపంచ దేశాల్లో కూడా రిపోర్ట్ అవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసింది. మన దేశంలో బెంగుళూరులో రెండు కేసులు బయటపడ్డాయి. అయితే వాటికీ, చైనాలో కేసులకు సంబంధం లేదని ఐసీఎంఆర్ ప్రకటించింది. అది కొంత ఊరట.

ఈ నేపథ్యంలో మన దేశం అప్రమత్తంగా ఉండడం అవసరం. కొవిడ్ వ్యాప్తిలో జరిగిన అనుభవాల ఆధారంగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వైరస్ వ్యాప్తి పట్ల సమాచారం వెంటవెంటనే అందజేసేటట్లు చూడాలి. చైనా, ఇతర దేశాల్లో పరిస్థితుల్ని నిశితంగా గమనించాలి. ప్రజా ఆరోగ్య విభాగాల్ని, సంబంధిత యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలి. ఆక్సిజన్ నిల్వలు, సిబ్బంది, సపోర్ట్ సిస్టమ్‌లను రెడీ చెయ్యాలి. వీటన్నింటి కన్నా ముఖ్యంగా వ్యాప్తి నివారణ అంశాలపై దృష్టి పెట్టాలి. మాస్కుల వినియోగం, చేతుల శుభ్రత, గుంపుల నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కలిగించాలి. కరోనా సమయంలో పాటించిన జాగ్రత్తలను ప్రజా సమూహాలు మళ్లీ అలవర్చుకోవాలి.

ముఖ్యమైన విషయమేమిటంటే ఈ హెచ్ఎంపీ వైరస్ కొత్తది కాదు.. ప్రమాదకరమైనది కాదు. 2001 నుండి తెలిసిందే. పిల్లల్లో శ్వాస సంబంధిత వ్యాధుల్లో 12 శాతం దీని వల్లే వస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవాళ్ళలో ప్రమాదకరంగా మారవచ్చు అన్న ఉద్దేశ్యంతో జాగ్రత్తపడాలి. శీతాకాలంలో సహజంగానే వైరస్ వ్యాప్తి ఎక్కువ. కాబట్టి కేసులు ఎక్కువ కనబడతాయి. నివారణ, జాగ్రత్తలతో వ్యాప్తిని వీలైనంత తగ్గిస్తే మంచిది. ఆ కోణంలోనే ఆలోచించి, తదనుగుణంగా ఆచరిస్తే సరిపోతుంది. భయం అక్కరలేదు. బాధ్యత ఉంటే చాలు.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

హిందువులకు మార్గదర్శకులు ఎవరు?

హిందూ సమాజానికి సూచనలు, ఆదేశాలు ఇచ్చే అధికారం ఎవరిది అనే విషయంపై గత కొన్ని రోజులుగా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. హిందూ సాంస్కృతిక సంస్థగా చెప్పబడే ఆర్ఎస్ఎస్ అధినేత ఒక ముఖ్య సూచనను ఇచ్చాడు. ప్రతి మసీదు వెనుక ఒక శివలింగాన్ని వెతకవద్దు అని హిందూ సమాజానికి, స్థానిక నాయకులకు ఒక సూచన ఇచ్చాడు. భారతదేశం ఒక శక్తివంతమైన దేశంగా ఎదగాలని, అది అందరూ కలిసి ఉన్నప్పుడే సాధ్యమవుతుందని చెప్పాడు. అలాగే మరొకచోట మాట్లాడుతూ మతం పేరిట గతంలో ఎన్నో హింసలు, ఘోరాలు అత్యాచారాలు జరిగాయి. అవన్నీ మతం స్వరూపంపై, ధర్మం అంటే ఏమిటి అనే విషయంపై అవగాహన లేక జరిగిన ఘోరాలు అని వ్యాఖ్యానించాడు. మత గ్రంథాలపై మానవ విలువల వెలుగులో సరైన వ్యాఖ్యల్ని తీసుకురావాలని కూడా చెప్పాడు.

పై సూచనపై ప్రముఖ మతాచార్యులు తీవ్రంగా స్పందించారు. హిందూ మతాన్ని గూర్చి సమాజానికి ఆదేశాలు ఇచ్చే అధికారం తమకే ఉన్నదని, సామాజిక సంస్థల నేతలకు లేదని చెప్పారు. 'మేం అతనికి ఆదేశాలిస్తాము, అతను మాకు ఇవ్వడం కాదు,' అంటూ ఇంకా కొంత తీవ్రంగా, ఆ నేత తుష్టీకరణ విధానానికి లొంగిపోయాడని, నాయకుడు కావాలనే ఆశతో ఉన్నాడని కూడా ఆరోపించారు. ఈ ఇద్దరూ హిందూ పక్షపాతులే. వారివి కేవలం భిన్న అభిప్రాయాలు కావచ్చు లేదా మరి ఎవరికైనా సంకేతం కావచ్చు. ఆ విషయంలోకి పోకుండా వారి మాటలను కేవలం ఒక చర్చ విషయంగా తీసుకొని విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను.

ఇంతకూ ఆర్ఎస్ఎస్ నేత మాట్లాడినది ఏమిటి? స్థానిక నాయకులు సంయమనం పాటించాలని, అత్యుత్సాహానికి పోకూడదని చెప్పారు. కొత్త అంశాలని లేవనెత్తవద్దని ఆయన చెప్పడం స్పష్టంగా ఉంది. ఇదివరకే వివాదంలోనూ, చర్చల్లోనూ ఉన్న విషయాలను వదిలి కొత్త విషయాల్ని పెంచుకుంటూ పోతే అనేక చోట్ల ఘర్షణ వాతావరణం పెరుగుతుంది. దేశంలో ప్రతి మసీదు వెనుక ఒక దేవాలయం ఉన్నదని ఆందోళన చేస్తే దేశం వాతావరణం మొత్తం కలుషితమవుతుంది. దేశం ఆర్థికంగా ప్రగతి సాధించాల్సిన సమయంలో అంతర్గత సమస్యలను పెంచుకుంటూ పోతే అది భారత దేశాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్న శక్తులకు సహాయం చేసినట్లు అవుతుంది. వారికి ఒక ఆయుధాన్ని ఇచ్చినట్లు అవుతుంది.

ఆర్ఎస్ఎస్ నేత ఇచ్చిన రెండవ సలహా అన్ని మతాలకు అన్వయించేది. చరిత్రలో ఘోరాలు, నరమేధాలు చేసి; ప్రపంచమంతా తమ మతం మాత్రమే ఉండాలని శాశ్వత అజెండా ఉన్న మతాలు హిందూ మతాన్ని నిర్మూలించాలని ప్రయత్నాలు చేస్తున్న విషయం అందరికీ తెలుసు. హింసను ప్రోత్సహించే విధంగా తమ మత గ్రంథాలను అర్థం చేసుకున్నారని, మతం స్వరూపాన్ని, భగవంతుని స్వరూపాన్ని అర్థం చేసుకొని తమ గ్రంథాలను వ్యాఖ్యానించి ఆచరించాలని ఆయన సూచన. హిందూ సమాజానికి కూడా పై సూచన వర్తిస్తుంది. హిందూ సమాజంలో నరమేధాలు లేకపోయినా కొన్ని వర్గాల వారిని సామాజికంగా దూరం పెట్టడం అనే మానసిక హింస ఉంది. ఒకనాడు ఏ కారణాల వల్ల సమర్థించుకున్నా అలాంటి వివక్షకు ఈనాటి మానవ విలువలు పూర్తిగా వ్యతిరేకం. ఈ విషయంలో హిందూ మతాచార్యులు ఆలోచించాలని కూడా ఆయన మాటకు అర్థం.

హిందూ సమాజానికి సూచనలను ఇచ్చే అధికారం ఎవరికి ఉంది? కేవలం ధర్మాచార్యులే ఇవ్వాలా, మరి ఎవరికీ అధికారం లేదా? సమాజ శ్రేయస్సు గురించి ఎవరు సలహా ఇచ్చినా అది ధర్మమే అవుతుంది. సమాజానికి హాని కలిగించే ప్రయోగాల్ని ఎవరు చేసినా అది అధర్మమే అవుతుంది. దీర్ఘకాలికంగా దేశానికి మేలైన మార్గం ఏమిటి అని ఆలోచించే అధికారం ప్రతి ఒక్కరికీ ఉంది.



పై చర్చ వల్ల సామాన్య హిందువు మనసులో ఒక ప్రశ్న వస్తుంది. హిందూ సమాజానికి సూచనలను ఇచ్చే అధికారం ఎవరికి ఉంది? కేవలం ధర్మాచార్యులే ఇవ్వాలా, మరి ఎవరికీ అధికారం లేదా? సమాజ శ్రేయస్సు గురించి ఎవరు సలహా ఇచ్చినా అది ధర్మమే అవుతుంది. సమాజానికి హాని కలిగించే ప్రయోగాల్ని ఎవరు చేసినా అది అధర్మమే అవుతుంది. దీర్ఘకాలికంగా దేశానికి మేలైన మార్గం ఏమిటి అని ఆలోచించే అధికారం ప్రతి ఒక్కరికీ ఉంది.

ధర్మసూక్ష్మాలను కేవలం ధర్మాచార్యులే చెప్పగలరా మరి ఎవరికీ అధికారం లేదా అన్న విషయంపై భారతంలోనే రెండు కథలు ఉన్నాయి. ఒకటి కౌశికుడు అనే బ్రాహ్మణుడు ధర్మవ్యాధుడు అనే కటికవాడి వద్దకు వెళ్లి ధర్మాన్ని గూర్చి తెలుసుకోవడం. మరొకటి శాంతి పర్వంలోనిది. గొప్ప తపస్సు చేసిన జాజలి అనే బ్రాహ్మణుడు తులాధారుడు అనే ఒక సాధారణ వర్తకుడి వద్దకు వెళ్లి ధర్మ సూక్ష్మాన్ని తెలుసుకోవడం. ఏదైనా ఒక సందర్భంలో మనం చేయాల్సిన పని ధర్మబద్ధమో కాదో తెలుసుకోవాలంటే ఎవరో ఆచరించిన విధానాన్ని అనుసరించడం కాకుండా మనం మన బుద్ధితో విచారించి ధర్మాన్ని నిర్ధారించుకోవాలని తులాధారుడు చెప్తాడు. ఇలాంటి ఉదాహరణలు పురాణాల్లోనూ అనేకాలు ఉన్నాయి. అందువల్ల ఎవరి పరిధి ఎంతవరకు ఉన్నది అని పరిమితిని విధించలేము. ప్రతి ఒక్కరికి ఆలోచించి విమర్శించే అధికారం, అవకాశం ఉన్నాయి. అందువల్లే 14వ శతాబ్దంలోనే వచ్చిన 'సర్వదర్శన సంగ్రహం' అనే పుస్తకంలో ఆనాటి హిందూ సమాజంలో 16 దర్శనాలు (Schools of thought) ఉన్నట్టు చూడగలం. హిందూ ధర్మాచార్యులు కొత్త వివాదాల్ని సమర్థించడం వల్ల సమాజం ఒకటవుతుందని భావిస్తున్నారా అని ఆలోచించాలి. నిజానికి హిందూ సమాజం వీరితో ఉందా అన్నది కూడా ఒక ప్రశ్న. ఇలాంటి చర్చల వల్ల హిందూ సమాజంలోనే చాలామంది వీరికి ఇదివరకే దూరంగా ఉన్నారు, మరికొందరు దూరమయ్యే పరిస్థితి ఉంది. హిందూ ఐక్యత జరగకపోగా మిగతా వర్గాల వారిని ఏకం చేసినట్లు అవుతుంది. మతాచార్యులు దీన్ని కూడా ఆలోచించాలి.

హిందూ ధర్మాచార్యులు చేయగలిగిన, చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. హిందూ ఐక్యత దేశ రక్షణకు, దేశ సమగ్రతకు ఎంత అవసరమో ప్రజలకు తెలపాలి. దేశంలో ఘర్షణ వాతావరణం లేకుండా, దేశ సమగ్రతకు భంగం కాకుండా హిందువుల ఐక్యత ఉన్నప్పుడు, హిందువులు తమ సంస్కృతి గొప్పతనాన్ని తెలుసుకున్నప్పుడు ఇతర వర్గాలు వారు కూడా తమ మత స్వతంత్రాన్ని కలిగి భయం లేకుండా కలిసి ఉండవచ్చు.

అన్నింటికన్నా ముఖ్యంగా హిందూ ఆచార్యులు చేయగలిగిన పని హిందూ మతంపై వచ్చిన అనేక విమర్శలకు సమాధానాలు చెప్పడం. ఉదాహరణకు సనాతన ధర్మం అంటేనే కులం అని అందరి మనసులో నాటుకొని ఉన్నప్పుడు హిందువులు ఎందుకు మతాచార్యుల వెంట ఉండాలి? సనాతన ధర్మానికి కులానికి సంబంధం లేదు. సనాతన ధర్మం కులాన్ని సృష్టించినట్లు మన పుస్తకాలు అన్నింటినీ తిరగవేసినా ఎక్కడా కనిపించదు. కేవలం మనిషి స్వభావాన్ని బట్టి నాలుగు వర్ణాలను చెప్పారు కానీ సమాజంలో ఉన్న వేలకొద్దీ కులాల గురించి ఎవరూ చెప్పలేదు. మనుస్మృతిలో ఉంది కదా అని అడగవచ్చు. మనువు కాలానికే సమాజం చాలా అభివృద్ధి చెందింది. ఈనాడు సమాజంలో ఉన్న అన్ని రకాల లిటిగేషన్లు, వ్యాజ్యాలు అప్పుడు కూడా ఉన్నాయి, అందులో వివరింపబడ్డాయి కూడా. వర్ణసంకరం వల్ల పుట్టిన వారిని అదివరకే ఉన్న కులాలలో మనువు చేర్చాడు. అంతే కానీ అతను కొత్త కులాలను సృష్టించలేదు. బ్రాహ్మణులు కులాన్ని సృష్టించలేదనే విషయాన్ని అంబేడ్కర్ స్వయంగా చెప్పాడు. ఏ ఋషి కూడా కులాన్ని సృష్టించలేదు. మనుషుల్ని నిలబెట్టి నీవు ఆ పని చేయి, నీవు ఈ పని చేయి, నువ్వు గుడ్డలు నేయాలి, నువ్వు ఉతకాలి అంటూ ఎవరూ ఎప్పుడూ చెప్పలేదు. సమాజం అవసరాల్ని బట్టి ఏర్పడినవి కులాలు. హిందూ ధర్మాచార్యులు ఈ విషయాన్ని స్పష్టం చేయాలి. కుల ఆచారాల్ని వదలమని చెప్పాల్సిన పనిలేదు, కులాల సృష్టికి మతంతో సంబంధం లేదని మాత్రం చెబితే చాలు.


ముఖ్యమైన వివాదాస్పద విషయాలపై, సమాజంలో పేరుకుపోయిన సందేహాల గురించి ధర్మాచార్యులు సమాధానం చెబితే హిందువుల్లో ఐక్యత దానంతట అదే వస్తుంది. కులాల విషయంలో ప్రభుత్వాల పాలసీ ఎలా ఉన్నా మతాచార్యులకు అనవసరం. రాజకీయ పార్టీలు తమ అవసరాలకు కులాన్ని వాడుకోవచ్చు. ధర్మాచార్యులు మాత్రం వైదిక సిద్ధాంతంలో ఉన్న విషయాన్ని ప్రజలకు స్పష్టంగా చెబితే చాలు. అంతేకాక విద్యావంతులు ఎవరైనా ధర్మాన్ని గురించి విశ్లేషించి వ్యాఖ్యానించే సంప్రదాయం మన సమాజంలో ఉంది. అలాంటి స్వేచ్ఛ ఉండడం మన సంస్కృతి గొప్పదనం. దానికి మనం గర్విద్దాం.

• కె. అరవిందరావు
మాజీ డీజీపీ

వేద విశ్వవిద్యాలయం..
ఎక్కడో.. ఎప్పుడో..?



వరంగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఆధ్యాత్మికతను పెంచడంతో పాటు భావితరాలకు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులను అందించేలా ప్రభుత్వం వేద యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అనువైన ప్రాంతం కోసం పండితులు, పీఠాధిపతుల సలహాలను స్వీకరించాలని దేవాదాయశాఖను ప్రభుత్వం ఆదేశించినట్టుగా సమాచారం. దీంతో ఏ పుణ్యక్షేత్రం పరిధిలో వేదిక్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనే దానిపై దేవాదాయశాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్ర విభజనలో శ్రీవేంకటేశ్వర వేద యూనివర్సిటీ ఏపీ పరిధిలోకి వెళ్లడంతో రాష్ట్రంలో మరో వర్సిటీ కోసం గత ప్రభుత్వం కాళేశ్వరంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అడుగులు ముందుకు పడలేదు. తాజాగా కాంగ్రెస్ సర్కారు రాష్ట్రంలో వేద యూనివర్సిటీ ఏర్పాటుకు కసరత్తు చేస్తుండటంతో ఎక్కడ నిర్మిస్తారో ఎప్పుడు నిర్మిస్తారో అనేది ఆసకిగా మారింది. ఈ విశ్వవిద్యాలయం ద్వారా జననం, మరణం, తాళపత్ర గ్రంథాల లిపిపై పరిశోధనలు చేయడంతో పాటు వేద విజ్ఞానాన్ని నూతన మార్గంలో మానవాళికి అందించడానికి ప్రభుత్వం వేద యూనివర్సిటీ ఏర్పాటుపై ఫోకస్ చేస్తుందనే టాక్ ఉంది.



వేదిక్ వర్సిటీకి కసరత్తు..

రాష్ట్రంలో వేద యూనివర్సిటీ ఏర్పాటుకు 2019 మే 19వ తేదీన అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటన చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అవుతున్న క్రమంలో కుటుంబ సమేతంగా కాళేశ్వరాలయాన్ని సందర్శించిన కేసీఆర్ కాళేశ్వర అభివృద్ధికి రూ.100కోట్ల నిధులతో పాటు వంద ఎకరాల భూవిస్తరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులోనే వేద కళాశాల, పాఠశాల ఏర్పాటు చేస్తామని, అలాగే గోదావరి తీరాన పుణ్యస్నానాలు చేసి వేద విద్యను అభ్యసించటంతో పాటు పచ్చని తెలంగాణ కోసం నిత్యం యజ్ఞాలు చేసేలా యాగశాల, గోశాలలను ఏర్పాటు చేసి, వెయ్యికి పైగా గోవులను పెంచుతామని ప్రకటన చేశారు. అదే ఏడాది జూన్ 21న కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించిన కేసీఆర్, కాళేశ్వరంపై తన హామీలను మరిచిపోయారనే విమర్శలున్నాయి. ఏటా బడ్జెట్‌లో కాళేశ్వరంలో వేదవర్సిటీ కోసం నిధులు కేటాయిస్తారని ఎదురుచూడటమే విగిలింది. 2019 మే 19 తరువాత నాలుగు బడ్జెట్లు ప్రవేశపెట్టినా వేద వర్సిటీ హామీగానే మిగిలిపోయింది. అయితే తెలంగాణలో ఆధ్యాత్మికతను పెంచి, భవిష్యత్ తరాలకు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులను అందించటంతో పాటు హిందూ సంప్రదాయలను, సంస్కృతిని

మిగతా 7వ పేజీలో...

- కాళేశ్వరంలో ఏర్పాటుకు 2019 మే 19న అప్పటి సీఎం కేసీఆర్ హామీ
- వేద కళాశాల, యజ్ఞశాల, గోశాల ఏర్పాటుపై దాటవేసిన గత ప్రభుత్వం
- తాజాగా వేదిక్ వర్సిటీ ఏర్పాటుకు అనువైన ప్రాంతం కోసం అన్వేషణ
- భద్రకాళి, కాళేశ్వరంతో పాటు రాష్ట్రంలోని పలు పుణ్య క్షేత్రాల పరిశీలన
- ఆలయాలకు అనుబంధంగా వేద పాఠశాలలు, కాలేజీలు ఏర్పాటుకు అవకాశం
- పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులను భావితరాలకు అందించేలా ప్రణాళిక



దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించేలా కసరత్తు..

ఏపీలో టీటీడీ నిధులతో వేద విశ్వవిద్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. తెలంగాణలో ఆ స్థాయిలో ఆదాయం వచ్చే పుణ్యక్షేత్రాలు లేకపోవటంతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలోనే వేద వర్సిటీని నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టుగా సమాచారం. ఈ వర్సిటీలో డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులను కూడా ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీ, పీజీ స్థాయిలో రుగ్వేదం, యజుర్వేదం, శుక్ల యజుర్వేదం, అధర్వణ వేదం, సామవేదం తదితర విభాగాల్లో విద్యను అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్టు సమాచారం. అలాగే ఇదే విభాగాల్లో డిప్లొమా కోర్సులను అందించాలని, అవసరమైన చోట్ల భవిష్యత్తులో అనుబంధ కాలేజీలు, పాఠశాలలను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. అలాగే ఈ వర్సిటీలో ప్రధానంగా పౌరహిత్యం, వేద అధ్యయనంతో పాటు ఆధునిక సమాజానికి అవసరమైన రహస్యాలపై పరిశోధనలు జరిపించాలని భావిస్తోంది. ప్రధానంగా మానవ జన్మ, మృత్యు రహస్యాలు, మానవ శరీరాన్ని నడిపించే శక్తి, తాళపత్ర గ్రంథాల్లో ఉండే లిపితో పాటు ఇతర వైదిక అంశాలు ప్రపంచానికి తెలిసేలా వర్సిటీ పరిశోధనలు చేయనుంది. అలాగే భావితరాలకు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తుల గురించి తెలియజేసే లక్ష్యంగా వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయనున్నారు. వేద విశ్వవిద్యాలయం పూర్తి అయినా తరువాత వివిధ పుణ్యక్షేత్రాల పరిధిలో స్థల అనుకూలతను బట్టి వేద పాఠశాలలను ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

తొర్రూరు సీఐ అరెస్టు

- రేషన్‌బియ్యంతో పట్టుబడిన వారివద్ద లంచం డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితులు
- అదుపులోకి తీసుకున్న అధికారులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సాంబయ్య



సీఐ జగదీష్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

తొర్రూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యంతో పట్టుబడిన లారీని విడిపించేందుకు లంచం అడిగిన తొర్రూరు సీఐ కె.జగదీష్‌ను ఏసీబీ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. ఈ ఘటనకు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని దంతాలపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని 2024 అక్టోబరు 2వ తేదీన మండల కేంద్రంలో పోలీసులు పట్టుకుని, ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఐదుగురు మహబూబాబాద్ జిల్లాకు చెందినవారు కాగా, మరొకరు ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనకు చెందిన కిరణ్‌కుమార్ అనే వ్యక్తి ఉన్నారు. అయితే లారీని విడిపించేందుకు రూ.5 లక్షలు లంచం ఇవ్వాలని సీఐ జగదీష్ వారిని డిమాండ్ చేయగా, అక్టోబరు 3వ తేదీన రూ.2 లక్షలు ఇచ్చారు. మిగతా రూ.3 లక్షలు ఇవ్వాలని ఫోన్‌లో అడగగా, విసుగు చెంది వారు ఫోన్ రికార్డు చేసి అక్టోబర్ 25న వరంగల్‌లో ఏసీబీ కార్యా లయంలో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి తగు ఆధారాలతో సీఐని పట్టుకునేందుకు ఏసీబీ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఏసీబీ డీఎస్పీ సాంబయ్య సిబ్బందితో కలిసి తొర్రూరు స్టేషన్ ఆవరణలో ఉన్న సీఐ ఇంట్లో ఐదు గంటల పాటు సోదాలు నిర్వహించారు. బంగారంతో పాటు కొన్ని డాక్యుమెంట్‌లను స్వాధీనం చేసుకున్నారు. దాంతోపాటు రేషన్ బియ్యం నిందితుల వద్ద తాను రూ.2 లక్షలు తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో ఇద్దరు ప్రభుత్వ అధికారుల సమక్షంలో వివరాలు నమోదు చేసి, సీఐ జగదీష్‌ను వరంగల్‌లోని ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ తనిఖీల్లో ఏసీబీ సీఐలు ఎల్.రాజు, ఎ.రాజు, సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా జగదీష్ సొంత గ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో కూడా ఏసీబీ అధికారులు సోదా చేసి పలు డాక్యుమెంట్‌లను స్వాధీనం చేసుకున్నారు.



హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

- 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వడమే లక్ష్యం
- జనవరి 26 నుంచి రైతు భరోసా
- భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12 వేలు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఆర్టీసీని దండుగ కాకుండా పండుగ చేశాం
- ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

7



ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రులు పొన్నం, పొంగులేటి, సురేఖ

జిల్లాలో తేలిన ఓటర్ల లెక్క

మొత్తం 5,07,256 - 483 పోలింగ్ కేంద్రాలు

జాబితా విడుదల చేసిన అదనపు కలెక్టర్



హనుమకొండ కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ నమోదు-2025లో భాగంగా రూపొందించిన తుది ఓటరు జాబితాను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఓటరు నమోదు తుది జాబితాలో మొత్తం 5లక్షల 7వేల 256 మంది ఓటర్లు ఉన్నారని, జిల్లాలోని రెండు నియోకవర్గాల్లో 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ముసాయిదా జాబితాలో 5,07,256 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 2,47,920 మంది పురుషులు, 2,59,318 మంది స్త్రీల ఓటర్ల తోపాటు 18మంది ఇతర ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రుణ ప్రతిపాదనలు పకడ్బందీగా ఉండాలి

డీసీసీ బ్యాంకు సీఈవో సుల్తాన్



సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, నాబార్డు డీడీఎం చంద్రశేఖర్

హనుమకొండ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసే పంట రుణాల ప్రతిపాదనలు పకడ్బందీగా ఉండాలని డీసీసీ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జిల్లా స్థాయి సాంకేతిక నిపుణుల సమావేశం జరిగింది. నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్‌తో కలిసి వజీర్ సుల్తాన్ పంట రుణాల అంశంపై సమీక్ష జరిపారు. రైతుల పంట రుణాల, రుణ పరిమితి తదితర అంశాలపై ప్రతిపాదనల రూపకల్పన విషయాలపై సమీక్షను జరిపి దిశా, నిర్దేశం చేశారు. రూపొందించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల వ్యవసాయ అధికారులు, బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలి

- రాష్ట్ర హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్
- క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదు పరిశీలన



వరంగల్ రామన్నపేటలో ప్రజలతో మాట్లాడుతున్న ఎండీ గౌతమ్

వరంగల్ కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నమోదు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం అధికారులకు సూచించారు. సోమవారం బల్దియా పరిధిలోని పలు కాలనీలలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు జిల్లా అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ప్రజలతో కలిసి మాట్లాడారు. వరంగల్ నగరంలోని 29వ డివిజన్ రామన్నపేటలో పర్యటించారు.

ఈ సందర్భంగా గౌతం మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమమ్మ ఇండ్ల సర్వేలో అక్రమాలు జరుగకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. సర్వే నమోదు తీరును జాగ్రత్తగా తప్పులకు తావు లేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. సర్వే సమయంతో ఏదైనా సాంకేతిక లోపం ఉంటే వెంటనే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి తప్పకుండా న్యాయం జరిగే విధంగా చూడాలని దళారుల చేతుల్లో ప్రజలు మోసపోవద్దని అన్నారు.

అనంతరం హనుమకొండ ఐడీఏవోసీ కార్యాలయంలో అక్కడి అధికారులతో మాట్లాడి ఇప్పటి వరకు పూర్తయిన సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 90 శాతం సర్వే పూర్తి అయినట్టు అధికారులు వెల్లడించడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ సీఈ చైతన్యకుమార్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మోసం చేయడం కాంగ్రెస్ నైజం

- అమలుకాని హామీలిచ్చి రైతులను ముంచింది
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆగ్రహం
- హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయం వద్ద ధర్నా
- అరెస్టు చేసిన పోలీసులు.. పరిస్థితి ఉద్రిక్తం



మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్‌ను అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

హనుమకొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నమ్మించి మోసం చేయడం కాంగ్రెస్ పార్టీ నైజమని, ఎన్నికలకు ముందు అమలుకాని హామీలు ఇచ్చి రైతులను నట్టేట ముంచిందని హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు సోమవారం హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో వద్ద ధర్నా నిర్వహించారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం వద్ద ఆందోళనకు వెళ్తున్న దాస్యం వినయ్ భాస్కర్‌ను, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. వందలాది మంది పోలీసు సిబ్బంది బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. సుబేదారి పరిధిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ రైతు డిక్లరేషన్ పత్రాలను పాతిపెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ 'కుడా' ౘైర్మన్ మర్రి యాదవ రెడ్డి, కార్పొరేటర్లు సంకు నర్సింగ్, సోదా కిరణ్, ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, ఉడుతల సారంగపాణి, పార్టీ సీనియర్ నాయకులు నార్లగిరి రమేష్, బండి రజినీకుమార్ పాల్గొన్నారు.

యూనివర్సిటీ పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్తత..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని భారత రాష్ట్ర జాగృతి ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులను విడుదల చేయాలని ఆందోళన చేస్తుండగా పోలీసులు విజయ్ భాస్కర్‌ను అరెస్టు చేశారు. కొద్ది సేపు పోలీసులకు విజయ్‌భాస్కర్ అనుచరులకు మధ్య తోపులాట జరిగింది.

- ధర్మసాగర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు భరోసా నిరసన కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. కాజీపేటలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

బీఐఎస్‌తో వరంగల్ నిట్ ఎంవోయూ


- కొత్త పరిశోధనలకు అవకాశం
- బీఐఎస్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ శ్రీకాంత్
- ఆన్‌లైన్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



బీఐఎస్‌తో కుదుర్చుకున్న ఎంవోయూను పరస్పరం మార్చుకుంటున్న దృశ్యం

హనుమకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ ప్రమాణాల రూపకల్పన, పరిశోధనలో సాంకేతిక విద్యార్థులను భాగం చేసేందుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)తో వరంగల్ నిట్ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం బీఐఎస్ 78వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆన్‌లైన్ వేదికగా పాల్గొన్న కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే, బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ సమక్షంలో బీఐఎస్ హైదరాబాద్ శాఖ డైరెక్టర్ పీవి శ్రీకాంత్, ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా బీఐఎస్ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ.. 78 ఏళ్లుగా భారతీయ ప్రమాణాల రూపకల్పనలో బీఐఎస్ విశేష సేవలందిస్తోందనీ, ఐఎస్ఐ మార్క్, బంగారు ఆభరణాలకు హాల్‌మార్క్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు రిజిస్ట్రేషన్ మార్కుల ద్వారా వినియోగదారులకు భరోసానిస్తుందన్నారు. ప్రమాణాల గురించి విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించేందుకు, సాంకేతిక పరిశోధనల్లో భాగం చేసేందుకు దేశవ్యాప్తంగా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో బీఐఎస్ ఒప్పందం చేసుకుంటుందన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఎన్ఐటీ విద్యార్థులకు ప్రమాణాల రూపకల్పనతో పాటు సాంకేతిక కమిటీల్లో సభ్యులుగా చేరేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. కళాశాల కేంద్రంగా పరిశోధనలు చేసేందుకూ సహకరించనున్నట్టు తెలిపారు. బీఐఎస్-వరంగల్ నిట్ మధ్య కుదిరిన ఈ ఎంవోయూ భవిష్యత్తులో నాణ్యతా ప్రమాణాల మదింపు విషయంలో అధునాతన సాంకేతిక వ్యవస్థల అభివృద్ధికి, వినూత్న పరిశోధనలకు కొత్త ద్వారాలను తెరువగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి మట్లాడుతూ బీఐఎస్ వరంగల్ నిట్ మధ్య ఎంవోయు కుదరడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రమాణాల రూపకల్పనలో విస్తృతమైప పరిశోధనలు చేయడానికి నిట్ విద్యార్థులకు అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు శ్రీనివాసాచార్య, రతీష్ కుమార్, వేణు వినోద్, శిరీష్, శ్రీనివాసరావు, బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేశ్ తస్నీరు, ఎస్‌పీవో అబిసాయి ఇట్ల పాల్గొన్నారు.



నేడు ఐనవోలు జాతరపై సమీక్ష

ఐనవోలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న సమావేశంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, టెస్కాబ్ ౘైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కలెక్టర్ ప్రావీణ్యలతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొననున్నారు. కాగా, ఈ నెల 12 నుంచి జాతర ప్రారంభం కానుంది.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

జనగామ కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని హైకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ చంద్రకుమార్, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరాజం అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ముందు సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన దీక్షలు 28వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం చేపట్టిన దీక్షకు వారు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి 28 రోజులుగా సమ్మె చేపట్టిన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. విద్యాబుద్ధులు నేర్పించే గురువులను రోడ్డుపై ఉంచడం సరికాదన్నారు. ఎస్‌వోల స్థానం డిప్యుటేషన్ వేస్తూ అదనపు టీచర్లను నియమించడంఅన్యాయమన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన 15 రోజుల తరువాత చేపట్టిన సమ్మె చట్టబద్ధమేనన్నారు. జీవో 16 కేజీబీవీలకు వర్తించదన్నారు. రాజకీయ అనుభవమున్న సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటపై నిలబడాలన్నారు.

9న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న ములుగు రోడ్‌లోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సీహెచ్. ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జొమాటోలో హైదరాబాద్‌లో డెలివరీ బాయ్స్ కోసం ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల లోపు పది లేదా ఇంటర్ పాసైన యువతీ యువకులు హాజరు కావచ్చునని తెలిపారు.

ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం..

- ఈ ప్రాంతాన్ని పట్టించుకోని గత ప్రభుత్వం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కొండాపూర్‌లో మినీ లిఫ్ట్-1 పనులకు భూమిపూజ



కొండాపూర్ శివారులో మినీ లిఫ్ట్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

చిలుపూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న ప్రతీ ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం జనగామ జిల్లా చిలుపూర్ మండలం కొండాపూర్ శివారులో మినీ లిఫ్ట్-1 (ఎత్తిపోతల పథకం) పనులకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాదుల రిజర్వాయర్ల ద్వారా నియోజకవర్గంలోని మెజారిటీ గ్రామాలకు రెండు పంటలకు సాగునీరు అందుతోందన్నారు. కొండాపూర్, శ్రీపతిపల్లి, లింగంపల్లి ఎత్తైన ప్రదేశంలో ఉన్న కారణంగా భూగర్భ జలాలు త్వరగా అడుగంటేవన్నారు. సాగునీరందని గ్రామాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం(బీఆర్ఎస్) మల్లన్నగండి, ఉప్పుగల్లు రిజర్వాయర్లపై లిఫ్టలను ఏర్పాటు చేస్తామని గొప్పలు చెప్పిందే తప్ప, పనులు మాత్రం ప్రారంభించలేదన్నారు. ఏడాదిన్నర క్రితం లిఫ్ట్-2 పనులను మాత్రమే ప్రారంభించి వేలేరు మండలంలోని కొన్ని గ్రామాలకు మాత్రమే నీళ్లిచ్చారన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో వచ్చే జూలై నాటికి మినీ లిఫ్ట్-1 ద్వారా మల్లన్నగండి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ పనులను పూర్తి సాగునీరందించడంతోపాటు, 75 కుంటలు, చెరువుల్లోకి 200 రోజుల పాటు, గోదావరి జలాలను తరలించేందుకు కృషి చేస్తానన్నారు. వేలేరు మండలంలోని పీచరలో నిర్మిస్తున్న 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మార్చి నెలాఖరులోగా వినియోగంలోకి తీసుకొస్తానని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో చిలుపూర్‌గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఏఎంసీ చైర్మన్ లావణ్య-శిరీష్‌రెడ్డి, ఎస్ఈ సుధీర్, ఈఈ ప్రవీన్, డీఈలు శ్రీకాంత్, శంకరయ్య, ఏఈలు కమలాకర్, రాంబ్రహ్మం, శ్రీకాంత్, నాయకులు గడ్డమీది సురేశ్, రంగు రమేష్, మారబోయిన ఎల్లయ్య, యశ్వంత్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు, ఏడవెల్లి మల్లారెడ్డి, పసుల వెంకటేశ్, గుర్రాల వెంకట్‌రెడ్డి, ఊరడి సతీష్, కొయ్యడ రాందాస్ పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

- ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, జనవరి 6: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. మంగళ, బుధవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

కోర్టు ధిక్కరణ కేసులో ఎస్ఐకి ఊరట

రఘునాథపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసులో రఘునాథపల్లి ఎస్ఐ డి.నరేష్‌కు సోమవారం ఊరట లభించింది. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి నిందితున్ని అరెస్టు చేశారన్న విషయంలో ఎస్ఐ నరేష్‌కు 27 డిసెంబరు 2024న హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును అప్పీల్ చేయగా, హైకోర్టు డివిజనల్ బెంచ్ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. జనగామ జిల్లా తరిగొప్పుల ఎస్ఐగా డి.నరేష్ పని చేస్తున్నప్పుడు ధాన్యం అమ్మకాల విషయంలో తరిగొప్పుల పోలీస్ స్టేషన్‌లో 11 ఫిబ్రవరి, 2023న గొలుసు నర్సయ్యపై కేసు నమోదైంది. దీంతో నర్సయ్య హైకోర్టును ఆశ్రయించగా, సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారం దర్యాప్తు చేయాలని ఎస్ఐని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ నరేష్ 17 ఫిబ్రవరి, 2023న నర్సయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. దీంతో నర్సయ్య దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారించిన హైకోర్టు సింగిల్‌బెంచ్ ఎస్ఐ నరేష్‌కు 27డిసెంబరు, 2024న వారం రోజుల జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన విషయం విదితమే.

కేయూలో గొడవకు దిగిన స్టూడెంట్ సస్పెన్షన్

- కఠిన చర్యలకు దిగిన అధికారులు.. విద్యార్థిపై వేటు..

కేయూ క్యాంపస్ జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ హాస్టల్ నుంచి తాగి గొడవకు దిగడమే కాకుండా మరో విద్యార్థిపై దాడికి పాల్పడిన ఘటనలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్ కుమార్ కఠిన చర్యలకు దిగారు. సదరు విద్యార్థిపై నాలుగు వారాలపాటు వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఘటన వివరాలిలా ఉన్నాయి. గత డిసెంబరు 31న నూతన సంవత్సరం సందర్భంగా జరిగిన సంఘటనల ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్సిటీ క్యాంపస్‌లోని స్పోర్ట్స్ హాస్టల్‌లో ఉంటున్న ఎంహెచ్ ఆర్ఎం సెకండ్ ఇయర్ స్టూడెంట్ జగ్జీవన్‌రామ్ హాస్టల్‌కు వెళ్ళి తాగిన మైకంలో గొడవకు దిగారు. అలాగే ఎంకామ్ స్టూడెంట్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారంలో అప్పడే పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఘర్షణకు దిగిన స్టూడెంట్‌ను అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ చేశారు.

ఈ ఘటనలో హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ బాధిత ఎంకామ్ స్టూడెంట్‌తో మాట్లాడి వివరాలను సేకరించారు. అనంతరం విషయాన్ని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్ళారు. గొడవకు దిగిన సదరు విద్యార్థిని నాలుగు వారాల పాటు హాస్టల్ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్తర్వులను వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయానికి అందచేశారు.

హాస్టల్ ఆఫీస్ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

కాకతీయ యూనివర్సిటీ హాస్టల్ ఆఫీస్ ఉద్యోగికి హాస్టల్స్ కేర్ టేకర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూళ్లకు పాల్పడేందుకు ప్రయత్నించారనే ఆరోపణల నేపథ్యంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి షోకాజ్‌నోటీసులు జారీ చేశారు. వర్సిటీ హాస్టల్ ఆఫీస్ పరిధిలో పనిచేస్తున్న కేర్ టేకర్ల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లకు దిగినట్లు వీడియో రికార్డు రిజిస్ట్రార్ మల్లారెడ్డికి చేరినట్లు సమాచారం. కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు సుబేదారిలో వర్సిటీకి చెందిన 12 హాస్టల్స్ ఉన్నాయి. ప్రతీ హాస్టల్‌కు ఒక్కో కేర్ టేకర్‌ను నియమించారు. ఆయా కేర్ టేకర్లు నెలలో సమర్పించే బిల్లులను ఎక్కువ చూపించి ఒక్కొక్కరూ రూ.4వేల చొప్పున ఇవ్వాలంటూ సదరు హాస్టల్ ఆఫీస్ ఉద్యోగి డిమాండ్ చేసినట్లుగా వీడియోలో మాట్లాడినట్లు తెలిసింది. షోకాజ్ నోటీసులకు ఒక్కటి, రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి స్పష్టం చేశారు.

ఇదిలా ఉండగా ఇటీవల హాస్టల్ కార్యాలయంలో ఏఆర్‌గా పనిచేస్తున్న కృష్ణయ్య అవినీతికి పాల్పడి ఏసీబీ అధికారులకు పట్టుపడ్డడం సంచలనం రేపింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని సోమవారం వర్సిటీ పరిపాలన భవనంలోని రిజిస్ట్రార్ కార్యాలయానికి అధికారులు పిలిపించి విచారణ చేశారు. సదరు ఉద్యోగి మాట్లాడినట్లు తెలుస్తున్న వాయిస్ రికార్డు వివరాలు తీసుకున్నారు. సదరు ఉద్యోగిపై వేటు పడే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలుస్తోంది. అయితే వచ్చే ఏడాదిలో రిటైర్డు పొందనున్న నేపథ్యంలో వర్సిటీ అధికారులు చూచిచూడనట్లుగా వ్యవరిస్తున్నట్లు తెలుస్తోంది.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్



గుడిసెవాసులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి విక్రమ్

జనగామరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జనగామ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ గ్రౌండ్ సమీపంలో నివసిస్తున్న గుడిసెవాసులకు జడ్జి హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం రూపొందించిన పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, లేబర్ కార్డు కలిగి ఉండాలని, పిల్లలను బాలకార్మికులుగా మార్చకుండా తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని, విలువలతో కూడిన మంచి జీవితాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీందర్, పారా లీగల్ వలంటరీస్ రాములు, స్వప్న, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న సమ్మయ్య

గీసుగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : 15వ డివిజన్ మొగిలిచర్ల ప్రధాన రహదారిలో క్రషర్‌పొడితో వెళుతున్న టిప్పర్ ఢీకొని వరంగల్ కాశిబుగ్గకు చెందిన దంపతులకు సోమవారం తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాశిబుగ్గకు చెందిన బయ్య సమ్మయ్య (అయ్యప్ప స్వామి), పోచమ్మ దంపతులు కాశిబుగ్గ నుంచి ఆత్మకూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈ క్రమంలో మొగిలిచర్ల శివారులో గల మహాలక్ష్మి ఫంక్షన్‌హాల్ వద్ద టిప్పర్ అతివేగంగా ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో కిందపడిపోయిన సమ్మయ్య, పోచమ్మకు తలకు, కాళ్లుచేతులకు బలమైన గాయాలయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 ద్వారా క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల బంధువుల ఫిర్యాదు మేరకు టిప్పర్‌తో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

9న కేడీసీలో ఇంటర్ అభ్యర్థులకు ఉద్యోగ మేళా

కేయూ క్యాంపస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జనవరి 9న హిందుస్థాన్ కంప్యూటర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్ టెక్‌బీ) సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు టెక్‌బీ స్టేట్ హెడ్ శ్రీనివాస్, హెచ్‌సీఎల్ క్లస్టర్ లీడ్ నరేశ్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, కంప్యూటర్ ఒకేషనల్ (మాథ్స్ సబ్జెక్టులో 60 శాతం) కోర్సుల్లో 2024లో ఇంటర్‌లో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు. ఇప్పుడూ చదువుతున్న విద్యార్థులందరూ అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు జనవరి 9న ఉదయం 9 గంటలకు కేడీసీలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 75691-77071, 79818- 34205 లో సంప్రదించాలని కోరారు.

సంక్రాంతికి స్పెషల్ రైళ్లు

కాజీపేట మీదుగా నడవనున్న పలు సర్వీసులు



కాజీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా కాజీపేట మీదుగా పలు ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. జనవరి 13న (07487) నాందేడ్ - కాకినాడ స్పెషల్ రైలును నడుపనున్నారు. ఈ రైలుకు కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. (02764) చర్లపల్లి - తిరుపతి స్పెషల్ రైలు జనవరి 8, 11, 15 తేదీల్లో నడవనుంది. (02763) తిరుపతి - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైలుకు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. (07655) కాచిగూడ - తిరుపతి స్పెషల్ రైలు జనవరి 16న, (07656) తిరుపతి - కాచిగూడ ఎక్స్‌ప్రెస్ స్పెషల్ రైలు జనవరి 10, 17 తేదీల్లో నడవనుంది. ఈ రైలు జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రైళ్ల సమయాల్లో స్వల్ప మార్పులు

ప్రతి ఏడాది కొత్త సంవత్సరంలో పలు రైళ్ల రాకపోకల సమయాల్లో స్వల్పమార్పు చేసే రైల్వే శాఖ ఈ ఏడాది కూడా స్వల్ప మార్పులు చేసింది. కాజీపేట మీదుగా వెళ్లే రైళ్ల సమయాల్లో మార్పులు ఇలా ఉన్నాయి. (17011) సికింద్రాబాద్ - కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు ఉదయం 7.08కు వచ్చి 7.10 గంటలకు వెళ్తుంది. (12723) హైదరాబాద్ - న్యూఢిల్లీ తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు ఉదయం 7.50కు వచ్చి 8 గంటలకు వెళ్తుంది. (12759) చెన్నై ఎగ్మోర్ - హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు ఉదయం 4.33కు వచ్చి 4.35 గంటలకు వెళ్తుంది. (17202) సికింద్రాబాద్ - గుంటూర్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాజీపేటకు మధ్యాహ్నం 2.48కు వచ్చి 2.50 గంటలకు వెళ్తుంది. (17659) సికింద్రాబాద్ - భద్రాచలం రోడ్డు కాకతీయ పాస్ట్‌ప్యాసింజర్ కాజీపేటకు సాయంత్రం 7.48కు వచ్చి 7.50గంటలకు వెళ్తుంది. (18520) ముంబై - విశాఖపట్నం లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) కాజీపేటకు రాత్రి 9.43 గంటలకు వచ్చి 9.45 గంటలకు వెళ్తుంది.

విద్యుదాఘాతంతో ఫామ్-డీ విద్యార్థి మృతి

- మగ్దుంపురం ప్రైవేట్ హాస్టల్‌లో ఘటన
- వార్డెన్ నిర్లక్ష్యమే కారణమంటున్న సహ విద్యార్థులు



అవినాష్‌రెడ్డి మృతదేహం

నర్సంపేటటౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ(ఫామ్-డీ) విద్యార్థి మృతి చెందాడు. ఈ సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం మగ్దుంపురంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో సోమవారం సాయంత్రం జరిగింది. హాస్టల్ విద్యార్థులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వి గ్రామానికి చెందిన కొండల్‌వాడి ధత్తారెడి-లక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు కొండల్‌వాడి అవినాష్‌రెడ్డి(18) నర్సంపేట మండలం మగ్దుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో డాక్టర్ ఆఫ్ ఫార్మసీ (ఫామ్-డీ) మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తూ కళాశాల ఎదురుగా ఉన్న ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం హాస్టల్ వార్డెన్ హాస్టల్ భవనం పైనున్న ట్యాంక్‌లోకి నీరు రావడం లేదని మోటార్‌లో లెవల్ నీటిని పోయాలని విద్యార్థి అవినాష్‌రెడ్డిని పురమాయించి కరెంట్ స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. ఇదే సమయంలో లెవల్ నీటిని పోస్తుండగా మోటార్ పైపు పక్కనే ఉన్న విద్యుత్ వైరుకు అవినాష్‌రెడ్డి ఎడమ చేయి తగిలి విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు.

హాస్టల్ నిర్వాహకుడు వెంటనే తన స్కూటీపై మగ్దుంపురంలోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అక్కడ వైద్యం అందకపోవడంతో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆస్పత్రి వైద్యులు అవినాష్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేసి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న చెన్నారావుపేట ఎస్సై రాజేష్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

శోకసంద్రంలో విద్యార్థులు

అప్పటి వరకు తమతో ఉన్న అవినాష్‌రెడ్డి విద్యుదాఘాతంతో అకస్మాత్తుగా మృతి చెందడంతో తోటి విద్యార్థులు కన్నీరు మున్నీరయ్యారు. హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం వల్లే అవినాష్‌రెడ్డి మృతి చెందాడని ఆరోపించారు. మృతికి కారణమైన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

25 నుంచి పీజీ రెగ్యులర్ కోర్సుల సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 25 నుంచి పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు సోమవారం తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్ఆర్ఎంతో పాటు ఇతర పీజీ కోర్సుల పరీక్షలన్నీ జనవరి 25, 27, 29, 31, ఫిబ్రవరి 3, 5వ తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. రెగ్యులర్, ఎక్స్ సప్లిమెంటరీ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు.

సీఎంకు రైతుల ఉసురు తగులుతుంది

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



ఘన్‌పూర్‌లో రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో మోసం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి రైతుల ఉసురు తగులుతుందని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం ఘన్‌పూర్ మండలకేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాజయ్య సర్వీసు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.12వేలు ఇస్తామని మాట్లాడడం సరికాదన్నారు. రైతు రుణమాఫీని రైతులందరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం రైతుల పాలిట రాంబందులా మారాడని ఆరోపించారు. రైతు భరోసా పూర్తిగా ఇచ్చే వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో నాయకులు కనకం గణేష్, ఆకుల కుమార్, చల్లా చందర్‌రెడ్డి, బంగ్లా శ్రీనివాస్, కుంభం కుమార్, మారపల్లి ప్రసాద్, గుండె మల్లేశం, గంగుల శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్, గాదె రాజు, శంకర్, రంజిత్, అశోక్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ముస్లిం మైనారిటీలు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను కించపరిచే విధంగా మాట్లాడినందుకు వ్యతిరేకంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సంవిధాన్ జిందాబాద్ సభకు హనుమకొండ 5వ డివిజన్ నుంచి ముస్లిం మైనారిటీలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. హనుమకొండ పశ్చిమ నియోజకవర్గం నుంచి మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మిర్జా అజీజ్ ఆధ్వర్యంలో ముస్లింలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఆల్ ఇండియా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ప్రతాప్‌గర్హీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీజేపీ మత విద్వేషాలను వ్యతిరేకిస్తూ సంవిధాన్ జిందాబాద్ అనే నినాదంతో ముందుగా తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి కార్యక్రమాలు షురూ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి సుమారు వంద మంది ముసిం మైనారిటీలు పాల్గొన్నట్టు మిర్జా అజీజ్ వెల్లడించారు.



సంవిధాన్ జిందాబాద్ సభకు వెళ్లిన ముస్లిం మైనారిటీలు

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2565	2345
పల్లికాయ (సూక)	7000	5600
పల్లికాయ (పచ్చిది)	4750	4500
కందులు	-	-
పెసళ్లు	7500	4000
పత్తి	7110	5800
పసుపు (కాడి)	11625	10235
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13000	9000
తేజ మిర్చి (కొత్తది)	15500	12000
తేజ ఏసీ	15400	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341ఏసీ	14000	11000
యూఎస్341కొత్తది	15011	14500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

గాలి పటమా.. పద..పద

- పల్లె, పట్టణాల్లో మొదలైన పతంగుల పండుగ
- మార్కెట్‌లో ఆకర్షిస్తున్న రంగురంగుల కైట్‌లు
- చైనా మాంజాపై తీవ్ర వ్యతిరేకత


అమ్మకానికి సిద్ధంగా ఉన్న దారం చెరకలు

వరంగల్ కల్చరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అనగానే.. ముగ్గులు, గొబ్బెమ్మలు, భోగిపండ్లు, హరిదాసు కీర్తనలతో పాటు వెంటనే గుర్తొచ్చేవి గాలిపటాలు. పంచవన్నెల పతంగులకు మంజా దారం కట్టి మైదానంలోకి వెళ్లి ఆకాశంలోకి ఎగరేస్తే ఆ మజాయే వేరు. సంక్రాంతికి నెల రోజుల ముందు నుంచే పల్లెలు, పట్టణాల్లో పండుగ సందడి ప్రారంభమవుతుంది. పిల్లలు, పెద్దలు.. ముఖ్యంగా యువతీయువకులు ఆసక్తితో పతంగులు ఎగరేస్తారు. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఈ పండుగకు గుర్తింపు లేకపోవడం బాధాకరం.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న గాలిపటాలు

రంగురంగుల గాలిపటాలు

పతంగుల పండుగ వచ్చిందంటే సందడే సందడి.. చిన్నారులు ఆనందోత్సవాలతో పతంగులను ఎగరవేస్తారు. ఇప్పటికే మార్కెట్‌లోకి రంగురంగుల గాలిపటాలు వచ్చాయి. వీటితో పాటు రీల్ దారం, మాంజ, చెరక లాంటి వస్తువులతో దుకాణాలు సందడిగా మారాయి.

చైనా మాంజ ప్రమాదకరం

ఇటీవల కాలంలో చైనా మాంజ మార్కెట్‌లోకి వచ్చింది. దాన్ని ఉపయోగిస్తే ప్రమాదాలు జరుగుతున్నాయి. పలువురు మృతి చెందారు. దీంతో ప్రభుత్వం చైనా మాంజ వినియోగంపై నిషేధం విధించింది.

కానరాని కైట్ ఫెస్టివల్

పతంగుల పండుగను తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం హనుమకొండలో కైట్ ఫెస్టివల్‌ను నిర్వహించింది. ఈ వేడుకకు దేశ నలుమూలల నుంచి, విదేశాల నుంచి కూడా డెలిగేట్లు హాజరయ్యారు. కాని ఆ తర్వాతి కాలంలో నిర్వహించలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎలాంటి కార్యక్రమాన్ని చేపట్టలేదు. దీంతో కైట్‌ఫెస్టివల్ కానరాకుండా పోయింది.


పతంగులు, మాంజలు విక్రయిస్తున్న నిర్వాహకులు

ప్రభుత్వం మళ్లీ పతంగుల పండుగకు గుర్తింపు ఇచ్చి వేడుక జరుపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సంక్రాంతి సెలవుల్లో పతంగుల జోరు

సంక్రాంతి పండుగకు దాదాపు వారం పది రోజులు విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటిస్తుంది. సంక్రాంతి, భోగి, కనుమతో మూడు రోజులు సాధారణ సెలవులు ప్రతీ ఒక్కరికి లభిస్తాయి. ఈ మూడురోజులు ప్రతీ ఒక్కరు గాలి పటాలు ఎగరవేస్తారు. పల్లెలు, పట్టణాల్లో పతంగుల జోరు కొనసాగుతుంది. పలుచోట్ల పోటీలు నిర్వహించి బహుమతులు కూడా ఇస్తారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న పతంగులు

వేద విశ్వవిద్యాలయం.. ఎక్కడో.. ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

కొనసాగించేలా వేదిక్ వర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో వేద యూనివర్సిటీకి అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలని, అందుకోసం వివిధ పీఠాల అధిపతులను, పండితులను, స్వాముల సూచనలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని దేవాదాయశాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించించినట్టుగా సమాచారం. ఏపీలోని వేద విశ్వవిద్యాలయాన్ని 50 ఎకరాల్లో నిర్వహిస్తున్నారు. అదే తరహాలో తెలంగాణలో కూడా యూనివర్సిటీకి కనీసం 30 ఎకరాల నుంచి 50 ఎకరాల వరకు స్థలం అవసరంగా గుర్తించారు. దీంతో పలు పుణ్యక్షేత్రాల్లో వర్సిటీకి కావాల్సిన స్థలం, సౌకర్యాలపై దేవాదాయశాఖ అధికారులు అన్వేషణ ప్రారంభించినట్లుగా తెలిసింది.

ఏ పుణ్యక్షేత్రం.. వేద విద్యకు వేదికయ్యేనో?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు టీటీడీ ద్వారా తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయం అనేక కార్యక్రమాలు, కోర్సులను నిర్వహించేది. 2014లో తెలుగు రాష్ట్రాల విభజన తరువాత ఆధ్యాత్మికతను విస్తరించి, భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయలను అందించే బోధన లేకుండా పోయింది. దీంతో 2019లోనే అప్పటి ప్రభుత్వం కాళేశ్వరం క్షేత్రంలోనే గోదావరి తీరాన వేద కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా అడుగులు ముందుకు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేదిక్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తుంది. అయితే గోదావరి తీరంతో పాటు యముడు, శివుడు ఒకే పానపట్టంపై రెండు లింగాల రూపంలో వెలిసిన కాళేశ్వరంలోనే వేద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. అంతేకాకుండా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గం పరిధిలోనే కాళేశ్వరం ఉండటం, ఈ ప్రాంతంలో బ్రాహ్మణ సామాజిక వర్గం ఎక్కువగా ఉండటంతో కాళేశ్వరం వేద కళాశాలకు అనువైన ప్రాంతంగా భావిస్తున్నారు. అయితే తెలంగాణలో ఎక్కువ మంది భక్తులకు ఇలవేల్పుగా ఉన్న వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి పుణ్యక్షేత్రం వద్ద వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలనే ఒత్తిడి కూడా ఉంది. విశ్వవిద్యాలయానికి కావాల్సిన 30 ఎకరాల భూమిని కూడా ఇచ్చేందుకు దేవాదాయశాఖ అధికారులు ముందుకు వస్తున్నారు. ఇక చదువుల తల్లి సరస్వతి నిలయమైన బాసర, ఉగ్రమాత, చల్లని కరుణమాత భద్రకాళి వెలిసిన వరంగల్‌లో కూడా వేద విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సొంత ప్రాంతం కావటంతో వరంగల్‌లోని భద్రకాళి పుణ్యక్షేత్రం వద్ద ఈ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రిపై స్థానికంగా ఒత్తిడి పెరుగుతోంది. అయితే దేశంలో అనేక ప్రాంతాల్లో ఉన్న వేదిక్ వర్సిటీలు వైష్ణవాలయల్లోనే ఏర్పాటు చేశారు. ఏపీలో కూడా తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోనే ఈ యూనివర్సిటీ ఉంది. అదే అనవాయితీగా వస్తే తెలంగాణలో ప్రముఖ వైష్ణవ క్షేత్రాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. గోదావరి తీరాన ఉన్న ధర్మపురిలో వేద విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. అలాగే భద్రాచలం, యాదగిరిగుట్ట ఆలయాలను కూడా పరిశీలిస్తున్నారు. అయితే రాజకీయ ఒత్తిళ్లు, స్థల అనుకూలత, సౌకర్యాలను బట్టి వేములవాడ, కాళేశ్వరం, ధర్మపురి లేదంటే భద్రకాళి పుణ్యక్షేత్రాల్లోనే వేదిక్ వర్సిటీ ఏర్పాటుకు అధికారులు ప్రాధాన్యమిచ్చే అవకాశమున్నట్టు ప్రచారం జరుగుతోంది.

పాత్రికేయులు ఎంఎస్ ఆచార్య

విగ్రహం ఏర్పాటునకు సన్నాహాలు

- పాలకొల్లులో సిద్ధమవుతున్న విగ్రహం
- శత జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు
- వరంగల్ ప్రెస్ క్లబ్‌లో విగ్రహం ఏర్పాటునకు లేఖ రాసిన శ్రీధరాచార్య
- నగర ప్రధాన కూడలిలోనూ ఏర్పాటునకు స్థల పరిశీలన

హనుమకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పత్రికా రంగంలో అర్థశతాబ్దం పాటు విశేషమైన కృషి చేసిన వరంగల్ వాణి దినపత్రిక, జనధర్మ జాతీయ వారపత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ ఎంఎస్ ఆచార్య విగ్రహాన్ని వరంగల్ నగరంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆచార్య శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయన స్మృత్యర్థం నగరంలో ఏదైనా ఒక చోట ప్రధాన కూడలిలో విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు స్థల పరిశీలన జరుగుతోంది. వరంగల్, హనుమకొండ, కాజీపేట పట్టణాల్లో అనువైన చోట విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. గోదావరి జిల్లా పాలకొల్లులోని మర్లపూడిలో విగ్రహం తయారవుతోంది. కాగా, హనుమకొండ బస్‌స్టేషన్ సమీపంలోని వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఆచార్య విగ్రహం ఏర్పాటుకు అనుమతి కోరుతూ ఆయన కుమారుడు కేంద్ర సమాచార పూర్వ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధరాచార్యులు ఈనెల 7వ తేదీన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజుకు లేఖ రాశారు. 1924లో జన్మించిన ఆచార్య 1958లో జనధర్మ జాతీయ వారపత్రికను, 1980లో వరంగల్ వాణి పేరుతో స్థానిక దిన పత్రికను ప్రారంభించి ఉమ్మడి వరంగల్ జిల్లా సమస్యలను ఎత్తి చూపడం ద్వారా వాటి పరిష్కారానికి ఒక నిఖార్సయిన జర్నలిస్టుగా తన వంతు కృషి చేశారు. మాడభూషి శ్రీధరా చార్యతో పాటు వార్త పత్రిక సంపాదకులుగా పని చేసిన టంకశాల అశోక్, దామెర్ల సాయిబాబ తదితరులు ఆచార్య శిష్యులే.



రామప్ప అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పర్యాటక, సాంస్కృతిక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్

వెంకటాపూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రామప్ప పర్యాటక ప్రాంత అభివృద్ధికి ప్రసాద్, సాస్కి ప్రాజెక్టుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ సెక్రటరీ స్మితా సబర్వాల్ అన్నారు. ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఆమె వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో ఉన్న రామప్ప దేవాలయాన్ని సందర్శించగా కలెక్టర్ టీఎస్.దివాకర పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు .ఈసందర్భంగా రామప్ప దేవాలయం పరిధిలో జరుగుతున్న ప్రసాద్, సాస్కి ప్రాజెక్టుల పనుల గురించి కలెక్టర్ ఆమెకు వివరించారు. ప్రసాద్ స్కీం ద్వారా నిర్మిస్తున్న షాపింగ్‌కాంప్లెక్స్, పార్కింగ్, ఇంటర్ప్రిటేషన్ సెంటర్ పనులను పర్యవేక్షించిన స్మిత సబర్వాల్ హరిత కాటేజీలను సందర్శించారు. గత సంవత్సరం రూ.60కోట్లు ప్రసాద్ స్కీం ద్వారా మంజూరైన పనులు, ఈసంవత్సరం సాస్కి స్కీం ద్వారా రూ.73 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో రామప్ప పరిసర ప్రాంతాల్లో పర్యాటకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులతో లైట్‌అండ్ సౌండ్‌షో ఏర్పాటుపై చర్చించారు. ఆలయంలోని కల్యాణ మండపం పనులను పరిశీలించిన త్వరగా పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఏఎస్‌ఐ అధికారులకు సూచించారు. ఆలయ తూర్పు ముఖద్వారానికి వెళ్తున్న క్రమంలో ఉన్న రోడ్డును వెడల్పు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ తెలంగాణ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, హెరిటేజ్ డైరెక్టర్ లక్ష్మి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఇంజనీర్స్ జనరల్ మేనేజర్, ప్రాజెక్టు కన్సల్టెంట్స్ సత్యనారాయణమూర్తి, కేంద్ర పురావస్తుశాఖ అధికారి హెచ్‌ఆర్ దేశాయ్, ఆర్కియాలజీ డిప్యూటీ సూపరింటెండెంట్ రోహిణి పాండే, ఆర్కియాలజీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.నవీన్‌కుమార్, వరంగల్ సబ్ సర్కిల్ ఇన్‌చార్జి, తెలంగాణ హెరిటేజ్ డైరెక్టర్ రాములు నాయక్, డిప్యూటీ డైరెక్టర్ మల్లునాయక్, ములుగు ఆర్డీవో వెంకటేశ్, పర్యాటక అభివృద్ధి సంస్థ డీఈ ధన్‌రాజ్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్, పంచాయతీరాజ్, ఇరిగేషన్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.


రామప్ప దేవాలయ పరిసరాలను పరిశీలిస్తున్న స్మితా సబర్వాల్

ఓపెన్ కాస్ట్ వల్ల రామప్పకు ముప్పు

పీవీ నర్సింహరావు ఓపెన్ కాస్ట్ గని వల్ల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి ముప్పువాటిల్లే అవకాశం ఉందని, దీనిని నిలిపివేయాలని కోరుతూ పర్యాటక, సాంస్కృతిక శాఖ సెక్రటరీ స్మితాసబర్వాల్ రామప్ప పరిరరక్షణ కమిటీ కన్వీనర్ ఆకిరెడ్డి రామ్మోన్‌రావు వినతిపత్రం అందజేశారు. 850 సంవత్సరాల చరిత్ర గల వైభవానికి ఓపెన్ కాస్ట్ గని వల్ల ముప్పు పొంచి ఉందని పేర్కొన్నారు.

కోటగుళ్ల మరమ్మతు ప్రారంభించాలి

గణపురం (ఆంధ్రజ్యోతి): కాకతీయుల కట్టడమైన కోటగుళ్ల ప్రాథమిక మరమ్మత్తు పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పర్యాటక, యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు మండల కేంద్రంలోని కోటగుళ్లను, గణపసముద్రం కట్టడాలను పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి సందర్శించారు.

కోటగుళ్ల ప్రాంతంలో పర్యాటకుల సందర్శన, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కోటగుళ్ల పర్యాటకులను ఆకర్షించే విధంగా మెరుగుపరిచే విధంగా మరమ్మతులు పనులు చేపట్టాలని సూచించారు. ఈ నెలాఖరు కల్లా పనులు పూర్తయ్యేలా పనలుఉ చేపట్టాలన్నారు. అనంతరం గణపురం రిజర్వాయర్‌ను ఆమె పరిశీలించారు. పర్యాటకులకు విడిది, బోటు సౌకర్యాల కల్పన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులకు సౌకర్యాలను అందించేందుకు కాటేజీలు, బోటు షికారులు ఇతర అభివృద్ధి పనులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రహదారి పనులను వేగవంతం చేయాలని అన్నారు.

బ్లాక్ బెర్రీ దీవిని సందర్శించిన సబర్వాల్

మేడారం (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మొండ్యాల తోగు సమీపంలోని బ్లాక్ బెర్రీ దీవిని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ సందర్శించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ దివాకరతో కలిసి పర్యటించారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ పర్యాటకులకు ఆహ్లాదం కలిగించేలా బ్లాక్ బెర్రీ దీవిలో సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు.

ఆర్టీసీని దండుగ కాకుండా

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

పండుగ చేశాం

హనుమకొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల ఫామ్‌హౌస్ పరిపాలనకు చరమగీతం పాడి పేదోడి ప్రభుత్వం మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించారని, ఇందిరమ్మ ప్రభుత్వంలో ఆర్టీసీని దండుగ కాకుండా పండుగలా చేసి ఆదాయం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించారని వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు పలు రూట్లలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ బస్సులను హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా మంత్రి కొండా సురేఖ, శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్యలు కలిసి ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన తప్పులు సవరించుకునేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. 80వేల పుస్తకాలు చదివిన కేసీఆర్ వేలాది కోట్లు దోచుకున్నారని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని మండిపడ్డారు. నెలకు రూ.6,500 కోట్లు మిత్తీలకే కేసీఆర్ చేసిన అప్పులకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని, ఎన్నికల్లో ఇవ్వని హామీలు కూడా ప్రజల కోసం అత్యవసరమైన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని నాయకులు దోచుకోవడం కోసం రాలేదని, ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం పనిచేస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2023 డిసెంబరు 7న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రమాణస్వీకారం చేసిన వెంటనే డిసెంబరు 9న రాష్ట్రంలో మహిళలకు మహాలక్ష్మి పథకంతో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించినట్లు తెలిపారు. ఏడాది కాలంలో ఒక కోటి 25 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లాకు మొత్తం 112 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించగా ప్రస్తుతం 50 బస్సులు ప్రారంభించుకున్నట్లు తెలిపారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంతో మంది పేద ప్రజలకు ఉపయోగం జరిగిందన్నారు. గ్రామీణ స్థాయి నుంచి వివిధ ఆస్పత్రులకు సమస్యలపై ఉచిత బస్సు ప్రయాణం చేసి హైదరాబాద్‌లోని ఉస్మానియా, గాంధీ, ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకున్నట్లు గుర్తుచేశారు. ప్రతిపక్ష పార్టీల విమర్శలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌ను రెండవ రాజధానిగా చేసేందుకు ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. రూ.6 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు చెప్పారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని విమర్శించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు మాట్లాడుతూ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ఆటంకం కలిగిస్తుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి ప్రయాణికులకు అదనపు ఆర్టీసీ బస్సులు కేటాయించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ మునిశేఖర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, ఇతర ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీపై భట్టి ఫొటోను మరిచిన అధికారులు

సోమవారం ఆర్టీసీ అధికారులు 50 ఎలక్ట్రిక్ బస్సులను మంత్రులతో ప్రారంభించారు. స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఆర్టీసీ అధికారులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫొటోను ఏర్పాటు చేయలేదు. అక్కడికి వచ్చిన అధికారులు, కాంగ్రెస్ నాయకులు గుర్తించి ఉప ముఖ్యమంత్రి ఫొటో లేదని చెప్పడంతో వెంటనే అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు తాత్కాలికంగా భట్టి విక్రమార్క ఫొటోను అతికించారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రులు కార్యక్రమం ముగింపు తర్వాత కాంగ్రెస్ నాయకుడు పెరుమాండ్ల రామకృష్ణ తీసుకొచ్చిన డప్పులను మంత్రులకు ఇచ్చారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్టేజిపై డప్పు కొట్టారు.వరంగల్ రీజియన్‌కు వచ్చిన 50 ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభించి నగరంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఎలక్ట్రిక్ బస్సుల్లో పర్యటించారు.

పోలీసుల బందోబస్తు

హనుమకొండలోని బాలసముద్రంలో పోలీసులు మంత్రుల పర్యటనలో భాగంగా భారీ బందోబస్తు నిర్వహించారు. హయగ్రీవాచారి గ్రౌండ్ వద్ద మంత్రుల పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు వివిధ బలగాల సిబ్బందితో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రాంగణంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకపోవడంతో మంత్రుల పర్యటనలో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

హైదరాబాద్‌కు దీటుగా

20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వడమే లక్ష్యం

వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం

- భూమి లేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12 వేలు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న మంత్రులు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు దీటుగా ఉమ్మడి వరంగల్ జిల్లాను అభివృద్ధి చేయాలనే ఆలోచన సీఎం రేవంత్‌రెడ్డిదని రెవెన్యూ శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దానికి అనుగుణంగా ప్రభుత్వం ఏర్పాటై మొదటి సంవత్సరం పూర్తి కాకముందే సీఎం రెండు సార్లు వరంగల్ వచ్చారన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం మంత్రి పొంగులేటి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి గృహ నిర్మాణ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత, అభివృద్ధి, తదితర అంశాలపై కలెక్టర్లు, అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీతో కలిసి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి మొదటిసారి వరంగల్ పర్యటనకు వచ్చిన సందర్భంగా చేయాల్సిన అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి అభిప్రాయాలు తీసుకుని వరంగల్ ఎయిర్‌పోర్ట్, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. రెండోసారి వచ్చినప్పుడు అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని, నిధులు వరదలా విడుదల చేశారని, అలాగే 2041 మాస్టర్ ప్లాన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. భద్రకాళి చెరువు పూడికతీత, వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన టెండర్లు పిలిచామన్నారు. హైదరాబాద్ తరహాలో వరంగల్‌లో కూడా కొన్ని ఎలక్ట్రికల్ బస్సులు లాంచనంగా ప్రారంభించామన్నారు. సంక్రాంతి లోపు రెండో విడతలో మరికొన్ని ఎలక్ట్రికల్ బస్సులు ఇస్తామన్నారు. దేశంలో టీజీఎస్‌ఆర్టీసీని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆ శాఖను మంత్రి పొన్నం ప్రభాకర్ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 2004 నుంచి 2014 వరకు 25 లక్షల ఇళ్లు కట్టించిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వానిదని మంత్రి పొంగులేటి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తామని చెప్పి కలలు కలలుగానే ఉంచిందన్నారు. ఇండ్ల నిర్మాణం చేసి మొండిగా వదిలేసిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లు, ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున మంజూరు చేస్తూ, 4 సంవత్సరాల్లో 80 లక్షల ఇండ్లు నిర్మించే లక్ష్యంతో ముందుకెళుతుందన్నారు. సంక్రాంతికి ఇందరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, గతంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకోని వారు ఉంటే సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వీరికి జనవరి 31వ తేదీలోపు పారదర్శకంగా అర్హులైన పేదలందరికీ ఇండ్లు అందిస్తామన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇండ్లు కట్టిస్తానని ఆశ చూపి మొండి గోడలతో వాళ్లను నిలువునా ముంచిందని, అలాంటి బాధితులు బాధపడొద్దని, అలాంటి 1.5 లక్షల ఇండ్లను పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు.

జనవరి 26 నుంచి రైతు భరోసా ఇస్తాం

దేశంలోనే ఎక్కడా లేని విధంగా 25 లక్షల 65 వేల మంది రైతులకు రూ.22 వేల కోట్ల 2లక్షల లోపు రుణమాఫీ చేశామని, జనవరి 26 నుంచి రైతు భరోసా కింద రూ.12 వేలు అందిస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. అలాగే దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా భూమిలేని పేద వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు అందిస్తామన్నారు. వరి పండించే రైతులకు భరోసా కల్పించే విషయంలో సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో కేవలం 15 నుంచి 18 వేల రేషన్ కార్డులు మంజూరు చేసిందని, అది కూడా బై ఎలక్షన్ ఉన్న నియోజకవర్గంలో ఇచ్చిందన్నారు. జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణ, దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, సత్యశారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అధికారులు పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



పద్మశాలి భవనంలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మడికొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని పద్మశాలి భవన్‌లో పద్మశాలి పరపతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంఘం అధ్యక్షుడు కామని మల్లేష్, నాయకులు కోమాకుల సమ్మయ్య, బిల్ల లింగయ్య, నామని కుమారస్వామి, నల్ల ప్రభాకర్, నామని మోహన్‌రావు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ అందరి సమష్టి కృషితో సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం 60 ఏళ్ల పూర్తిచేసుకున్న సభ్యులను మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పొట్లబత్తిని లక్ష్మణ్, పోతరాజు ప్రకాష్, నామని సదానందం, మల్లేశం, సత్యనారాయణ, సారంగం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థిక లక్ష్యాలు సాధించాలి

▸▸ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



టెస్కాబ్ కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్మన్ రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల ప్రగతి లక్ష్యాలు సాధించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ పాలకవర్గ సమావేశం జరిగింది. బ్యాంకుల ఆర్థిక ప్రగతి లక్ష్యాలు, సేవలు, ఐటీ రంగం, డిపాజిట్స్, పంట రుణాలు, రుణమాఫీ తదితర అంశాలను రవీందర్‌రావు సమీక్షించారు. సమావేశంలో టెస్కాబ్ వైస్‌చైర్మన్ కురుమ సత్తెయ్య, డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రమేశ్‌రెడ్డి, శ్రీనివాసులు, టెస్కాబ్ ఎండీ గోపీ ఐఏఎస్, నాబార్డ్ సీజీఎం ఉదయ్‌భాస్కర్, సీజీఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను త్వరగా పూర్తిచేయాలి

▸▸ టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ఇంటర్ లింకింగ్ వ్యవస్థను పటిష్ట పరుచుకోవాలని అధికారులను టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తీసుకుంటున్న చర్యలపై సీఎండీ సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో సీఈలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఓవర్ లోడ్ అయ్యే ఆవకాశం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. జనవరి చివరి వరకు అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. కొత్త సబ్ స్టేషన్ పనుల పురోగతిపై ఆరా తీస్తూ త్వరతగిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సాంకేతికతను అందిపుచ్చుకుంటూ సబ్‌స్టేషన్‌ల్లోని లోపాలను ఎప్పటికప్పుడు సరిచేసుకోవాలన్నారు. ఈసమావేశంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీఈలు రాజు చౌహాన్, బికంసింగ్, జియంలు నాగప్రసాద్, గౌతమ్‌రెడ్డి, శ్రీనువాస్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు జిల్లా విద్యార్థులు



సైన్స్ ఫెయిర్‌కు తరలివెళుతున్న విద్యార్థులతో డీఈవో వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు జిల్లా విద్యార్థులు సోమవారం బయలుదేరి వెళ్లారు. 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సెజ్‌లోని ఎస్వీకేఎం పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు హనుమకొండలోని లష్కర్ బజార్ పాఠశాల ప్రాంగణం నుంచి బయలుదేరి వెళ్లారు. వివిధ స్కూళ్ల నుంచి వెళుతున్న విద్యార్థులను డీఈవో వాసంతి దగ్గరుండి పంపించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నెహ్రూ నాయక్, డీఎస్‌వో శ్రీనివాసస్వామి, ఉపాధ్యాయులు సంధ్యారాణి, దయాకర్, సంపతి, రామనాథం, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక



సుధాకర్, సాయికుమార్

హసన్‌పర్తి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా మారం సుధాకర్, ఉపాధ్యక్షుడిగా కాలువ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వేల్పుల సాయికుమార్,కోశాధికారిగా మారం సదానందం, మర్రి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మారం రమేష్, కమిటీ సభ్యులుగా దాడి రణధీర్, వేల్పుల చక్రి, కాలువ సాయిక్రిష్ణ, కాలువ మల్లయ్య, మారం రాకేష్, వేల్పుల అంజయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▸▸ ఎస్ఈకి వినతిపత్రం అందించిన బల్దియా కార్మికులు



బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్రకు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ఫిల్టర్ బెడ్లతో పాటు ఇతర విభాగాలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ బహుజన మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం, బల్దియా ఔట్‌సోర్సింగ్ జాక్ నాయకులు బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్రను కలిసి వినతి పత్రం సమర్పించారు. శానిటేషన్ కార్మికులకు పెంచి వేతనంలో జమ చేస్తున్న రూ. 1000 తమకు కూడా అందించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా మృతి చెందిన కార్మికులకు దహన సంస్కారాల కోసం అందిస్తున్న రూ.10వేలను రూ.30వేలకు పెంచాని వెల్లడించారు. ఎస్ఈని కలిసిన వారిలో టీబీఎంయూ ఉమ్మడి వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుద్దాల కుమార్, ఔట్‌సోర్సింగ్ జాక్ అధ్యక్షుడు కొత్తకొండ శ్రీనివాస్, కార్యదర్శి నందిపాటి శ్రీనివాస్, కె.రవి, ఎంకేబాబు, సాయి పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన ఎస్ఎఫ్ఐ నేతలు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో ఎస్ఎఫ్ఐ నాయకులు కళ్యాణ్, జశ్వంత్, వికాస్, ప్రశాంత్‌లు ఉన్నారు.

కూడళ్ల విస్తరణ హుళక్కేనా..?

▸▸ ప్రమాదాలు జరుగుతున్నా పట్టింపేదీ

▸▸ ఇసుక ట్రాక్టర్లతో ఇబ్బందులెన్నో..

▸▸ విస్తరించాలని ప్రజల వేడుకోలు





వడ్డెపల్లిలో విస్తరణకు నోచుకోని చర్చి జంక్షన్, కూడలిలో ట్రాక్టర్ ఢీకొట్టడంతో గాయపడిన పశువు (ఫైల్)

వడ్డెపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లను విస్తరించక పోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే కూడళ్ల విస్తరణ జరుగక వాహనదారులు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా భారీ లోడ్‌తో వెళ్లే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాల బారిన ప్రజలు పడుతున్నా బల్దియా అధికారులు కూడళ్ల విస్తరణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

హనుమకొండ పట్టణంలోని వడ్డెపల్లి చర్చి జంక్షన్, గోకుల్ జంక్షన్, జవహర్‌కాలనీ జంక్షన్ ప్రాంతాల్లోని కూడళ్లు ఇరుకుగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ జంక్షన్ల విస్తరణ చేపట్టక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు వాపోతున్నారు.

ఇసుక ట్రాక్టర్లతో ఇక్కట్లు..

వడ్డెపల్లి చర్చి జంక్షన్ ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్లను నిలపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇసుక ట్రాక్టర్లను రేయింబవళ్లు రోడ్లపైనే పార్కింగ్ చేయడం వల్ల పాదాచారులతో పాటు ద్విచక్ర వాహనదారులు, వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా ఇసుక ట్రాక్టర్లు రోడ్లపై పార్కింగ్ చేయడం మూలంగానే వడ్డెపల్లి జంక్షన్ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ట్రాక్టర్ ఢీకొని ఓ ఇంటి గోడతో పాటు రోడ్డుపై వెళ్తున్న పశువు సైతం గాయాలైన ఘటన చోటుచేసుకుంది. ఇదే ప్రాంతంలో లేబర్ అడ్డా సైతం ఉండడం వల్ల నిత్యం రద్దీగా ఉంటుంది. ఉనికిచర్ల, ధర్మసాగర్, సుబ్బయ్యపల్లి, దేవన్నపేటతో పాటు శివారులోని వివిధ తండాల నుంచి నిత్యం ఇసుక ట్రాక్టర్లు, మొరం, మట్టి, రాయి ట్రాక్టర్లు, టిప్పర్లు వడ్డెపల్లి చర్చి జంక్షన్ మీదు గా హనుమకొండ పట్టణానికి చేరుతుంటాయి. వీటితో పాటు వడ్డెపల్లి చర్చి జంక్షన్ ప్రాంతం ఇరుకుగా ఉండడం వివిధ దుకాణ సముదాయాలు ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. జంక్షన్‌ను విస్తరించి ప్రమాదాలను అరికట్టాలని, ఇసుక ట్రాక్టర్లను రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చూడాలని వడ్డెపల్లి ప్రజలు జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, మునిసిపల్ కమిషన ర్‌ను కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లను రోడ్డుపై నిలపొద్దు

తాళ్లపెల్లి విజయ్, వడ్డెపల్లి



వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో రోడ్డుపై ఇసుక ట్రాక్టర్లను పార్కింగ్ చేయకుండా చూడాలి. కూడలి విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలి. అలాగే ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి.

సీఎం దిష్టిబొమ్మ దహనం.. అడ్డుకున్న పోలీసులు

కాజీపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశాడని ఆరోపిస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు కాజీపేట రహ్మత్‌నగర్‌లో సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్నారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి స్వంతపూచీకత్తుపై వదిలిపెట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగ్‌రావు, నాయకులు ఎండీ.అఫ్జల్, గబ్బెట శ్రీనివాస్, బరిగెల వినయ్, కొండ్ర శంకర్, ఎండీ.హుస్సేన్ పాల్గొన్నారు.

వృద్ధురాలి మృతి



సోనా మృతదేహం

కాజీపేట, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందింది. కాజీపే ట ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరా ల ప్రకారం.. నెక్కొండకు చెందిన దరావత్ సోనా(70) గత నెల 8న నిట్ వద్ద అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికుల సమాచారంతో ఎంజీఎంలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్‌స్టేషన్ 8712685008కు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

ఫార్మసీలో స్వర్ణలతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం పరిశోధకురాలు కత్తెరశాల స్వర్ణలత డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు సోమవారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ స్వర్ణలతకు డాక్టరేట్ ప్రకటించారు 'డిజైన్ సింథసిస్ ఆఫ్ న్యూ హెటొరోసైక్లిక్ కాంపౌండ్స్ ఆఫ్ యాంటీ క్యాన్సర్ యాక్టివిటీ' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను స్వర్ణలత డాక్టరేట్ పొందారు. కేయూ ఫార్మసీ విభాగం ప్రొఫెసర్, కేయూ ఫార్మసీ డీన్ గాదె సమ్మయ్య పర్యవేక్షణలో స్వర్ణలత పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరి చెందిన స్వర్ణలత అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో విలువైన 8 పరిశోధన పత్రాలను ప్రచురించారు.

బీసీ విద్యార్థుల శంఖారావం సభను జయప్రదం చేయాలి

▸▸ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడ్



అంబేద్కర్ విగ్రహం వద్ద శంఖారావం సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థి నేతలు

వడ్డెపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ఈనెల 8న నిర్వహించే బీసీ విద్యార్థుల శంఖారావం సభను జయప్రదం చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరేగంటి నాగరాజు గౌడ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ విద్యార్థుల శంఖారావం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినప్పటికీ నాలుగుసంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ.7,500 కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, బీసీ విద్యార్థులకు రూ.10వేల ర్యాంక్‌కు నిబంధనలను ఎత్తివేసి ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మాదిరిగా మొత్తం ఫీజు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్‌రాజ్, ఉపాధ్యక్షులు గణేష్, ప్రచార కార్యదర్శి వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులు శ్రీసాయి, సురేష్, గణేష్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా

▸▸ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మల్లికుదుర్లలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వేలేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం వేలేరు మండలంలోని మల్లికుదుర్లలో గ్రామ పంచాయతీ నూతన భవనానికి, పలు సీసీరోడ్ల నిర్మాణానికి, మద్దెలగూడెంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి, మండల కేంద్రంలో సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు, మల్లన్న గండికి వెళ్లే పైపులైన్ ద్వారా మండలంలోని అన్ని గ్రామాలకు వచ్చే వర్షాకాలం వరకు సాగునీరు అందేవిధంగా ఏర్పాట్లు చేయిస్తానన్నారు. అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోమి, డీఈ శిరీషా, ఏఈ రూపావతి, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఎంపీవో విమల, కార్యదర్శి వెంకటేష్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మల్లికుదుర్ల గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, మాజీ కుడా డైరెక్టర్ బిల్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి బార్ నివాళి

వరంగల్ లీగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ న్యాయవాది గూబల సారయ్య మృతికి వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్లు సంతాపం వ్యక్తం చేశాయి. అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో నివాళులర్పించారు. ఆర్టీసీలో సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేసి 2009 నుంచి జిల్లా కోర్టులో ప్రధానంగా లేబర్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం వంచనగిరి గ్రామానికి చెందిన సారయ్య న్యాయవాద వృత్తిలో ఎంతో నిబద్ధతతో న్యాయ వాదులకు ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లాది రమేష్, ఉపాధ్యక్షుడు సుదర్శన్, స్పోర్ట్స్ సెక్రటరి వెంకటరమణ, సీనియర్ న్యాయవాదులు సహోదర్‌రెడ్డి, అంబరీష్‌రావు, బత్తిని రమేష్‌గౌడ్, మంగినపెల్లి సదాశివుడు, బొమ్మకంటి కోటేశ్వర్, చిల్లా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. అంతకుముందు వరంగల్ జిల్లా జడ్జి కోర్టులో సంతాప కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్.రమేష్ బాబు, అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

కేంద్ర సంఘం డైరీ ఆవిష్కరణకు వెళ్లిన టీఎన్జీవోస్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు లలిత కళాతోరణం పబ్లిక్ గార్డెన్‌లో సోమవారం జరిగిన కేంద్ర సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి సోమవారం హనుమకొండ కలెక్టరేట్ నుంచి రెండు బస్సులలో టీఎన్‌జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు తరలివెళ్లారు. ఈ బస్సులను యూనియన్ అధ్యక్షులు ఆకుల రాజేందర్ జెండా ఊపి ప్రారంభించారు. డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి వెళ్లిన వారిలో టీఎన్‌జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు, జిల్లా సంఘం నేతలతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు.

ఎంపీ కడియం కావ్యను కలిసిన టీఎన్జీవోలు

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను టీఎన్‌జీఓస్ జిల్లా నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నిక

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం శ్యామల గార్డెన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్పీడీసీఎల్ కంపెనీ గౌరవాధ్యక్షుడిగా భూక్య వాలు నాయక్, అధ్యక్షుడిగా హర్షీ, కార్యదర్శిగా అజ్మీరా శ్రీరాం నాయక్ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా కార్యదర్శి శ్రీరాంనాయక్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదో సారి ఎన్నుకున్నందుకు ప్రతీ ఒక్క గిరిజన ఉద్యోగికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ సదర్‌లాల్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రాంజీనాయక్, అసోసియేట్ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, నెహ్రూ నాయక్, ఫకీర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హిస్టరీ స్కాలర్ ఇటికాల వసంత పరిశోధన గ్రంథావిష్కరణ

కేయూ క్యాంపస్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు సోషల్ వెల్ఫేర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ లెక్చరర్, కాకతీయ విశ్వవిద్యాలయం చరిత్ర, టూరిజం విభాగం పరిశోధకురాలు ఇటికాల వసంత ప్రచురించిన 'డివోషన్ అండ్ డేడికేషన్ ది మాతంగి కల్ట్ ఇన్ తెలుగు రీజియన్ 'అనే పరిశోధన గ్రంథాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాలోని గూడూరులో జరిగిన 47వ హిస్టరీ కాంగ్రెస్ సదస్సు కేయూ సోషల్ సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పుస్తకాన్ని ఒంగోలులోని శర్మ కళాశాల హిస్టరీ విభాగం రీడర్ డాక్టర్ కొండా శ్రీనివాసులు మొదటి కాపీని అందుకోగా, పాండిచ్చేరి యూనివర్సిటీ హిస్టరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.రామచంద్రారెడ్డి సమీక్షించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నల్లగుంటకు చెందిన ఇటికాల వసంత తెలుగు ప్రాంతాల్లో మాతంగి సంప్రదాయాలు, పూజ విధానాన్ని సమగ్రంగా పరిశోధించారు.



పరిశోధన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డీన్ మనోహర్, తదితరులు

మంత్రి పొంగులేటిని కలిసిన మేయర్



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వరంగల్ పర్యటన సందర్భంగా హనుమకొండ హైగ్రీవచారీ మైదానంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సుల ప్రారంభ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మంత్రిని కలిశారు. మంత్రి పొంగులేటిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల గుర్తించి మంత్రికి మేయర్ వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్‌ను ఆదేశించారు.

బుక్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

హనుమకొండ కలెక్టరేట్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న టూరిస్ట్ ప్రదేశాలు, కల్చరల్ ఆస్పెక్ట్స్, హెరిటేజ్ హిస్టరీని కలుపుకుని పబ్లిష్ చేసిన వరంగల్ రీజియన్ కాఫీ టేబుల్ బుక్‌ను సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఇంచార్జీ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పథకాలు అమలు చేయాలి

• రజక సంఘం రాష్ట్ర నేత బండి సదానందం

వడ్డెపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన రజకులకు ప్రత్యేక పథకాలు రూపొందించి, అమలు చేయాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలో ఆయన మాట్లాడుతూ రజకులకు దోబీ అని పిలువకూడదని చాకలి, రజక పేరుతోనే పిలవాలని రాష్ట్ర బీసీకమిషన్‌కు విజ్ఞప్తిచేశారు. తమను బీసీ(ఏ) గ్రూప్ నుంచి తొలగించేందుకే కొందరు దోబీ అనే పర్యాయ పదంతో పిలువడం సమంజసం కాదని సదానందం పేర్కొన్నారు. బీసీ(ఏ) కులాలకు 12శాతం రిజర్వేషన్‌కల్పించాలని ప్రభుత్వానికివిజ్ఞప్తి చేశారు.

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

▸▸ బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కాళీప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కాళీప్రసాద్

రాంనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారం చేపట్టిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ ఆరోపించారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో కాళీప్రసాద్ మాట్లాడుతూ కులగణన పేరుతో ఉన్నవి కట్‌చేస్తూ కాలయాపన చేస్తోందన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాలని లేదంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పూర్ణచారి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి సభలో కాంగ్రెస్ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలన్నారు. బీసీ డిక్లరేషన్‌పై నేడు, రేపు తహసీల్దార్, జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఓబీసీ నాయకులు ఎర్రగొల్ల శ్రీనువాస్, జిల్లా నాయకులు కత్తుల అనిల్, ఉప్పు రాజు, మల్లిఖార్జున్, సులోచన, సతీష్, సువర్ణలత, కీర్తి సురేశ్, రవి, నవజీవన్, అభిషేక్, మధు తదితరులు పాల్గొన్నారు.

పోషకం

జాజి కాయతో...

విత్తనమైన జాజికాయతో పాటు దాని పైపొర జాపత్రిని కూడా వంటకాల్లో ఉపయోగిస్తూ ఉంటాం. అయితే రుచి పెంచడం కోసం ఉపయోగించే ఈ సుగంధద్రవ్యంలో ఆరోగ్య ప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయి. అవేంటో తెలుసుకుందాం!

జాజికాయ, క్యాన్సర్‌తో పాటు, క్షీణింపజేసే వ్యాధులు, గుండెజబ్బులను అరికడుతుంది. దీన్లోని శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, ఫ్రీ రాడికల్స్‌తో కణాలు దెబ్బతినకుండా రక్షణ కల్పిస్తాయి. జాజికాయలో ఉండే సయానిడిన్స్ అనే యాంటీఆక్సిడెంట్స్‌తో పాటు, ఫినైల్‌ప్రోపనాయిడ్స్, టర్పీన్స్ అనే ఎసెన్షియల్ ఆయిల్స్, ఫినోలిక్ సమ్మేళనాలు... ఫ్రీ ర్యాడికల్స్‌ను నిలువరించి, కణ నాశనాన్ని నివారిస్తాయి. అలాగు జాజికాయ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలను కూడా కలిగి ఉంటుంది. దీన్లోని మోనోటర్పీన్స్, సాబీనిన్, టర్పినాల్, సయానిడీన్స్ లాంటి ఫినోలిక్ సమ్మేళనాలు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి.

దుష్ప్రభావాలు ఉన్నాయి

గర్భవిచ్ఛిత్తి కారకాలు కలిగి ఉండే జాజికాయకు గర్భిణులు దూరంగా ఉండడమే మేలు. బేక్ చేసే వీలున్న పదార్థాలతో పాటు తీపి వంటకాలలో జాజికాయను విరివిగా వాడుతూ ఉంటారు. అయితే జాజికాయతో ఆరోగ్య ప్రయోజనాలను పొందాలంటే, దాన్ని పరిమితంగానే వాడుకోవాలి. ఒకసారికి ఒక కిలో శరీర బరువుకు ఒకటి నుంచి రెండు మిల్లీగ్రాముల జాజికాయను వాడుకోవచ్చు. ఐదు గ్రాములకు మించితే విషపూరిత ప్రభావాలకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది.



తెలుసుకుందాం

మందుల వాడకం ఇలా...

సాధారణంగా మాత్రలు మింగడానికి నీళ్లనే ఆశ్రయిస్తూ ఉంటాం. కానీ కొందరు పండ్లరసం, పాలతో మందులు మింగుతూ ఉంటారు. కానీ నిజానికి మందులను కొన్ని పదార్థాలతో జోడించి తీసుకోకూడదు. అవేంటంటే..

ఔషధాలను కొన్ని పదార్థాలతో జోడించినప్పుడు, వాటి ప్రభావాలు పెరగవచ్చు లేదా తగ్గిపోవచ్చు. అరుదుగా ఊహించని దుష్ప్రభావాలకు దారి తీయవచ్చు. కాబట్టి ఔషధాలతో కలపకూడని ఘన, ద్రవ పదార్థాల గురించి తెలుసుకుందాం!



- **ద్రాక్ష రసం:** ఔషధాలతో జోడించకూడని ద్రవ పదార్థమిది. ద్రాక్షరసం దాదాపు అన్ని మందులతో ప్రతికూలంగా ప్రతిస్పందిస్తుంది. అలాగే ద్రాక్షరసం శరీరం ఔషధాన్ని శోషించుకునే తీరును కూడా ప్రభావితం చేస్తుంది. ద్రాక్షరసం, స్టాటిన్స్ (రక్తంలో కొవ్వును కరిగించే మందులు), క్యాల్షియం ఛానల్ బ్లాకర్స్ (గుండె జబ్బు మందులు)... ఈ మూడు ప్రమాదకరమైన సమ్మేళనం. ఇవి గుండె వేగాన్ని, రక్తపోటును ప్రభావితం చేస్తాయి.
- **బ్రొకోలి, పాలకూర:** రక్తపు గడ్డలను అరికట్టే కొన్ని మందులను, విటమిన్ కె ఎక్కువగా కలిగి ఉండే బ్రొకోలి, పాలకూరలతో కలిపి తీసుకోకూడదు. ఇలా తీసుకోవడం వల్ల తీసుకునే మందుల ప్రభావం తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది.
- **అరటిపండు, రెడ్ వైన్:** మానసిక కుంగుబాటుకు మందులు వాడుకునేవారు, అరటిపండు, రెడ్ వైన్ తీసుకోవడం వల్ల వారిలో రక్తపోటు విపరీతంగా పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది.
- **కాఫీ:** కాఫీ లేదా కెఫీన్ కలిగి ఉండే పానీయాలు బ్రోంకోడిలేటర్స్‌ను ప్రభావితం చేస్తాయి. కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేసి, తలతిరుగుడు, వాంతులు, తలనొప్పి లాంటి దుష్ప్రభావాలను కలిగిస్తాయి. కాబట్టి శ్వాసకోశ సమస్యలకు మందులు వాడుకునే వాళ్లు కాఫీని పరిమితం చేయాలి.

ముత్యాల ముగ్గు






ఎన్. భావన
హైదరాబాద్

21 చుక్కలు
5 వరుసలు
ఇటు అటు
వదిలి
5 వరకు

ఈ-మెయిల్:
features@andhrajyothy.com



కొత్త సంవత్సరంలో పాత రుగ్మతలతో అడుగు పెడుతున్నారా? మధుమేహం లాంటి ఆరోగ్య సమస్యలు వెన్నంటే ఉంటాయి కాబట్టి, ఈ రుగ్మతను అదుపులో పెట్టుకుంటూ, కొత్త ఏడాదిని ఆరోగ్యకరంగా ఎలా కొనసాగించాలో తెలుసుకుందాం!

ఇన్సులిన్ పంప్స్

టైప్1 మధుమేహులు, ఏళ్ల తరబడి మధుమేహంతో బాధపడుతూ, నోటి మాత్రలు పని చేయని వారికీ ఇన్సులిన్ ఇవ్వవలసి వస్తుంది. ఈ కోవకు చెందిన వాళ్లు రోజులో మూడు నుంచి నాలుగు సార్లు ఇన్సులిన్ తీసుకోవలసి వస్తుంది. ఇలా ఇన్సులిన్ తీసుకోవడంలో ఇబ్బంది ఎదుర్కొనేవారి కోసం కొత్తగా ఇన్సులిన్ పంప్స్ అందుబాటులో కొచ్చాయి. శరీరంలో పొట్ట దగ్గర అమర్చుకునే ఈ పరికరం రక్తంలోని చక్కెరలను పరిశీలిస్తూ, తగిన మోతాదులో ఇన్సులిన్‌ను విడుదల చేస్తూ ఉంటుంది.

మధుమేహం

ముదురు పాకాన పడకుండా...

మధుమేహంలో ముందస్తు లక్షణాలేవీ కనిపించవు. కాబట్టి సాధారణ ఆరోగ్య పరీక్షల్లో మధుమేహం లేదా మధుమేహం ముందరి దశ బయటపడుతూ ఉంటాయి. అయితే మధుమేహం లేనప్పుడు, దాని ఫలితంగా ఎటువంటి ఆరోగ్య సమస్యలూ తలెత్తనప్పుడు, ముందుగానే జాగ్రత్తలు ఎందుకు పాటించాలి? అని ప్రశ్నించేవారూ ఉంటారు. కానీ ప్రి డయాబెటిక్, కచ్చితంగా డయాబెటిక్‌కు దారి తీస్తుంది. అయితే మధుమేహ ముందరి దశ, మధుమేహానికి దారి తీసే పరిస్థితిని వాయిదా వేయడానికి ముందస్తు జాగ్రత్తలు ఎంతో బాగా దోహదపడతాయి. మధుమేహులు ఎలాంటి ఆహార, ఆరోగ్య, వ్యాయామ నియమాలు పాటిస్తున్నారో అవే నియమాలను ప్రిడయాబెటిక్స్ కూడా అనుసరించడం మొదలుపెట్టాలి. అలాగే మధుమేహుల మాదిరిగానే 3 నుంచి 6 నెలలకోసారి మధుమేహాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి. ప్రిడయాబెటిక్స్, డయాబెటిక్స్‌లా మందులు వాడుకోవలసిన అవసరం లేకపోవడం మినహా మిగతా నియమాలన్నీ తూచతప్పకుండా పాటించాలి.

లక్షణాలు కొందర్లోనే...

మధుమేహులు అందర్లో లక్షణాలు కనిపించాలనే నియమమేమీ లేదు. వంద మంది మధుమేహుల్లో కేవలం ఇరవై మందికే మధుమేహ లక్షణాలు బయల్పడతాయి. కాబట్టి మధుమేహాన్ని ముందస్తుగానే గుర్తించాలంటే 40 ఏళ్ల నుంచి ప్రతి ఏడాదీ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబ చరిత్రలో మధుమేహం ఉన్న వాళ్లు 35 ఏళ్ల నుంచే, వార్షిక పరీక్షలు చేయించుకోవడం మొదలుపెట్టాలి. టైప్1 మధుమేహం సాధారణంగా 15 ఏళ్ల లోపు పిల్లల్లో కనిపిస్తూ ఉంటుంది. క్లోమంలో ఇన్సులిన్ ఏమాత్రం తయారు కాని పరిస్థితి ఇది. బరువు తగ్గడం, కడుపు నొప్పి, వాంతులతో వైద్యులను సంప్రతించి, పరీక్షలు చేయించుకున్నప్పుడు, ఈ మధుమేహం బయల్పడుతూ ఉంటుంది. వీళ్లకు నోటి మాత్రలు పని చేయవు. కాబట్టి ఇన్సులిన్ ఇవ్వవలసి వస్తుంది. టైప్2 మధుమేహుల్లో కేవలం 20 శాతం మందిలోనే ఆకలి పెరగడం, అతి మూత్రం, దాహం పెరగడం లాంటి లక్షణాలతో వ్యాధి బయల్పడుతూ ఉంటుంది. మిగతా 80 శాతం మందికీ ఆరోగ్య ఏపరీక్షల ద్వారా సమస్య బయల్పడుతూ ఉంటుంది. వీళ్లలో హెచ్‌బిఎ1సి 6.4 కంటే ఎక్కువ ఉన్నప్పుడు, మందులు మొదలుపెట్టుకుంటూ, ఆహార, వ్యాయామ నియమాలు పాటించాలి.



పరీక్షలు క్రమం తప్పకుండా...

మధుమేహ మాత్రలు వాడుకోవడం ముఖ్యమే అయినా ఆహార నియమాలు పాటించడం, వ్యాయామం చేయడం, ఒత్తిడి తగ్గించుకోవడం లాంటి అంశాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మందుల్లో కూడా దాదాపు 7 రకాలుంటాయి. ఆహారపుటలవాట్లు, బరువు, దైనందిన జీవితం ఆధారంగా వైద్యులు నిర్దిష్ట మందులను సూచిస్తూ ఉంటారు. అయితే కొత్తగా మందులు మొదలుపెట్టినవాళ్లు వైద్యుల సూచించినంత కాలం అవే మందులు వాడుకుంటూ, మధుమేహ పరీక్షలు చేయించుకుంటూ ఉంటే సరిపోతుంది. కానీ ఐదు నుంచి పదేళ్లుగా మధుమేహంతో బాధపడుతున్నవాళ్లు, మధుమేహం హెచ్చుతగ్గులకు లోనవుతున్న వాళ్లు మందులు వాడుకుంటూనే, ప్రతి మూడు నెలలకూ మధుమేహాన్ని పరీక్షించుకుంటూ, ఏడాదికోసారి కొన్ని అదనపు పరీక్షలు కూడా చేయించుకుంటూ ఉండాలి. ఈ కోవకు చెందిన వాళ్లలో మధుమేహం ప్రభావంతో ఇతర ప్రధాన అంతర్గత అవయవాల మీద ప్రభావం పడుతుంది. కాబట్టి ఏడాదికోసారి కళ్లు, మూత్రపిండాలు, కాలేయం, గుండె పరీక్షలు కూడా చేయించుకుంటూ ఉండాలి.

సిజిఎమ్ తోడ్పాటుతో...

ఏళ్ల తరబడి ఆహార నియమాలను కచ్చితంగా పాటించలేక విసిగిపోయి, నచ్చినట్టు తినేసేవాళ్లలో, వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేసేవాళ్లలో, ఒత్తిడిని అదుపులో పెట్టుకోలేకపోయిన వాళ్లలో మధుమేహం హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటుంది. ఇలాంటి వ్యక్తుల కోసం తాజాగా సిజిఎమ్ (కంటిన్యూయస్ గ్లూకోజ్ మానిటరింగ్) అనే నానోచిప్ అందుబాటులోకొచ్చింది. 10 నుంచి పదేళ్ల పాటు పని చేసే ఈ నానోచిప్‌ను భుజానికి అంటించుకుని, సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకుని, చక్కెర మోతాదుల్లో హెచ్చుతగ్గులను పరీక్షించుకోవచ్చు. ఆ వివరాల ఆధారంగా చక్కెర పెరిగిన సమయాలు, కారణాలను గుర్తించి, చక్కెరను స్థిరీకరించే మందులను వైద్యులు సూచిస్తారు. చక్కెర హెచ్చుతగ్గులకు లోనయ్యే వారికీ, ఇన్సులిన్ తీసుకుంటున్న వాళ్లకూ సిజిఎమ్ ఎంతో బాగా అక్కరకొస్తుంది.



షిఫ్టుల్లో పని చేస్తున్నప్పుడు...

ప్రత్యేకించి రాత్రంతా మేలుకుని పని చేస్తూ, పగలు నిద్రపోయే ఉద్యోగులు మధుమేహం అదుపు తప్పకుండా ఉండడం కోసం కొన్ని ఆహార నియమాలు పాటించాలి. రాత్రి పనిలోకి దిగే ముందు, కడుపు నిండా భోంచేయొచ్చు. అయితే తెల్లవారిన తర్వాత, నిద్రకు ఉపక్రమించబోయే ముందు భారీ భోజనం చేయకూడదు. బదులుగా వీలైనంత తేలికపాటి అల్పాహారం మాత్రమే తీసుకోవాలి. ఉదయం నిద్రపోయే ముందు కడుపు నిండా తింటే, నిద్రపోయినంత సేపు, ఆరు నుంచి ఏడు గంటల పాటు రక్తంలో చక్కెర మోతాదులు అధికంగానే ఉండిపోతాయి. కాబట్టి పగటి షిఫ్టుల్లో పని చేసే వాళ్లైనా రాత్రి షిఫ్టుల్లో పని చేసేవాళ్లైనా నిద్రకు ముందు భారీ భోజనానికి బదులుగా అల్పాహారమే తీసుకోవాలి.

ఈ నియమాలు తప్పనిసరి

- **చక్కెర:** చక్కెరతో శరీరానికి అదనంగా ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా మనం తినే పిండిపదార్థాల్లో చక్కెర ఉంటుంది. కాబట్టి నేరుగా చక్కెర తీసుకోవలసిన అవసరం లేదు.
- **పిండిపదార్థాలు:** ప్రత్యేకించి నిద్రకు ముందు వీలైనంత తక్కువ పిండిపదార్థాలు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మరీ ముఖ్యంగా బియ్యం ఆధారిత పదార్థాలు మానేయాలి. అన్నానికి బదులుగా టిఫిన్ తింటున్నాం కాబట్టి ఫరవాలేదు అనుకునేవాళ్లూ ఉంటారు. కానీ ఇడ్లీ, దోశల్లాంటివి కూడా బియ్యంతోనే తయారవుతాయనే విషయాన్ని వాళ్లు గుర్తు పెట్టుకోవాలి. కాబట్టి రాత్రి భోజనంలో సాధ్యమైనంత తక్కువ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి. వీలైతే పిండిపదార్థాలను పూర్తిగా మానేయాలి.

కృత్రిమ చక్కెర ప్రమాదమే!

చక్కెరకు బదులుగా పలు రకాల కృత్రిమ చక్కెరలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. ఇవన్నీ సురక్షితమైనవేనని అనుకోకూడదు. కృత్రిమ స్వీటెనర్ల వల్ల పలురకాల దుష్ప్రభావాలున్నట్టు పలు అధ్యయనాలు నిరూపిస్తున్నాయి. వీటి వల్ల రక్తంలోని చక్కెరలు హెచ్చుతగ్గులకు లోనవడంతో పాటు థైరాయిడ్, క్లోమ క్యాన్సర్ల ముప్పు కూడా పొంచి ఉంటుంది. కాబట్టి కృత్రిమ చక్కెరలతో పాటు, షుగర్ ఫ్రీ స్వీట్లు, బెల్లం, తాటి బెల్లం, పటికలను కూడా తీసుకోకూడదు.

వ్యాయామం ఎంత?

మధుమేహులు వారంలో కనీసం వారంలో ఐదు రోజులు, 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. అయితే కొంతమందికి అంత సమయం కూడా దొరకకపోవచ్చు. అలాంటివాళ్లు రోజుకు కనీసం 20 నిమిషాలైనా వ్యాయామానికి కేటాయించాలి. అలాగే వ్యాయామం క్రమం తప్పకుండా చూసుకోవాలి. ఐదు రోజుల పాటు ఎలాంటి వ్యాయామం చేయకుండా శని, ఆదివారాల్లో గంట చొప్పున వ్యాయామం చేస్తే ఫలితం ఉండదు.

ఒకటికి రెండు మాత్రలు

'ఒకటికి రెండు మాత్రలు వేసుకుంటే సరిపోతుందిలే' అనే ఆలోచనతో తీపి తినేసేవాళ్లూ ఉంటారు. కానీ బిపి మాత్రలు, చక్కెర మాత్రలు వైద్యులు సూచించిన మోతాదు మించి వాడుకోకూడదు. తీపి తినడం వల్ల రక్తంలో చక్కెర పెరిగితే వెంటనే ముంచుకొచ్చే ముప్పేమీ ఉండదు. కానీ ఒక స్వీటు తిని ఒకటికి రెండు చక్కెర మాత్రలు వేసుకుంటే, రక్తంలో చక్కెర మోతాదు పడిపోయి, అత్యవసర వైద్య పరిస్థితికి దారితీసే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎప్పుడైనా స్వీటు తిన్నా, రక్తంలో చక్కెర పెరిగి, తర్వాత నెమ్మదిగా దానంతటదే తగ్గిపోతుంది. కాబట్టి కంగారు పడవలసిన అవసరం లేదు. అలాగని స్వీట్లు కూడా తరచూ తినకూడదు.

- **గ్లైసెమిక్ ఇండెక్స్:** అన్నానికి బదులుగా చపాతీలు, పుల్కాలు తినొచ్చు. అన్నంలో గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ. కానీ చపాతీలు, పుల్లాల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ కాబట్టి రక్తంలో చక్కెరలు పెరగకుండా ఉంటాయి.
- **పండ్లు:** మామిడి, ద్రాక్ష, సపోటా, అరటి, పైనాపిల్‌లు తినకపోవడమే మేలు. వీటికి బదులుగా బొప్పాయి, యాపిల్, జామ పండ్లు రోజూ తినొచ్చు. ఈ పండ్లను రోజుకొకటి చొప్పున తినొచ్చు. కానీ రసం తీసి తాగకూడదు. గ్లాసుడు రసం కోసం మూడు నాలుగు పండ్లు అవసరమవుతాయి. కాబట్టి నేరుగా పండునే తినాలి. అలాగే కాలానుగుణంగా దొరికే పండ్లను పూర్తిగా మానేయవలసిన అవసరం లేదు. వారానికి ఒకట్రెండు పండ్ల ముక్కలను తినడం వల్ల నష్టం ఉండదు.

డాక్టర్ సందీప్ ఘంటా
కన్సల్టెంట్ - డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్,
స్టార్ హాస్పిటల్,
నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్.





మీకు తెలుసా?

చలి వేధిస్తోందా?

చలి కాలం చలి వేధించడం సహజమే! అయితే కొందరు కాస్త చలిని కూడా తట్టుకోలేకపోతూ ఉంటారు. తాపమానాలు ఏ కాస్త తగ్గినా చలితో బాధపడుతూ ఉంటారు. ఈ స్వభావం వెనక కొన్ని ఆసక్తికరమైన కారణాలున్నాయి. అవేంటంటే...

- **ఐరన్ లోపం:** హిమోగ్లోబిన్ ఉత్పత్తికి అత్యంత ముఖ్యమైన ఖనిజలవణం ఐరన్. ఐరన్ లోపిస్తే, శరీరంలో కణజాలాలకు ఆక్సిజన్ సరఫరా జరగక, చేతులు, కాళ్లూ చల్లబడిపోతాయి.
- **థైరాయిడ్ సమస్యలు:** మందకొడిగా పని చేసే థైరాయిడ్ వల్ల శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం తగ్గుతుంది. శరీరంలో వేడి జనించడానికి తోడ్పడే మెటబాలిజం కుంటుపడడంతో చలి వేధిస్తుంది.
- **మధుమేహం, హైపర్‌టెన్షన్:** మధుమేహం వల్ల రక్త ప్రసరణ బలహీనపడి చేతులు, పాదాలకు రక్త ప్రసరణ మందగిస్తుంది. ఫలితంగా చల్లదనం బాధిస్తుంది.
- **విటమిన్ బి12 లోపం:** ఎర్ర రక్తకణాల ఉత్పత్తికీ, నాడుల పనితీరుకూ విటమిన్ బి12 కీలకం. ఈ పోషక లోపంతో, శరీరానికి అందే ఆక్సిజన్‌లో కొరత ఏర్పడి, నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. దాంతో చలి, నిస్సత్తువలు వేధిస్తాయి.
- **డీహైడ్రేషన్:** వాతావరణ తాపమానాల క్రమబద్ధీకరణలో నీళ్ల కీలక పాత్ర పోషిస్తాయి. డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు, శరీర తాపమానం నిర్వహణ క్రమం తప్పి, సాధారణంగా కంటే చలి ఎక్కువవవుతుంది. కాబట్టి సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి.

వ్యాయామం

చదునైన పొట్ట కోసం...

పొట్ట దగ్గర కొవ్వు అనారోగ్యానికి సూచన. కాబట్టి అక్కడి కొవ్వును కరిగించే వ్యాయామాల్లో ప్రత్యేకించి 'బ్యాలెన్సింగ్ ప్లాంక్'ను ఎంచుకోవాలి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే?

- మోకాళ్లు, అరచేతులు నేల మీద ఆనించి బొమ్మలో చూపించిన భంగిమలో ఉండాలి.
- రెండు అరచేతులు, పాదాలు మాత్రమే నేల మీద ఉండేలా శరీరాన్ని పైకి లేపాలి. ఇది 'ప్లాంక్'!



- తర్వాత కుడి చేయి, ఎడమ కాలు నేరుగా చాపి 30 అంకెలు లెక్క పెట్టాలి.
- ఈ భంగిమలో ఎడమ చేయి, కుడి కాలు మాత్రమే నేల మీద ఆనించి ఉంచి, వాటి మీదే శరీరం బరువును మోపాలి.
- తర్వాత ఎడమ చేయి, కుడి కాలును కూడా నేరుగా చాపి 30 అంకెలు లెక్కపెట్టి మామూలు స్థితికి రావాలి.
- ఇలా మార్చి మార్చి 5 సెట్లు చేయాలి.

కొత్త తల్లుల్లో కుంగుబాటు

కొత్తగా తల్లైన కొందరు మహిళల్లో, బిడ్డకు తల్లైన ఆనందం కంటే మానసిక కుంగుబాటు ఎక్కువైపోతుంది. బిడ్డ పోషణ పట్ల ఆసక్తి సన్నగిలి, అర్థం లేని భయాలు, అనుమానాలు ఆవరిస్తాయి. ఈ స్థితే... 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్'!

సాధారణ మహిళలతో పోలిస్తే, చిన్నప్పటి నుంచీ డిప్రెషన్‌కు లోనవుతున్నవారు, భర్త ప్రేమను పొందలేనివారు, గతంలో ప్రసవ సమయంలో మానసిక కుంగుబాటుకు లోనయినవాళ్లు, గర్భం దాల్చిన తొలినాళ్లలోనే డిప్రెషన్ బారిన పడుతూ ఉంటారు. వీరిలో గర్భం దాల్చామనే ఆనందం మచ్చుకైనా కనిపించదు. తీవ్రమైన భావోద్వేగాలను వ్యక్తపరుస్తూ ఉంటారు. కొందరికి ప్రసవం ముందువరకూ లేని కుంగుబాటు, ప్రసవం తర్వాతి ఏడు రోజులు తీవ్రంగా బాధిస్తుంది. ఆ సమయంలో పిల్లలను దగ్గరకు తీసుకోరు. పాలివ్వడానికి ఇష్టపడరు. ఆ ఏడు రోజులు దాటితే ఈ మహిళలు తిరిగి మామూలుగా మారిపోతారు. ఇంకొందరిలో ప్రసవమైన 4వ నెలలో పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ తీవ్రత పెరుగుతుంది. పిల్లల పెంపకం వారిలో ఒత్తిడిని పెంచుతుంది. ఈ పరిస్థితి తొలిసారి తల్లయిన మహిళల్లో ఎక్కువ.

వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి

మహిళలు నిరాశానిస్పృహలను వ్యక్తం చేయడానికి ఇష్టపడరు. కానీ ఇలాంటి భావనలను నిర్లక్ష్యం చేయకూడదు. దానంతట అదే తగ్గిపోతుందిలే! అనే నిర్లక్ష ధోరణీ తగదు. అకారణంగా, ఏమాత్రం వేదనగా ఉన్నా, ఊరికే ఏడుపొస్తున్నా, తిండి మీద ఆసక్తి తగ్గినా, నిద్ర పట్టకపోతున్నా వెంటనే గైనకాలజిస్టును కలిసి పరిస్థితి వివరించాలి. ఒకవేళ గతంలో డిప్రెషన్ బారిన పడి ఉంటే ఆ విషయాన్నీ వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి. ఏ మందులు వాడుతున్నదీ చెప్పాలి. ప్రసవం తర్వాత ఏడు రోజుల్లో ఇవే లక్షణాలు మొదటిసారి కనిపించినా అశ్రద్ధ చేయకూడదు. గతంలో ప్రసవానికి ముందుగానీ, తర్వాతగానీ ఈ లక్షణాలు ఎదుర్కొన్న మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఈ విషయాన్ని వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.



మానసికం

చికిత్సలున్నాయి!

ప్రసవం ముందైనా, తర్వాతైనా డిప్రెషన్ తాలూకు లక్షణాలు కనిపిస్తే మొదట కౌన్సెలింగ్ ఇవ్వవలసి ఉంటుంది. వారి వైద్య చరిత్ర ఆధారంగా డిప్రెషన్ గురించి లోతైన అవగాహన ఏర్పరుచుకుని, వైద్యులు తదనుగుణ చికిత్సను సూచిస్తారు. ప్రారంభంలో కౌన్సెలింగ్ ఉంటుంది. దీంతో చాలావరకూ కుంగుబాటు, పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌లు తగ్గుముఖం పడతాయి. ఒకవేళ అప్పటికీ తగ్గకపోతే యాంటీడిప్రెసెంట్లు ఇవ్వవలసి ఉంటుంది. వీటితో కూడా అదుపు కాకుండా సైకోటిక్ దశకు చేరుకుంటే ఆ సమస్యకు తగిన చికిత్స ఇవ్వవలసి ఉంటుంది. ఏదేమైనా గర్భిణుల్లో, బాలింతల్లో ఈ భావోద్వేగాలను అలక్ష్యం చేయకూడదు. లక్షణాలు కనిపించిన వెంటనే కుటుంబ సభ్యులే చొరవ తీసుకుని వైద్యుల దగ్గరకు తీసుకెళ్లాలి. కొందరికి కొన్ని నెలలపాటు చికిత్స చేస్తే డిప్రెషన్ పూర్తిగా పోతుంది. కొందరికి అరుదుగా జీవితాంతం మందులు వాడవలసిరావొచ్చు.

కలహాలతో పచ్చని కుటుంబం బుగ్గి

- సంసారంలో కలతలతో సాఫ్ట్‌వేర్ దంపతుల ఆత్మహత్య
- ఉరేసుకుని భార్య మృతి.. అది చూసి భర్త బలవన్మరణం
- అనాథలైన ముక్కుపచ్చలారని ఇద్దరు చిన్నారులు
- సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన


కీర్తి, సందీప్ (ఫైల్)

పటాన్‌చెరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే దంపతులు. ముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు సాఫీగా సాగాల్సిన సంసారంలో భార్యాభర్తల మధ్య గొడవలు నిత్యకృత్యంగా మారాయి. దాంతో విసిగి వేసారి భార్య ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా అది చూసి భర్త కూడా అదే రీతిలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో అభంశుభం తెలియని ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు అమీన్‌పూర్‌లో ఈ ఘటన జరిగింది. వరంగల్‌కు చెందిన సందీప్ (30) అదే జిల్లా పరకాలకు చెందిన కీర్తి (26)కి ఐదేళ్ల క్రితం వివాహం అయింది. వీరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ అమీన్‌పూర్‌లోని బంధకొమ్ము శ్రీధాంహిల్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి మూడు సంవత్సరాల పాప, 14 నెలల బాబు ఉన్నారు. కొంతకాలంగా సందీప్, కీర్తి మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం పాప పుట్టినరోజు విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం ఇద్దరు పిల్లలను మియాపూర్‌లో నివాసం ఉండే అత్తగారింట్లో దింపేందుకు సందీప్ వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చే సరికి హాల్‌లో కీర్తి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. ఏం చేయాలో పాలుపోక సందీప్ కూడా ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం ఇరుగు పొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఆసుపత్రికి తరలించారు. మనస్పర్థలతోనే దంపతుల ఆత్మహత్యకు పాల్పడ్డారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిని బలిగొన్న పొగమంచు!

- కాలినడక భక్తులపైకి దూసుకెళ్లిన '108'
- ఒకరి పరిస్థితి విషమం.. మరో నలుగురికి గాయాలు
- అదే అంబులెన్సులో ఆస్పత్రికి తరలింపు

చంద్రగిరి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నరసింగాపురం సమీపంలో సోమవారం తెల్లవారుజామున కాలినడకన వస్తున్న శ్రీవారి భక్తులపైకి 108 అంబులెన్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. పొగమంచు కారణంగా రహదారి సరిగా కనబడకపోవడంతో వాహనం వారిపైకి దూసుకెళ్లినట్లు పోలీసుల సమాచారం. పోలీసుల కథనం ప్రకారం.. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం చంపాలపల్లె, శేగంవారిపల్లెకు చెందిన సుమారు 60 మంది భక్తులు బృందంగా తిరుమలకు కాలినడకన బయలుదేరారు. మరోవైపు.. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన హరికృష్ణకు గుండెపోటు రావడంతో 108 అంబులెన్సులో తిరుపతికి తీసుకొస్తున్నారు. సోమవారం తెల్లవారు జామున 3.30 గంటలకు భక్తుల బృందం చంద్రగిరి మండలం నరసింగాపురం సమీపంలో నారాయణ కళాశాల వద్ద మదనపల్లె- తిరుపతి జాతీయ రహదారిపై నడిచి వస్తున్నారు. అదే సమయంలో మదనపల్లె నుంచి వస్తున్న 108 అంబులెన్సు వారిపైకి దూసుకెళ్లింది. ఏడుగురికి తీవ్రంగాయాలు కావడంతో అదే అంబులెన్సులో తిరుపతిలోని రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే పెద్దరెడ్డమ్మ(40), లక్ష్మమ్మ (50) మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తులసమ్మ(42), రమేష్, చిన్నరెడ్డమ్మ, రెడ్డమ్మ, యశోదమ్మ తీవ్ర గాయాలయ్యాయి. తులసమ్మ పరిస్థితి విషమంగా ఉంది. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారులో కూర్చుని.. నిప్పంటించుకొని..

(మొదటి పేజీ తరువాయి)


శ్రీరాం(ఫైల్)

పోసుకొని నిప్పంటించుకున్నారు. పెద్ద ఎత్తున చెలగరేగిన మంటల్లో కారు పూర్తిగా దగ్ధమవగా.. ఇద్దరూ సజీవదహనమయ్యారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. మృతులు యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీనగర్‌కు మండలం జమీలపేట్‌కు చెందిన 25 ఏళ్ల పర్వతం శ్రీరామ్, 17 ఏళ్ల బాలిక! కారు మంటల్లో చిక్కుకోవడాన్ని పోలీసులు తొలుత ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించారు. శ్రీరామ్, సూసైడ్ నోట్‌ను తన బంధువులకు వాట్సాప్ చేయడంతో ఆత్మహత్యగా నిర్ధారించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌కు పోచారం మునిసిపాలిటీ, నారపల్లిలో సైకిల్ షాపు ఉంది. ఆ దుకాణం పక్కనే ఉండే ఓ మైనర్ బాలికతో శ్రీరామ్‌కు పరిచయమైంది. ఐదేళ్లుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఆ బాలిక ఇంటర్ చదువుతోంది. అయితే బాలిక ప్రేమ విషయం ఆమె సమీప బంధువైన మక్తాకు చెందిన చింటుకు 15 రోజుల క్రితం తెలిసింది. అప్పటి నుంచి బాలికను చింటు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. తాను అడిగినన్ని డబ్బులు ఇవ్వాలని, లేదంటే ప్రేమ విషయం ఇంట్లో వాళ్లకు చెబుతానని బాలికను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె, శ్రీరామ్‌కు చెప్పడంతో అతడు చింటుకు రూ.1.35లక్షలు ఇచ్చాడు. అయితే మరిన్ని డబ్బులు కావాలంటూ కాలేజీకి వెళ్లి మరీ చింటు ఆమెను వేధింపులకు గురిచేయడం, శ్రీరామ్ దగ్గర ఇవ్వడానికి డబ్బులేమీ లేకపోవడంతో.. ప్రేమికులిద్దరూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. శ్రీరామ్ సోమవారం ఉదయం 10 గంటలకు బోడుప్పల్‌కు చెందిన తన స్నేహితుడు నవీన్ వద్ద ఎర్టిగా కారు (టీఎస్ 08 జేయు 1163)ను అడిగి తీసుకొని బాలికతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఘనాపూర్ వద్ద ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు సమీపంలో కారు ఆపాడు. లోపల ఇద్దరూ ఒంటికి నిప్పంటించుకున్నారు. కారులో పెద్దగా మంటలు చెలరేగి పేలుడు సంభవించింది. మంటలకు తాళలేక శ్రీరామ్ కారులోంచి బయటకొచ్చి ఫుట్‌పాత్‌పై పడిపోయి అక్కడిక్కడే మృతి చెందాడు. కారు డోర్ లాక్ కావడంతో బాలిక లోపలే సజీవదహనమైంది. కారు దగ్ధమవుతుండటాన్ని చూసిన వాహనదారులు, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకొని ఫైరింజన్ ద్వారా మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా చింటు బ్లాక్‌మెయిల్ కారణంగానే తాము ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు శ్రీరామ్ సూసైడ్ నోట్ రాసి బాలిక తల్లిదండ్రులకు, తన అన్న కుమారుడికి వాట్సప్‌లో పంపించాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదైంది.

జస్టిన్ ట్రూడో రాజీనామా!

నాయకత్వ ఎంపిక జరగ్గానే వైదొలుగుతా.. ప్రకటించిన కెనడా ప్రధాని ట్రూడో

- ధరాఘాతం, వలసలు.. విధాన నిర్ణయాలే కౌంట్‌డౌన్‌కు కారణం!
- ట్రంప్ విజయంతో చుట్టుకున్న చిక్కులు
- కెనడాపై టారిఫ్ పెంచుతానన్న ట్రంప్
- భారత్‌నూ తరచూ విమర్శిస్తున్న ట్రూడో
- నిజ్జర్ విషయంలో భారత్‌పై ఆరోపణలు



ఒటావా, జనవరి 6: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సోమవారం కీలక ప్రకటన చేశారు. లిబరల్ పార్టీ నాయకత్వానికి, ప్రధాని పదవికి రాజీనామా చేయనున్నట్లు వెల్లడించారు. తదుపరి ప్రధాని, పార్టీ అధినేతను ఎన్నుకునే వరకు తాను కొనసాగుతానని స్పష్టం చేశారు. అంతేకాదు.. సర్వేలన్నీ ప్రతికూలంగా ఉండడంతో.. ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ తాను ప్రధాని అభ్యర్థిగా ఉండబోనని పరోక్షంగా చెప్పారు. భారత ఏజెన్సీలపై ఆరోపణలు గుప్పిస్తూ.. ఇరు దేశాల మధ్య దూరాన్ని పెంచేలా ప్రకటనలు చేసిన ట్రూడో.. ఆ తర్వాత క్రమంగా ప్రజాదరణ కోల్పోతూ వస్తున్నారని సొంత పార్టీ నేతలే విమర్శలు చేశారు. అమెరికాలో ట్రంప్ విజయం సాధించాక.. కెనడాపై ఆంక్షలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ట్రూడో తప్పుకోవాలంటూ కొంతకాలంగా సొంత పార్టీ నేతలే డిమాండ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రూడో ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. కొత్త నాయకత్వం ఎన్నిక జరగ్గానే.. ప్రధాని పదవి, పార్టీ బాధ్యతల నుంచి వైదొలగుతానని ట్రూడో స్పష్టం చేశారు. "నా రాజీనామా విషయాన్ని గవర్నర్ జనరల్‌కు, పార్టీకి తెలియజేశాను. ఈ ప్రక్రియ కొనసాగేందుకు గాను మార్చి 24 వరకు పార్లమెంట్‌ను ప్రొరోగ్ చేస్తున్నా" అని ప్రకటించారు. కెనడా చట్టాల ప్రకారం అధికార పార్టీ నేత రాజీనామా చేసిన 90 రోజుల్లో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవాలి. కెనడా ఉప ప్రధాని, ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్ ఇటీవల రాజీనామా చేసిన విషయం తెలిసిందే.! ట్రూడో క్యాబినెట్‌లో ఆమె అత్యంత శక్తిమంతురాలిగా గుర్తింపు పొందారు. ట్రూడో ప్రజాదరణ కోల్పోతున్నారంటూ ఆమె ఆరోపణలు చేశారు. సొంత పార్టీ నుంచి ఒత్తిళ్లు, రాజకీయ అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా చేయాలని ట్రూడో నిర్ణయించినట్లు తెలుస్తోంది.

కౌంట్‌డౌన్‌కు కారణాలివే..!

- ఆహార ధరల పెరుగుదల, రియల్‌ఎస్టేట్ ధరాఘాతం, పెరిగిపోతున్న వలసల కారణంగా ట్రూడోపై ప్రజల్లో ఆదరణ తగ్గడం మొదలైంది
- ఈ కారణాలతోనే ఇటీవల టోరంటో, మాంట్రియల్ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓటమిపాలైంది
- ట్రూడో విధానాలను డొనాల్డ్ ట్రంప్ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.! ఇటీవల ట్రంప్ విజయం సాధించగానే, కెనడా నుంచి చేసుకునే దిగుమతులపై 25% టారిఫ్ వేస్తానని ఆయన ప్రకటించారు. సహజవాయువులు, ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్ ఎగుమతుల్లో కెనడాకు అమెరికానే అతిపెద్ద వినియోగదారు కావడంతో, ట్రంప్ ప్రకటన ఆర్థికంగా కెనడాకు శరాఘాతంగా మారుతుంది
- మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్ విషయంలోనూ ట్రూడో దుందుడుకుతనం ఆయనకు ఆదరణ కోల్పోయేలా చేసిందనే అభిప్రాయాలున్నాయి. కెనడాలో తలదాచుకుంటున్న ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యకు భారత ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. నిజ్జర్‌ను ఉగ్రవాదిగా భారత జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రకటించడాన్ని అప్పట్లో ఆయన తప్పుబట్టారు. వలస విధానాల్లో మార్పులతో కెనడాలో ఉంటున్న ప్రవాస భారతీయులను ఇబ్బంది పెట్టేలా నిర్ణయాలు తీసుకున్నారు
- అక్టోబరులో జరగనున్న ఎన్నికల్లో.. లిబరల్ పార్టీ ప్రజాదరణ 47% నుంచి 21శాతానికి పడిపోయినట్లు.. కన్జర్వేటివ్ పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు సర్వేలు వచ్చాయి

ముగియనున్న ట్రూడో శకం!

వచ్చే ఎన్నికల్లో తాను ఎలాంటి బాధ్యతలు తీసుకోనని, ప్రధానిగా తాను అర్హుడిని కాదని పరోక్షంగా చెప్పారు. కెనడా చరిత్రలో ఏ పార్టీ కూడా వరుసగా నాలుగు సార్లు గెలిచిన దాఖలాలు లేవు. దీంతో.. నాలుగోసారి పార్టీని విజయం తీరాలకు తాను చేర్చలేనని ట్రూడో అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో.. ట్రూడో శకం దాదాపుగా ముగిసినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు. జస్టిన్ ట్రూడో తండ్రి పీరె ట్రూడో 1968-79, 1989-84 మధ్యకాలంలో సుదీర్ఘంగా ప్రధానిగా సేవలందించారు. ట్రూడో మాత్రం మొదట్లో రాజకీయాల వైపు మొగ్గుచూపకుండా.. టీచర్‌గా, నైట్‌క్లబ్ బౌన్సర్‌గా, స్నోబోర్డ్ ఇన్‌స్ట్రక్టర్‌గా, టీవీ హోస్ట్‌గా పనిచేశారు. 2015 ఎన్నికల్లో మాత్రం ప్రధాని అభ్యర్థిగా ముందుండి పార్టీని గెలిపించారు.

వెదురుతోనూ విద్యుత్తు!

- షోలాపూర్ ఎన్టీపీసీ థర్మల్ కేంద్రంలో బొగ్గుతో కలిపి మండించాలని నిర్ణయం
- దేశంలోనే తొలిసారి బయోమాస్ ఆధారిత విద్యుదుత్పత్తి
- వెదురు సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు

ముంబై, జనవరి 6: స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిలో భాగంగా దేశంలోనే తొలిసారి 'జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థ (ఎన్‌టీపీసీ)' కీలక నిర్ణయం తీసుకుంది. విద్యుదుత్పత్తి కోసం బొగ్గుతో పాటు వెదురును కూడా కలిపి మండించనుంది. మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఉన్న థర్మల్ విద్యుత్కేంద్రంలో తొలిసారిగా ఈ ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే తొలిసారి షోలాపూర్‌లోని సూపర్ థర్మల్ విద్యుత్కేంద్రంలో 'బయోమాస్ (వెదురు)' ఆధారిత విద్యుత్తును ఉత్పత్తి చేయాలంటూ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఎన్టీపీసీకి లేఖ రాశారు. థర్మల్ విద్యుత్కేంద్రానికి అవసరమైన వెదురును షోలాపూర్, సమీప ప్రాంతాల్లోని రైతుల నుంచి కొనుగోలు చేస్తామని సీఎం టాస్క్‌ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ పాషా పటేల్ చెప్పారు. ప్రస్తుతం షోలాపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి కోసం ఏటా 40 లక్షల టన్నుల బొగ్గును వినియోగిస్తున్నారని.. ఒక కిలో బొగ్గును మండిస్తే 2.08 కిలోల కార్బన్ విడుదల అవుతుందని, అంటే ఏటా ఏ స్థాయిలో కార్బన్ ఉత్పత్తి అవుతుందో ఊహించుకోవచ్చని పటేల్ అన్నారు. చాలా దేశాల్లో థర్మల్ పవర్ ప్లాంట్లను మూసివేస్తున్నారని గుర్తుచేశారు. ఈ విషయంలో మన దేశంలోనూ కొంత పురోగతి ఉందన్నారు. షోలాపూర్ ఎన్టీపీసీలో బయోమాస్‌గా వెదురును వినియోగించాలని నిర్ణయించామని, ఇందుకోసం వెదురు సాగును భారీగా పెంచేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. వెదురు సాగు చేసే రైతులకు రాయితీలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. 50 ఏళ్ల పాటు వెదురు కొనేలా ఒప్పందం చేసుకునేందుకు ఎన్టీపీసీ అంగీకరించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారని, పెద్ద ఎత్తున వెదురు సాగుకు ముందుకొస్తున్నారని చెప్పారు. లక్ష హెక్టార్లలో వెదురు సాగు చేయాలని ఎన్టీపీసీ పిలుపునిచ్చిందన్నారు.

చిత్రజ్యోతి

SINCE 1965

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



రామ్‌చరణ్ హీరోగా నటించిన 'గేమ్ ఛేంజర్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రాజమహేంద్రవరంలో శనివారం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన మణికంఠ(23), తోకాడ చరణ్(22) అనే ఇద్దరు యువకులు హాజరయ్యారు. ఇద్దరూ బైక్‌పై ఇంటికి తిరిగి వెళ్తుండగా ప్రమాదవశాత్తు వ్యాన్ ఢీకొని మరణించారు. వీరి మృతిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హీరో రామ్‌చరణ్, నిర్మాత దిల్ రాజు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ తరఫున మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని పవన్ కల్యాణ్ ప్రకటించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించే ఏర్పాట్లు చేయాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. కాగా, ఘటన గురించి తెలిసిన వెంటనే రామ్‌చరణ్ తన మనుషులను మృతుల కుటుంబ సభ్యుల వద్దకు పంపించారు. ఆ రెండు కుటుంబాలకు చెరొక రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. నిర్మాత దిల్ రాజు కూడా రెండు కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేస్తానని ప్రకటించారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబాలకు అండగా నిలుస్తానన్నారు.

అద్భుతమైన పాత్రతో...



మంచు విష్ణు టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డా.మోహన్ బాబు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో నటిస్తున్న పలువురు నటీనటుల ఫస్ట్ లుక్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. తాజాగా, ఈ సినిమాలో పార్వతీదేవీగా నటించిన కాజల్ అగర్వాల్ ఫస్ట్ లుక్ రివీల్ చేశారు. 'ముల్లోకాలు ఏలే తల్లి.. భక్తుల్ని ఆదుకునే త్రిశక్తి.. శ్రీకాళహస్తిలో వెలసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక' అంటూ కాజల్ పోషిస్తున్న పార్వతీ దేవి లుక్‌ను పరిచయం చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు కాజల్. సినిమాలో పార్వతీ దేవీ పాత్ర పోషిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. 'ఇది నేను ఎన్నాళ్లుగానో కలలుగంటున్న పాత్ర. ఇప్పటికి నా కల నెరవేరింది. ఇటువంటి పవిత్రమైన.. అద్భుతమైన పాత్రతో కొత్త ఏడాదిని ఆరంభిస్తున్నందుకు సంతోషంగా ఉంది' అని పేర్కొన్నారు. ఏప్రిల్ 25న సినిమా విడుదల కానుంది. అక్షయ్‌కుమార్ శివుడిగా నటించిన ఈ చిత్రంలో ప్రభాస్, మోహన్‌బాబు, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం, ప్రీతి ముకుందన్ కీలక పాత్రలు పోషించారు.

సినిమా మామూలుగా ఉండదు



వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. సోమవారం సినిమా ట్రైలర్‌ను మహేశ్‌బాబు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు. నిజామాబాద్ కలెక్టర్ గ్రౌండ్స్‌లో జరిగిన వేడుకలో వెంకటేశ్ మాట్లాడుతూ "మీరు నాపై చూపించే ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు. ఇప్పటివరకూ నాకు 'బొబ్బిలిరాజా', 'చంటి', 'గణేశ్', సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' ఇలా ఎన్నో విజయాలు ఇచ్చారు. ఇప్పుడు 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇది పక్కా సంక్రాంతి సినిమా. వినోదాత్మకంగా ఉంటుంది. ఈ సినిమాతో పాటు 'గేమ్ ఛేంజర్', 'డాకు మహారాజ్' కూడా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను. దిల్‌రాజు నిర్మాణంలో చేసిన నాలుగు సినిమాలూ సూపర్ హిట్లు అయ్యాయి. వారితో మరిన్ని సినిమాలు చేయాలని ఉంది. అనిల్ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. పెళ్లాలకి మీ ఫ్లాష్‌బ్యాకులు చెప్పొద్దు. సినిమా చూడండి. మామూలుగా ఉండదు" అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ "వెంకటేశ్, అనిల్, శిరీష్ ఈ సినిమాను ఓ బాధ్యతగా తీసుకుని 72 రోజుల్లోనే పూర్తి చేశారు. ఓ సినిమా వేడుక పూర్తిస్థాయిలో నిజామాబాద్‌లో జరగడం ఇదే ప్రథమం. శిరీష్‌కూ, నాకూ సినిమాలపై ఇష్టం ఏర్పడింది ఇక్కడే. ఈ సంక్రాంతి మా సంస్థకు బ్లాక్‌బస్టర్ పొంగల్‌గా మారుతుంది" అని చెప్పారు. "నేను వేదికపై ఎప్పుడూ మాట్లాడింది లేదు. ఈ సినిమా కచ్చితంగా అందరినీ అలరిస్తుంది. ఈ సినిమాలో భాగమైన అందరికీ ధన్యవాదాలు" అని నిర్మాత శిరీష్ తెలిపారు. "మీరు ట్రైలర్‌లో చూసింది కొంతే. సినిమాలో చాలా చాలా ఉంది. ఇది టిపికల్ జోనర్ సినిమా. వెంకటేశ్ అద్భుతంగా నటించారు. సినిమాలో చాలా ఆసక్తికరమైన మలుపులు ఉంటాయి పండక్కి. పెద్ద హిట్ కొట్టబోతున్నాం. ఈ సినిమాలో వెంకటేశ్ పోషించిన పాత్ర.. ఆయన కెరీర్‌లోనే భిన్నమైనది" అని అన్నారు.


- నిజామాబాద్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

టికెట్ ధరల పెంపుపై సీఎంను కలుస్తా : దిల్ రాజు

తెలంగాణలో 'గేమ్ ఛేంజర్' సినిమా టికెట్ ధరల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తానని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎఫ్‌డీసీ) ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ చిత్రానికి తెలంగాణలో కూడా టికెట్ ధరలు పెంచేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని, ఈ విషయంలో ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. టికెట్ రేట్లు పెంచడం వల్ల ప్రభుత్వానికి 18 శాతం ట్యాక్స్ రూపంలో ఆదాయం సమకూరుతుందని చెప్పారు. 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' తనకు కమ్‌బ్యాక్ ఫిల్మ్స్ అని నమ్ముతున్నట్లు దిల్‌రాజు చెప్పారు.

మా నటన సరిపోవట్లేదు

- బ్రహ్మాజీ



ఎక్స్ వేదికగా నటుడు బ్రహ్మాజీ పెట్టిన ఓ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. 'ఎక్కడ చూసినా బౌన్సర్లే.. వాళ్ల ఓవరాక్షన్ ముందు మా నటన సరిపోవట్లేదు. బయట ఓకే.. సెట్స్‌లో కూడానా' అని పోస్ట్ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన పెట్టిన ఈ పోస్ట్ హాట్‌టాపిక్‌గా మారింది. అయితే, ఎవరి బౌన్సర్లను ఉద్దేశించి ఈ పోస్ట్ పెట్టారో మాత్రం ఆయన చెప్పలేదు.

విశాల్‌కు అనారోగ్యం!



నెల రోజులుగా హీరో విశాల్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'మదగజరాజా' ప్రీరిలీజ్ ఈవెంట్ ఆదివారం జరిగింది. ఈ వేడుకకు రావొద్దని మేకర్స్ వారించినప్పటికీ విశాల్ వినిపించుకోకుండా హాజరయ్యారు. ఈ సభలో మాట్లాడుతున్నప్పుడు విశాల్ చేతులు వణుకుతూ కనిపించాయి. అలాగే, మాట్లాడడానికి కూడా ఆయన ఇబ్బంది పడ్డారు. విశాల్ వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్నారనీ, విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు చెన్నై అపోలో ఆస్పత్రి వైద్య బృందం పేర్కొంది.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

వేధింపులు సహించను



ఒక వ్యాపారవేత్త కారణంగా తను ఇబ్బంది పడుతున్నాననీ, ఆయన వేధింపులు తట్టుకోలేక పోలీసులకు ఫిర్యాదు చేశానని మలయాళ నటి హనీ రోజ్ వెల్లడించారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎర్నాకులం నగర పోలీసులు 27 మందిపై కేసు నమోదు చేసి, వారిలో ఒకరిని అరెస్టు చేశారు. ఆ వ్యాపారవేత్త పిలిచిన కార్యక్రమాలకు కొన్ని కారణాల వల్ల హాజరు కాలేకపోయా. దాంతో నాపై ప్రతీకారంతో ఆయన కావాలని అవమానించేలా కామెంట్స్ చేస్తున్నారని హనీ రోజ్ తెలిపారు. ఇలా అసభ్యంగా కామెంట్స్‌ను ఏ మాత్రం సహించననీ, అలా కామెంట్స్ చేసే వారిపై న్యాయపోరాటం చేస్తానని హనీ రోజ్ చెప్పారు.

విచారణ వాయిదా



జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ నెల 9న విచారణ చేపడతామని తెలిపింది. హైదరాబాద్‌లోని జల్‌పల్లిలో ఉన్న తన నివాసం వద్ద జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు గత నెల 23న కొట్టివేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ సుధాంశు దులియా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాలతో కూడిన ద్విసభ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. మోహన్‌బాబు తరఫున వాదించాల్సిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అందుబాటులో లేరని, అందువల్ల పాస్ ఓవర్ ఇవ్వాలని బృందంలోని ఇతర న్యాయవాదులు కోరారు. దీంతో తదుపరి విచారణను గురువారం చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

- న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

గంగై అమరన్‌కు తీవ్ర అస్వస్థత



సీనియర్ సంగీత దర్శకుడు, ఇళయరాజా సోదరుడు గంగై అమరన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను మదురైలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. 77 యేళ్ల గంగై అమరన్ ఓ కొత్త చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మానామదురై, శివగంగై ప్రాంతాల్లో జరుగుతోంది. ఈ షూటింగ్‌లో పాల్గొనేందుకు వెళ్ళిన ఆయన ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఆయనను హుటాహుటిన మానామదురైలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి ప్రాథమిక వైద్యం చేయించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య సేవల కోసం మదురై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న గంగై అమరన్ కుమారుడు, దర్శకుడు వెంకట్ ప్రభు, నటుడు ప్రేమ్‌జీ అమరన్ మదురైకు చేరుకున్నారు. చలికాలం కావడంతో అమరన్ శ్వాస పీల్చడంలోనే సమస్యలు వినహా ఆరోగ్యపరంగా బాగానే ఉన్నారని వైద్యులు వెల్లడించారు.

దెయ్యం పాత్రలో పూజా హెగ్డే!



హీరోయిన్ పూజా హెగ్డే దెయ్యం పాత్రలో కనిపించనున్నారు. దర్శకనటుడు రాఘవ లారెన్స్ రూపొందించనున్న 'కాంచన' సీక్వెల్ నాలుగో భాగంలో ఆమె దెయ్యంగా నటించనున్నట్టు సమాచారం. ఇందులోనే హీరోయిన్‌గా పూజాను ఎంపిక చేసినట్టు సమాచారం. ఇప్పటివరకు వచ్చిన తొలి మూడు భాగాలు సూపర్‌హిట్ అయిన విషయం తెల్సిందే. దీంతో నాలుగో భాగాన్ని రూపొందించే పనిలో రాఘవ లారెన్స్ నిమగ్నమయ్యారు. ఇందుకోసం టెక్నీషియన్స్, నటీనటుల ఎంపిక జరుగుతోంది.

నా కెరీర్‌లో ఇదే బెస్ట్ క్యారెక్టర్

- అంజలి



రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈనెల 10న తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సినీ నటి అంజలి మాట్లాడుతూ' ఈ సంక్రాంతికి తెలుగులో 'గేమ్ ఛేంజర్', తమిళంలో విశాల్ చిత్రం రాబోతున్నాయి. ఈ రెండు చిత్రాలకు మంచి రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నా. 'గేమ్ ఛేంజర్'లో నా పాత్ర పేరు పార్వతి. మా అమ్మ పేరు కూడా పార్వతి. డైరెక్టర్ కథ చెప్పినప్పుడు, క్యారెక్టర్ చెప్పినప్పుడు మా అమ్మే గుర్తుకు వచ్చారు. సెట్స్ నుంచి వచ్చాక కూడా ఈ పాత్ర చాలా రోజులు నన్ను వెంటాడుతూనే వచ్చింది. నా కెరీర్‌లో ఇదే బెస్ట్ క్యారెక్టర్. రామ్ చరణ్ తన కో స్టార్స్‌ని ఎంతో గౌరవిస్తారు. సెట్స్‌లో అందరితోనూ చక్కగా మాట్లాడతారు. అప్పన్న, పార్వతీల ప్రేమ, వారి బంధం చాలా గొప్పగా ఉంటుంది. శంకర్, మణిరత్నం చిత్రాల్లో నటించాలని అందరికీ ఉంటుంది. శంకర్ చిత్రంలో నటించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. 'గేమ్ ఛేంజర్' వల్ల నా ఆలోచనాధోరణి మారింది. ఈ ప్రయాణంలో ఎంతో నేర్చుకున్నా'.

'రిజర్వ్' పేస్‌లో పదునేది?




ఆకాశ్‌దీప్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



ముకేశ్



అర్షదీప్



ప్రసిద్ధ్

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత బ్యాటర్ల ఆటతీరు విమర్శల పాలైంది. బౌలింగ్‌లో మాత్రం బుమ్రా బృందం అందరినీ ఆకట్టుకుంది. కానీ సునిశితంగా గమనిస్తే.. భారత రిజర్వ్ బెంచ్‌లో బ్యాటింగ్ కన్నా బౌలింగ్ వనరుల సమస్య ఎక్కువగా ఉండడం గమనార్హం. కెప్టెన్ రోహిత్, విరాట్‌ల వైఫల్యంతో వారి కెరీర్ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ వారు వైదొలిగినా.. సమర్థులైన యువ బ్యాటర్లు ఆ స్థానాలను భర్తీ చేసేందుకు సిద్ధంగానే ఉన్నారు. కానీ బౌలింగ్ విషయానికి వస్తే.. ముఖ్యంగా పేస్ విభాగం కథ మరోలా ఉంది. బుమ్రా, షమి, ఇషాంత్‌ల స్థాయిని అందుకునేందుకు టెస్టు జట్టు కచ్చితంగా కొంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బౌలర్లు జట్టు అవసరాలను తీర్చగలరా? అనేది సందేహమే. షమిని గాయాలు వెంటాడుతుండడంతో బుమ్రాపై అధిక భారం పడుతోంది. వీరిద్దరూ అందుబాటులో లేకపోతే పరిస్థితి ఏమిటి? అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతం జట్టులో ఉన్న సిరాజ్ 36 టెస్టులు ఆడినా గేమ్ చేంజర్‌గా మారలేదు. ప్రసిద్ధ్ కృష్ణ చాలా ఎక్కువగా లూజ్ బాల్స్ వేస్తుంటాడు. ఆకాశ్‌దీప్, ముకేశ్ కుమార్‌లకు నైపుణ్యం ఉన్నా అంతర్జాతీయ స్థాయిలో ఇంకా నిరూపించుకోలేదు. ఇక రంజీ సర్క్యూట్‌ను పరిశీలించినా సెలెక్టర్లను అంతగా ఆకట్టుకున్న పేసర్లు కనిపించడం లేదు. అన్నింటికన్నా ముఖ్యంగా జట్టుకు లెఫ్టామ్ పేసర్ అవసరం చాలా ఉంది. జహీర్ ఖాన్ తర్వాత ఇప్పటి వరకు ఆ స్థానాన్ని మరెవరూ భర్తీ చేయలేకపోయారు. అర్షదీప్, యష్ దయాళ్‌లపై ఇప్పటికీ నమ్మకం కుదరడం లేదు. వారు సుదీర్ఘ ఫార్మాట్‌కు సరిపోతారా? అనేది తేలాల్సి ఉంది.

బ్యాటర్లు సిద్ధంగా..

బ్యాటింగ్ విభాగంలో మాత్రం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. దేశవాళీల్లో పరుగుల వరద పారిస్తున్న బ్యాటర్లు జాతీయ జట్టులో చోటు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ రోహిత్, విరాట్ లేకుండా సెలెక్టర్లు ముందుకు వెళ్లాలని భావిస్తే.. ఈ రెండు స్థానాల కోసం కనీసం అరడజను మంది సిద్ధంగా ఉన్నారు. ఇందులో దేవ్‌దత్ పడిక్కళ్, అభిమన్యు ఈశ్వరన్, రుతురాజ్ గైక్వాడ్, సాయి సుదర్శన్, రజత్ పటీదార్, శ్రేయాస్ అయ్యర్‌ల పేర్లు చెప్పుకోవచ్చు. అభిమన్యు 101 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 7674 పరుగులు సాధించినా జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేయలేకపోయాడు. ఇటీవలి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలోనూ బెంచీకే పరిమితమయ్యాడు. స్టార్ ప్లేయర్లు ఎంతగా విఫలమవుతున్నా వారినే కొనసాగించడం కూడా యువ ఆటగాళ్లకు శాపంలా మారింది. అయ్యర్ షార్ట్ బాల్ బలహీనతను అధిగమించాల్సి ఉంటుంది. అయితే దేశవాళీల్లో ఆటగాళ్ల పరుగులు లేదా వికెట్లు మాత్రమే ఎంపికకు గీటురాయి కాకపోవచ్చు. అనుకూల పరిస్థితుల్లో రాణించడం కాకుండా.. పచ్చికతో కూడిన పిచ్‌పై సెంచరీ, ఫ్లాట్ వికెట్‌పై వికెట్లు తీయగల సామర్థ్యం కీలకమవుతుంది. ఏదిఏమైనా జూన్ వరకు టెస్టు సిరీస్‌లు లేవు కాబట్టి ఫిబ్రవరిలో దేశవాళీ సీజన్ ముగిసిన తర్వాతే ఆటగాళ్ల ఎంపికపై దృష్టి సారించే అవకాశముంది.

రెయాన్ష్ రికార్డు ఫీట్



థానె: ఆరేళ్ల చిన్నారి రెయాన్ష్ కామ్కర్ సాగరంలో అద్భుతమైన ఫీట్‌తో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులోకెక్కాడు. అరేబియా సముద్రంలో 15 కిలోమీటర్లు ఈదిన పిన్నవయస్కుడిగా నిలిచాడు. మూడు గంటల్లో మాల్వే నుంచి వాగ్దన్ వరకు ఈదుకొంటూ చేరుకొన్నాడని మహారాష్ట్ర స్విమ్మింగ్ సంఘం తెలిపింది.

మంధానకు పగ్గాలు



హర్మన్, రేణుకలకు విశ్రాంతి

ఐర్లాండ్‌తో వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టు

న్యూఢిల్లీ: ఐర్లాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత మహిళల జట్టు కెప్టెన్‌గా స్మృతీ మంధాన వ్యవహరించనుంది. 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ సోమవారం ప్రకటించింది. రాజ్‌కోట్‌లో ఈనెల 10,12,15వ తేదీల్లో మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే రెగ్యులర్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు పేసర్ రేణుకా సింగ్‌లకు పని ఒత్తిడి కారణంగా ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. విండీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో గాయపడిన హర్మన్ చివరి రెండు మ్యాచ్‌లకు దూరమైంది. ఆ తర్వాత వన్డే సిరీస్‌లో మాత్రం ఆడింది. కొంతకాలంగా రేణుకా సింగ్ రెగ్యులర్‌గా క్రికెట్ ఆడుతోంది. మంధాన పరిమిత ఓవర్ల ఫార్మాట్లలో వరుస అర్ధసెంచరీలు బాదేస్తూ భీకర ఫామ్‌లో ఉన్న సంగతి తెలిసిందే.

భారత జట్టు
స్మృతీ మంధాన (కెప్టెన్), దీప్తి శర్మ, ప్రతీక, హర్లీన్, జెమీమా, ఉమా చెత్రి, రిచా ఘోష్, తేజల్, రాఘవి, మిన్ను, ప్రియా మిశ్రా, తనూజ, టిటాస్, సైమా ఠాకూర్, సయాలి.

అఫ్ఘాన్‌దే సిరీస్

రెండో టెస్ట్‌లో గెలుపు

బులవాయో: జింబాబ్వేతో రెండో టెస్ట్‌లో అఫ్ఘానిస్థాన్ 72 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల ఈ సిరీస్‌ను అఫ్ఘాన్ 1-0తో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. 278 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 205 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 205/8తో ఆఖరిరోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు ఒక్క పరుగు కూడా చేయకుండానే మిగతా రెండు వికెట్లను కోల్పోయింది. రషీద్ ఖాన్ (7/66) ఏడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 157 రన్స్ చేసిన అఫ్ఘాన్.. రెండో ఇన్నింగ్స్‌లో 363 పరుగులు చేసింది. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 243 రన్స్ సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌'గా రషీద్, 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌'గా రహ్మత్ షా నిలిచారు.

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు బుమ్రా దూరం?



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లలో భారత స్టార్ పేసర్ బుమ్రా ఆడే అవకాశాలు కనిపించడం లేదు. ఆసీస్‌తో జరిగిన చివరి టెస్టులో తను వెన్నునొప్పికి గురైన విషయం తెలిసిందే. ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో భారత్ 5 టీ20లు, 3 వన్డేలు ఆడనుంది. వచ్చే నెలలో జరిగే చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని బుమ్రాకు సెలెక్టర్లు విశ్రాంతినిచ్చే ఆలోచనలో ఉన్నారు. ప్రస్తుతానికి బుమ్రా గాయం తీవ్రతపై స్పష్టత లేదు. గ్రేడ్ 1 కేటగిరీ అయితే మూడు వారాల విశ్రాంతి సరిపోతుంది. కానీ గ్రేడ్ 2కు ఆరువారాలు, గ్రేడ్ 3కి కనీసం 3నెలలు ఆటకు దూరం కావాల్సి ఉంటుంది. గాయం తీవ్రత తక్కువగా ఉంటే చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు చివరి వన్డేలోనైనా బుమ్రా ఆడే చాన్సుంటుంది.

దక్షిణాఫ్రికా క్లీన్‌స్వీప్

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో ముగిసిన రెండో టెస్ట్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అలాగే సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఫాలోఆన్‌లో సోమవారం నాలుగో రోజు పాక్ 478 పరుగులకు ఆలౌటైంది. షాన్ మసూద్ (145), సల్మాన్ ఆఘా (48), రిజ్వాన్ (41) పోరాడారు. రబాడ, కేశవ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత 58 పరుగుల స్వల్ప ఛేదన కోసం బరిలోకి దిగిన సౌతాఫ్రికా 7.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 61 పరుగులు చేసి నెగ్గింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 615, పాక్ 194 పరుగులు చేశాయి.

టెస్ట్ క్రికెట్‌లో రెండంచెల విధానం?

తెరవెనుక జోరుగా ప్రయత్నాలు

జై షా ఆసక్తి!
బీసీసీఐ కూడా ఓకే చెప్పే అవకాశం

న్యూఢిల్లీ: టెస్ట్ క్రికెట్‌ను కాపాడుకోవడంలో భాగంగా రెండంచెల విధానాన్ని తీసుకొచ్చేందుకు వేగంగా పావులు కదుపుతున్నట్టు తెలుస్తోంది. ఆస్ట్రేలియా-భారత్ మధ్య జరిగిన 5 టెస్ట్‌ల సిరీస్‌కు విపరీతమైన ప్రేక్షకాదరణ లభించింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని టెస్ట్ క్రికెట్ ఆడే ప్రధాన దేశాలైన భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య తరచూ సిరీస్‌లను నిర్వహించాలన్న చర్చ మొదలైంది. రెండంచెల విధానానికి ఐసీసీ చైర్మన్ జై షా సుముఖంగా ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో బీసీసీఐ, క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ క్రికెట్ బోర్డులతో ఈ నెలాఖరులో భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, 2027 వరకు భవిష్యత్ టూర్ షెడ్యూల్ ఈపాటికే ఖరారైనా.. తాజా పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. రెండంచెల విధానం ప్రతిపాదన కొత్తదేం కాదు. 2016లోనే ఈ ఆలోచన తెరపైకి వచ్చింది. కానీ, చిన్న జట్లకు అన్యాయం జరుగుతుందని బీసీసీఐ, జింబాబ్వే, బంగ్లాదేశ్ బోర్డులు వ్యతిరేకించాయి. కానీ, తొమ్మిదేళ్లలో చోటు చేసుకొన్న మార్పుల నేపథ్యంలో భారత మాజీ కెప్టెన్, ప్రముఖ కామెంటేటర్ రవిశాస్త్రి లాంటి వారు కూడా రెండంచెల విధానానికి ఓటేస్తున్నారు. టెస్ట్ క్రికెట్‌ను బతికించుకోవాలంటే ఇంతకుమించిన మార్గం లేదని శాస్త్రి బలంగా వాదిస్తున్నాడు. కాగా, వరల్డ్ టెస్ట్ క్రికెట్ చాంపియన్‌షిప్ విధానాన్ని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ కూడా తీవ్రంగా విమర్శించాడు. తనకు ఇది ఏమాత్రం అర్థం కాలేదన్నాడు.

టూ-టైర్ అంటే..

టెస్ట్ క్రికెట్ ఆడే దేశాలను రెండు డివిజన్లుగా వర్గీకరిస్తారు. డివిజన్-1లో అత్యుత్తమ టెస్ట్ క్రికెట్ జట్లు భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, సౌతాఫ్రికా, శ్రీలంక, పాకిస్థాన్‌ల మధ్య తరచూ సిరీస్‌లు నిర్వహించేలా చూస్తారు. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, జింబాబ్వే లాంటి జట్లను ద్వితీయశ్రేణి జట్లుగా గుర్తించి వాటి మధ్య మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇటీవలి కాలంలో సుదీర్ఘ ఫార్మాట్‌లో అంతగా రాణించలేకపోతున్న వెస్టిండీస్‌ను కూడా దిగువస్థాయి జట్టుగానే పరిగణించే అవకాశం ఉంది. ఇలా వర్గీకరించడం వల్ల ప్రధాన జట్ల మధ్య ఎక్కువ మ్యాచ్‌లు జరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నాలుగేళ్లలో రెండుసార్లు తలపడే జట్లు.. ఇదే సమయంలో మూడుసార్లు ఆడే చాన్సులున్నాయి. కాగా, డివిజన్-2లోని జట్లకు ఉన్నతి ఉంటుందా? లేదా? అనే విషయంపై ఇంకా చర్చలు జరగాల్సిన అవసరం ఉంది. ఒకరకంగా రంజీ ట్రోఫీలో ఎలీట్, ప్లేట్ గ్రూప్ తరహా విధానాన్ని అంతర్జాతీయ స్థాయిలో అమలు చేసే ప్రయత్నంగా చెప్పుకోవచ్చు.

'సెలెక్టర్లే నిర్ణయం తీసుకొంటారు'



ఆస్ట్రేలియాతో సిరీస్ కోల్పోవడంతో పాటు టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు గల్లంతు కావడాన్ని బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా రోహిత్, కోహ్లీ ప్రదర్శనపై బోర్డు పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. 'జట్టు ప్రదర్శనను మెరుగుపరిచే విషయంలో బోర్డు కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ ఇద్దరి విషయంలో సరైన సమయంలో సెలెక్టర్లే తగిన నిర్ణయం తీసుకొంటారు. వీరి వరుస వైఫల్యాలపై ప్రత్యేకంగా చర్చిస్తార'ని బోర్డు అధికారి వెల్లడించారు.

దృష్టంతా సాత్విక్ జోడీపైనే!



నేటి నుంచి మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మంగళవారం నుంచి జరిగే మలేసియా ఓపెన్‌తో కొత్త ఏడాదిని ఘనంగా ఆరంభించాలనుకొంటోంది. లక్ష్యసేన్, బ్రేక్ తర్వాత బరిలోకి దిగుతున్న హెచ్‌ఎస్ ప్రణయ్ అదిరే ప్రదర్శనపై గురిపెట్టారు. తొలి రౌండ్‌లో తైపీకి చెందిన మింగ్ చె లు-టాంగ్ కై వితో సాత్విక్ జోడీ తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో చి యు జెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్, బ్రియాన్ అయాంగ్ (కెనడా)తో ప్రణయ్ ఆడనున్నారు. ఇటీవలే వివాహం చేసుకొన్న పీవీ సింధు టోర్నీకి దూరం కాగా.. మహిళల సింగిల్స్‌లో ఆకర్షి, మాళవిక, అనుపమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రీ, రుతుపర్ణ-శ్వేతపర్ణ, మిక్స్‌డ్‌లో తనీషా-ధ్రువ్ కపిల జంటలు బరిలోకి దిగనున్నాయి.

బిజినెస్

వైరస్ కలకలం

రూ.11 లక్షల కోట్ల సంపద ఫట్ • సెన్సెక్స్ 1,258 పాయింట్లు పతనం

78,000 దిగువ స్థాయికి సూచీ

388 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ

చిన్న కంపెనీల షేర్లు విలవిల



ముంబై: చైనాను వణికిస్తోన్న హ్యూమన్ మెటానిమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) భారత్‌కూ వ్యాపించిందన్న వార్తలతో స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం కుప్పకూలాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,441 పాయింట్లకు పైగా పతనమైంది. చివరికి 1,258.12 పాయింట్ల (1.59 శాతం) నష్టంతో 77,964.99 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 78,000 కీలక స్థాయిని కోల్పోయినట్లైంది. నిఫ్టీ 388.70 పాయింట్లు (1.62 శాతం) క్షీణించి 23,616.05 వద్దకు జారింది. కొత్త వైరస్ కలకలంతో పాటు మూడో త్రైమాసికంలో కంపెనీల ఆదాయ వృద్ధిపై ఆందోళనలు, రూపాయి క్షీణత -డాలర్ బలోపేతం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ, అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై అనిశ్చితి, భవిష్యత్‌లో వడ్డీరేట్ల తగ్గింపుపై ఫెడ్ రిజర్వ్ కఠిన వైఖరి వంటి అంశాలు మార్కెట్‌ను మరింత కుంగదీశాయి. దాంతో మదుపరులు అన్ని విభాగాలు, రంగాల షేర్లలో అమ్మకాలను పోటెత్తించారు. మార్కెట్ సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.10.98 లక్షలకు పైగా పతనమై రూ.438.79 లక్షల కోట్లకు (5.11 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో టైటాన్, హెచ్‌సీఎల్ టెక్ మినహా అన్నీ నష్టపోయాయి. టాటా స్టీల్ షేరు 4.41 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎన్‌టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, పవర్‌గ్రిడ్, అదానీ పోర్ట్స్ షేర్లు 3 శాతానికి పైగా విలువను కోల్పోయాయి.
- ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి సంస్థల షేర్లలో మదుపరులు భారీగా అమ్మకాలకు పాల్పడ్డారు. దాంతో బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 3.17 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.44 శాతం క్షీణించాయి.
- అన్ని రంగాల సూచీలూ నేలచూపు చూశాయి. యుటిలిటీస్ ఇండెక్స్ అత్యధికంగా 4.16 శాతం పతనమైంది. పవర్, సర్వీసెస్, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎనర్జీ సూచీలు మూడు శాతానికి పైగా నష్టపోయాయి.
- బీఎస్ఈలో 4,244 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 3,530 నష్టపోయాయి. 611 లాభపడగా, 114 యథాతథంగా ముగిశాయి. 113 సంస్థల షేర్లు 52 వారాల కనిష్ఠానికి జారుకోగా.. 176 ఏడాది గరిష్ఠాన్ని తాకాయి.
- ఎన్ఎస్ఈ విషయానికొస్తే, నిఫ్టీతో పాటు బ్యాంక్ నిఫ్టీ సూచీలు 200 రోజుల చలన సగటు (డీఎంఏ) కిందికి పడిపోయాయి.
- మార్కెట్ భారీగా నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. గత శుక్రవారం సెషన్‌లో సెన్సెక్స్ 720 పాయింట్లు, నిఫ్టీ 183 పాయింట్లు నష్టపోయాయి.
- డాలర్‌తో రూపాయి మారకం విలువ 11 పైసలు పెరిగి రూ.85.68 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నష్టపోయిన రూపీ.. ఆర్‌బీఐ జోక్యంతో మళ్లీ పుంజుకుందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 76.27 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- దేశ రాజధాని ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.700 తగ్గి రూ.79,000కు దిగిరాగా.. కిలో వెండి రూ.300 పెరిగి రూ.90,700కు చేరుకుంది. కాగా, అంతర్జాతీయ విపణిలో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 2,659.60 డాలర్లు, సిల్వర్ 30.87 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

వెండి నగలకూ హాల్‌మార్కింగ్

- రంగం సిద్ధం చేస్తున్న బీఐఎస్
- ఆరు నెలల్లో అమలు చేసే అవకాశం!

న్యూఢిల్లీ: వెండి నగలు, వస్తువులకూ 'హాల్‌మార్కింగ్‌'ను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన విధి విధానాలు ఖరారు చేయాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి.. భారతీయ ప్రమాణాల సంస్థ బీఐఎస్‌ను కోరారు. బీఐఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన విలేకరులతో ఈ విషయం చెప్పారు. ప్రస్తుతం బంగారంతో చేసిన నగలు, వస్తువులకు మాత్రమే 'హాల్‌మార్క్' గుర్తును తప్పనిసరి చేశారు. వెండి నగల్లో కల్తీని నిరోధించేందుకు, వాటికీ హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలని వినియోగదారుల నుంచి పెద్దఎత్తున విజ్ఞప్తులు అందుతున్నాయి. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు జోషి చెప్పారు. బీఐఎస్ ఇందుకు అవసరమైన విధి విధానాలు ఖరారు చేశాక అందరితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా దీనిపై ఇప్పటికే కసరత్తు ప్రారంభమైందని ఇదే కార్యక్రమంలో పాల్గొన్న బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ తివారీ చెప్పారు. ఇందులో భాగంగా వెండి నగల స్వచ్ఛతను తెలిపేందుకు అవసరమైన హాల్‌మార్కింగ్‌ను రూపొందించి పరిశ్రమ వర్గాలతో చర్చిస్తున్నట్టు తెలిపారు. ఈ చర్చలు పూర్తయితే మూడు నుంచి నాలుగు నెలల్లో వెండి నగలకూ హాల్‌మార్కింగ్ అమలు చేస్తామన్నారు.

స్టాండర్డ్ గ్లాస్ ఐపీఓకు అపూర్వ స్పందన

ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్

ఆఫర్ తొలి రోజునే 13.32 రెట్ల బిడ్ల దాఖలు

హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు ఇన్వెస్టర్ల నుంచి అద్భుత స్పందన లభించింది. సోమవారం ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే ఈ ఇష్యూ పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. తొలి రోజు పూర్తయ్యేసరికి ఈ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 13.32 రెట్ల బిడ్లు లభించాయి. సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు కేటాయించిన షేర్లకు గాను 25.42 రెట్లు, రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 14.46 రెట్ల బిడ్లు వచ్చాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ వాటా 1.82 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన షేర్ల విక్రయం ద్వారా మొత్తం రూ.410 కోట్ల సమీకరణ లక్ష్యంతో స్టాండర్డ్ గ్లాస్ ఐపీఓను ప్రారంభించింది. ఇష్యూ ధరల శ్రేణిని రూ.133-140గా నిర్ణయించింది.

అచేతన ఖాతాల సెటిల్‌మెంట్ నిబంధనల సడలింపు : సెబీ

30 రోజుల పాటు అచేతనంగా ఉన్న ట్రేడింగ్ ఖాతాల్లోని క్లయింట్ల నిధుల సెటిల్‌మెంట్‌కు సంబంధించిన నిబంధనలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సడలించింది. ఇన్వెస్టర్ల ప్రయోజనాలను రక్షించే ఉద్దేశంతో సరళీకరించిన నియమావళి తక్షణమే అమలులోకి వస్తుందని సెబీ స్పష్టం చేసింది. ఇప్పటివరకు అమలైన నిబంధనల ప్రకారం.. స్టాక్ బ్రోకర్లు అచేతన ఖాతాలను రోజువారీగా గుర్తించి, వాటిలోని నిధులను క్లయింట్లకు 3 పని దినాల్లో బదలాయించాల్సి వచ్చేది. ఇకపై స్టాక్ బ్రోకర్లు ఎక్స్ఛేంజీలు తమ వార్షిక క్యాలెండర్‌లో నోటిఫై చేసిన నెలవారీ రన్నింగ్ అకౌంట్ సెటిల్‌మెంట్ సైకిల్ ప్రకారంగా అచేతన ఖాతాల్లోని సొమ్మును పరిష్కరించాల్సి ఉంటుంది.

ఇక పక్కాగా పరపతి సమాచారం

బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ ఆదేశాలు

ముంబై: ఖాతాదారుల పరపతి చరిత్రలో ఏమైనా మార్పులు జరిగితే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇక ఆ విషయాన్ని పక్కాగా ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లు, ఈ-మెయిల్స్ ద్వారా అందజేయాలి. అలాగే ఏవైనా సంస్థలు ఖాతాదారుల పరపతి సమాచార నివేదిక (సీఐఆర్) తీసుకున్నా ఆ విషయాన్ని కూడా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఖాతాదారులకు తెలియజేయాలి. దీనికి సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. లోపాలను సరిదిద్దుకునేందుకు ఖాతాదారులు సమర్పించిన సమాచారాన్ని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు తిరస్కరించినా, ఆ విషయాన్ని కూడా 30 రోజుల్లోగా ఖాతాదారులకు తెలియజేయాలి. లేకపోతే రోజుకు రూ.100 చొప్పున జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ తెలిపింది. తాజా ఆదేశాలతో ఖాతాదారుల పరపతి నిర్ధారణ ఎప్పటికప్పుడు నవీకరించబడి, రుణ వితరణ సులభమవుతుందని భావిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,700 ▼	72,140 ▼	99,000 ▼
విజయవాడ	79,500 ▼	75,000 ▼	92,000 ▲
విశాఖపట్నం	77,380 ▼	70,930 ▼	90,790 ▲
రాజమండ్రి	78,710 ▼	71,150 ▼	90,400 ▲
ప్రొద్దుటూరు	78,750 ▼	72,920 ▼	90,300 ▼
ముంబై	77,161 ▼	70,680 ▼	89,152 ▲

పెట్రోకెమికల్స్ వ్యాపారంలోకి అదానీ

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పెట్రోకెమికల్స్ వ్యాపారంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకోసం థాయ్‌లాండ్ కేంద్రంగా పనిచేసే ఇండోరమా రీసోర్సెస్ లిమిటెట్‌తో కలిసి సంయుక్తం (జేవీ)గా వలోర్ పెట్రోకెమికల్ లిమిటెడ్ (వీపీఎల్) పేరుతో ప్రత్యేక కంపెనీ ఏర్పాటు చేసింది. ఈ జేవీ ఈక్విటీలో అదానీ గ్రూప్, ఇండోరమా కంపెనీకి చెరి సగం వాటా ఉంటుంది. అదానీ పెట్రోకెమికల్స్ అనే కంపెనీ ద్వారా అదానీ గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఈ పెట్టుబడి సమకూరుస్తుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా గుజరాత్‌లో ఒక రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు, స్పెషాలిటీ కెమికల్స్ తయారీ యూనిట్లను రెండు దశల్లో ఏర్పాటు చేస్తారు. ఏటా 20 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే ఈ పెట్రోకెమికల్ ప్లాంటు కోసం 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.34,000 కోట్లు) వరకు ఖర్చు చేయనున్నట్టు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ప్రకటించారు. ఇందులో 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే తొలి దశ వచ్చే ఏడాది, ఇంకో 10 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసే రెండో దశ 2027లో పూర్తవుతుంది.

సౌదీ అరేబియా అప్పుల వేట

రియాద్: సౌదీ అరేబియా ఆర్థిక కష్టాల్లో ఉందా? పరిస్థితులను గమనిస్తే అలాగే అనిపిస్తోంది. పెట్రో డాలర్లతో తులతూగుతున్న ఈ దేశం కూడా ఇప్పుడు అప్పుల వేటలో పడింది. ఇందులో భాగంగా సోమవారం రుణ పత్రాల ద్వారా 700 కోట్ల డాలర్లు (సుమారు రూ.60,000 కోట్లు) సమీకరించింది. బడ్జెట్ లోటు పూడ్చుకోవడంతో పాటు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా సౌదీ అరేబియా ప్రభుత్వం ఈ రుణ పత్రాలు జారీ చేస్తోంది. గత ఏడాది కూడా రుణ పత్రాల జారీ ద్వారా సౌదీ ప్రభుత్వం 2,500 కోట్ల డాలర్లు సమీకరించింది. ఈ సంవత్సరం ఇది 3,700 కోట్ల డాలర్ల (సుమారు రూ.3.17 లక్షల కోట్లు) వరకు ఉంటుందని అంచనా. బ్యారల్ ముడి చమురు ధర తన అంచనా అయిన 90 డాలర్లకు దిగువకి పడిపోవడంతో సౌదీ అరేబియా కూడా నిధుల కొరత ఎదుర్కొంటోంది. దీంతో అప్పుల వేటలో పడింది.

ఆస్తమా స్క్రీనింగ్ కోసం సిప్లా మొబైల్ యాప్

న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం సిప్లా ఉబ్బసం (ఆస్తమా) రోగుల స్క్రీనింగ్ కోసం ఒక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సిప్ఎయిర్ పేరిట తయారుచేసిన ఈ మొబైల్ యాప్ ప్రస్తుతం ఆండ్రాయిడ్ ఫోన్లపై అందుబాటులో ఉండగా త్వరలోనే ఐఓఎస్ డివైస్‌లకు కూడా అందుబాటులోకి తెస్తామని కంపెనీ తెలిపింది. దేశంలో ఉబ్బసం రోగుల సంఖ్య 3.43 కోట్లున్నట్టు అంచనా అని గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ నివేదిక తెలియచేసింది. ఉబ్బసం కారణంగా మరణించిన వారు, ఏ పనీ చేయలేని స్థితిలో ఉన్న వారి సంఖ్య ప్రపంచ దేశాలతో పోల్చితే మన దేశంలో మూడు రెట్లు అధికంగా ఉంది. ఉబ్బసం వ్యాధిని సరిగ్గా గుర్తించలేకపోవడం, గుర్తించిన కేసుల్లో సరైన చికిత్స చేయకపోవడం ఇందుకు కారణమని చెబుతున్నారు.

- స్టైలిష్ యాక్టివ్‌వేర్ టెక్నోస్పోర్ట్.. దక్షిణ భారతదేశంలో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ టోలిచౌకిలో ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌ను ప్రారంభించింది. దక్షిణాదిలో కంపెనీకి ఇది ఏడో స్టోర్. ఈ స్టోర్లలో తేలికపాటి జాకెట్స్, స్వెట్‌షర్ట్స్ సహా ఫిట్‌నెస్ చేసే వారి కోసం అత్యుత్తమమైన యాక్టివ్‌వేర్ అందుబాటులో ఉండనున్నాయి.
- డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్.. డిపాజిట్లలో రెండంకెల వృద్ధిని నమోదు చేసింది. ఈ కాలంలో బ్యాంక్ మొత్తం డిపాజిట్లు 16 శాతం వృద్ధితో రూ.29,669 కోట్ల నుంచి రూ.34,496 కోట్లకు చేరుకున్నాయి. మైక్రోఫైనాన్స్, రిటైల్ రుణ విభాగాల రుణ బుక్ కూడా 10 శాతం పెరుగుదలతో రూ.30,466 కోట్లకు వృద్ధి చెందాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) — 7వ తేదీ

హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	500
చిత్తూరు	523	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	114	విజయవాడ	116
వరంగల్	114	గుంటూరు	115
కరీంనగర్	114	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	87
కర్నూలు	114	నెల్లూరు	92
విశాఖపట్నం	107	అనంతపురం	92
గోదావరి	116		

రాష్ట్రంలో ఎనుముల రాజ్యాంగం!

- ఏ హోదా ఉందని తిరుపతిరెడ్డికి కాన్వాయ్?
- అక్రమ కేసులకు భయపడను...ప్రశ్నిస్తూనే ఉంటా: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్యాయాన్ని నిలదీసినా.. హామీలు అమలు చేయడం లేదని ప్రశ్నించినా.. అక్రమ కేసుల్లో ఇరికించి ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతోందని, రాష్ట్రంలో ఎనుముల రాజ్యాంగం నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఒక వైపు తనను ప్రశ్నిస్తున్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్న ఎనుముల రేవంత్‌రెడ్డి.. తన కుటుంబం ద్వారా రాజ్యాంగ వ్యతిరేక పనులకు దిగుతున్నారని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేకు బదులుగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి తిరుపతిరెడ్డి ఎవరు? ఏ హోదా ఉందని ఆయనకు రెండు కాన్వాయ్‌లు, గన్‌మెన్‌ను ఏర్పాటు చేశారు? కల్యాణలక్ష్మి చెక్కులను ఏ అధికారంతో పంపిణీ చేస్తున్నారు? అని ప్రశ్నించారు. వార్డు సభ్యుడిగా కూడా గెలవని వ్యక్తికి సీఎం స్థాయి అధికారాలు కల్పించడం.. ఎనుముల పాలనలోనే సాధ్యమని విమర్శించారు. కొడంగల్‌లో ప్రొటోకాల్‌తో సంబంధం లేకుండా విచ్చలవిడిగా అధికార దుర్వినియోగం జరుగుతోందని మండిపడ్డారు. భారత రాజ్యాంగం పట్టుకుని తిరిగే రాహుల్‌గాంధీకి రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలియదా? అని నిలదీశారు. రైతు భరోసా విషయంలో చేసిన మోసాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంలో భాగంగానే తనపై అక్రమంగా ఏసీబీ కేసులు పెట్టించారని ధ్వజమెత్తారు. ఎన్ని కుట్రలు చేసినా, అక్రమ కేసులు పెట్టినా భయపడబోనని పేర్కొన్నారు. హామీలు అమలును పట్టించుకోని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టంచేశారు. కాగా, ఏసీబీ విచారణకు కేటీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో తెలంగాణ భవన్‌కు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. విచారణ అనంతరం తిరిగి తెలంగాణ భవన్ చేరుకున్న కేటీఆర్‌ను హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కలిశారు.

చట్టాన్ని పని చేసుకోనివ్వకపోతే లాఠీలకు పని

- దర్యాప్తు సంస్థలకు కేటీఆర్ సహకరించాలి: ఎంపీ అర్వింద్

న్యూఢిల్లీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): చట్టం తన పనిని తాను చేసుకోనివ్వకపోతే లాఠీలు పని చేయాల్సి ఉంటుందని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఫార్ములా ఈ- రేస్ కేసులో కేటీఆర్ చేసింది దొంగతనమని, పైగా న్యాయవాదులు లేకపోతే విచారణకు వెళ్లనని తమాషా చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న చెల్లె కవితనేమో ఈడీ ఇంటికే రావాలని, ఏసీ కిందే విచారణ జరపాలంటూ కోరారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్, ముఖ్యమంత్రి, మంత్రి అనే భ్రమలోంచి బయటకు రావాలన్నారు. తమాషాలు మాని ఏసీబీ దర్యాప్తునకు సహకరించాలని కేటీఆర్‌కు అర్వింద్ ఒక ప్రకటనలో హితవు పలికారు.

సాగు భూములన్నింటికీ రైతు భరోసా హర్షణీయం

- భూములను పక్కాగా నిర్ధారించాలి: రైతు సంఘం

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న భూములన్నింటికీ రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని, అయితే సాగు భూముల గుర్తింపులో శాటిలైట్ సర్వేతోపాటు ఏఈవోల ద్వారా పక్కాగా గుర్తించాలని ప్రభుత్వానికి తెలంగాణ రైతు సంఘం సూచించింది. ఎకరానికి రూ.12 వేల భరోసాను అక్రమాలకు తావు లేకుండా అమలుచేయాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తర్వాత హామీ ప్రకారం ఎకరానికి రూ.15వేలు ఇవ్వాలని రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాగం హేమంతరావు, పశ్యపద్మ సోమవారం కోరారు.

కేటీఆర్‌పై సర్కార్‌ది కక్షపూరిత ధోరణి: కవిత

ఆసిఫాబాద్, ఇంద్రవెల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు రూ.12వేలు ప్రకటించి రైతులను మోసం చేశారని విమర్శించారు. దీనికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యాకర్తలు పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తున్నారని, బీఆర్ఎస్ ధర్నాలకు భయపడిన ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలను అక్రమ కేసులతో వేధిస్తోందన్నారు. ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా జైనూరు మండలంలో లైంగిక వేధింపుల బాధితురాలిని, వాంకిడి మండలంలో పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ అయి మృతిచెందిన విద్యార్థి శైలజ కుటుంబాలను కవిత పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.2లక్షల చొప్పున ఆర్థికసహాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

మాదిగలను ప్రత్యేక గ్రూప్‌లో చేర్చాలి

- 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి: వంగపల్లి శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీ వర్గీకరణకు సానుకూల తీర్పునిచ్చిన నేపథ్యంలో మాదిగలను ప్రత్యేక గ్రూప్‌లో చేర్చి 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ కోరారు. ఈమేరకు జస్టిస్ అక్తర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అత్యంత వెనుకబడిన కులాలకు మొదటి ప్రాధాన్యం కల్పించాలని, మాస్తి, డక్కలి, చెందు మొదలైన కులాలను ఎస్సీ జాబితాలో చేర్చి వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. మాదిగల జనాభా ప్రకారం ప్రత్యేక గ్రూపుగా చేర్చి 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

బిధూరి వ్యాఖ్యలు సంస్కారహీనం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీని అవమానించేలా బీజేపీ నేత రమేష్ బిధూరి చేసిన వ్యాఖ్యలను మంత్రి శ్రీధర్‌బాబు ఖండించారు. బీజేపీకి మహిళలంటే గౌరవంలేదని ఆయన విమర్శించారు. దేశం కోసం గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలను చేసిందని, అలాంటి గొప్ప కుటుంబాలకు చెందిన వ్యక్తుల గురించి సంస్కారహీనంగా మాట్లాడడం ఎంత వరకు సమంజసమో బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. అత్యధిక రికార్డు మెజార్టీతో ప్రజలు ఎన్నుకున్న మహిళా ఎంపీపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్టేనని అన్నారు. మీడియాలో ప్రచారం, సంచలనాల కోసం గాంధీ కుటుంబంపై వివాదస్పద వ్యాఖ్యలు చేయొద్దని హితవు పలికారు.

లొట్టపీసు కేసుకు లాయర్ ఎందుకు?: యెన్నం

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ రేస్ కేసును లొట్టపీసు కేసన్న కేటీఆర్.. విచారణలో లాయర్లను ఎందుకు పెట్టుకున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. విచారణ సమయంలో పక్కన లాయర్ ఉండాలన్నది తప్పనిసరి కాదని, మంత్రిగా పని చేసిన కేటీఆర్‌కు ఆ మాత్రం తెలియదా అని నిలదీశారు. సీఎల్పీ మీడియా హాల్లో సోమవారం మీడియా సమావేశంలో యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఫార్ములా ఈ వ్యవహారంలో రూ. 600 కోట్ల మేరకు కుంభకోణం జరిగిందని ఆరోపించారు. సిరిసిల్లలోనూ భూ కుంభకోణాలు బయటికి వస్తున్నాయన్నారు. కేటీఆర్ స్వయం ప్రకాశిత నేత కాదని, ఆయన ఇతరులపై ఆధారపడి రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. కాగా, ఫార్ములా-ఈ కేసు విచారణను పక్కదారి పట్టించేందుకే బీఆర్ఎస్ పార్టీ.. రైతు ధర్నాలకు పిలుపునిచ్చిందని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. రైతు భరోసా పట్ల అన్నదాతలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు.

సిగ్గు.. సిగ్గు.. సీఎం రేవంత్: హరీశ్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల సమయంలో ఆడబిడ్డలకు ప్రతినెలా డబ్బులిస్తానని ఆశజూపి ఓట్లు వేయించుకున్నావ్.. ఇప్పటివరకు ఇయ్యనేలేదు.. షేమ్.. షేమ్.. రేవంత్‌రెడ్డి.. ఝార్ఖండ్ ముఖ్యమంత్రిని చూసి నేర్చుకో..' అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. '2024 డిసెంబర్ 9న ఝార్ఖండ్ సీఎంగా పగ్గాలు చేపట్టిన హేమంత్ సోరెన్.. నెలరోజులు కాకముందే తన మాట ప్రకారం 'మాయీ సమ్మాన్' పథకం కింద మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తున్నారు. అదే మీరు ఎన్నికల సమయంలో మహాలక్ష్మి పేరిట ప్రతినెలా మహిళలకు రూ.2500ఇస్తామని చెప్పిన మొట్ట మొదటి హామీకే దిక్కులేకుండా పోయింది' అని 'ఎక్స్'లో విమర్శించారు. 125ఏళ్ల పార్టీకి చెందిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం పదవిలోకి వచ్చి 13 నెలలు అవుతున్నా మహాలక్ష్మి పథకం అమలు చేయలేకపోయారని మండిపడ్డారు.

హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట దక్కేనా?

ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌పై నేడు తీర్పు

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-రేస్ కేసులో కేటీఆర్‌కు ఊరట లభిస్తుందా అనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. విదేశీ కంపెనీకి చెల్లింపుల వ్యవహారంలో ప్రభుత్వం తరఫున మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ చేసిన ఫిర్యాదు మేరకు కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు కొట్టేయాలని కోరుతూ కేటీఆర్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌లో వాదనలు పూర్తి కావడంతో డిసెంబరు 31న జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. మంగళవారం ఈ వ్యవహారంపై తీర్పు వెలువడనుంది. ఫార్ములా ఈ ఆపరేషన్స్ అనే విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.46 కోట్లు విదేశీ మారకంలో చెల్లించారని, కేటీఆర్ ఆదేశాల మేరకే ఇదంతా జరిగిందని ఏసీబీ ఆరోపిస్తోంది. ఎన్నికల నియామవళి అమలులో ఉండగా క్యాబినెట్ అనుమతి లేకుండా, పరిపాలనా అనుమతి లేకుండా, రిజర్వు బ్యాంకు అనుమతి తీసుకోకుండా విదేశీ కంపెనీకి విదేశీ మారకంలో చెల్లింపులు చేశారని ఏసీబీ చెబుతోంది. కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో తీర్పు ఇచ్చేంత వరకు ఆయనను అరెస్ట్ చేయరాదని హైకోర్టు ఆదేశించింది. దర్యాప్తు యథావిధిగా చేసుకోవచ్చని ఏసీబీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం వెలువడే తీర్పు ఎలా ఉంటుందో అని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. కేటీఆర్‌కు అనుకూలంగా తీర్పు వచ్చి ఆయనపై కేసు కొట్టేస్తే ప్రభుత్వం ఏంచేస్తుంది? లేదా కేటీఆర్ పిటిషన్‌ను కొట్టేస్తే పోలీసులు ఆయనను అరెస్ట్ చేస్తారా? అని చర్చ జరుగుతోంది. మంగళవారం ఉదయం 10. 30 గంటల నుంచి 11 గంటల మధ్య తీర్పు వెలువడే అవకాశం ఉంది.

ఒంటరిగా రావాల్సిందే!

ఫార్ములా ఈ కేసులో విచారణకు న్యాయవాదులతో వచ్చిన కేటీఆర్.. అనుమతించని ఏసీబీ

- ఏసీబీ కార్యాలయం వద్ద 40 నిమిషాల పాటు హైడ్రామా
- 9న ఒంటరిగా రావాల్సిందేనని కేటీఆర్‌కు మరోసారి నోటీస్


ఏసీబీ కార్యాలయం వద్ద కేటీఆర్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేస్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు న్యాయవాదులతో కలిసి వెళ్లిన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను పోలీస్‌లు ఏసీబీ కార్యాలయంలోకి అనుమతించలేదు. దీంతో ఏసీబీ ప్రధాన కార్యాలయం సమీపంలో కొంత హైడ్రామా చోటు చేసుకుంది. న్యాయవాదులు వెంట ఉంటే విచారణకు అనుమతించబోమని పోలీసులు స్పష్టం చేశారు. పోలీస్‌లపై నమ్మకం లేకే న్యాయవాదులతో కలిసి వచ్చానని కేటీఆర్ బదులిచ్చారు. దాంతో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. చివరకు న్యాయవాదులతో కలిసి విచారణకు అనుమతించేది లేదని ఏసీబీ నుంచి కచ్చితమైన ఆదేశాలు రావడంతో గేటు దగ్గర ఉన్న పోలీసులు కేటీఆర్‌కు అదే విషయాన్ని చెప్పారు. దాంతో ఆయన విచారణకు హాజరు కాకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. తాను చెప్పాలనుకున్నది లిఖిత పూర్వకంగా విచారణాధికారి పేరుతో తయారు చేసిన సమాధాన పత్రాన్ని అందజేసి వెళ్లిపోయారు. ఫార్ములా ఈ కారు రేస్ కేసులో కేటీఆర్ ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రశ్నించేందుకు తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఏసీబీ అధికారులు కేటీఆర్‌కు ఇదివరకు నోటీస్‌లు జారీ చేశారు. విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్ న్యాయవాదులతో కలిసి సోమవారం ఉదయం బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వెళ్లారు. ఏసీబీ కార్యాలయానికి సమీపంలోనే బారికేడ్లు ఏర్పాటు చేసిన హైదరాబాద్ పోలీస్‌లు కేటీఆర్ వాహనంలో న్యాయవాదులు ఉండటంతో లోపలికి అనుమతించలేదు. ఆయన ఒక్కరే లోపలికి వెళ్లాలని స్పష్టం చేశారు. న్యాయవాదులతో కలిసి వెళ్లనిస్తేనే ఏసీబీ అధికారుల ఎదుట హాజరవుతానని కేటీఆర్ బదులిచ్చారు. సిటీ పోలీసులు ఏసీబీ ఉన్నతాధికారులను సంప్రదిస్తుండగా, కేటీఆర్ తన వాహనంలోనే 40 నిమిషాల పాటు ఎదురు చూస్తూ కూర్చున్నారు. న్యాయవాదులతో కలిసి వచ్చేందుకు ఏసీబీ అనుమతి నిరాకరించడంతో తాను చెప్పదలుచుకున్న అంశాన్ని లిఖితపూర్వకంగా దర్యాప్తు అధికారి పేరుతో తయారు చేసిన సమాధాన పత్రాన్ని ఏసీబీ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన ఏసీబీ అదనపు ఎస్పీ మాజిద్ ఖాన్‌కు అందజేసి వెనుదిరిగారు.

ఏం కావాలో అడగండి... సమయం ఇవ్వండి

ఈ కేసులో ఏసీబీకి ఏ పత్రాలు కావాలో స్పష్టంగా చెప్పి, తగిన సమయం ఇవ్వాలని దర్యాప్తు అధికారుల్ని కేటీఆర్ తన లేఖలో కోరారు. ఎఫ్ఐఆర్‌ను హైకోర్టులో సవాలు చేశానని, హైకోర్టు తీర్పును రిజర్వు చేసిందని చెప్పారు. ఈ కేసులో ఏసీబీ ప్రతివాదిగా ఉన్నారని, హైకోర్టు ఏ క్షణమైనా తీర్పును ప్రకటించే అవకాశం ఉందని ప్రస్తావించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఏసీబీ తనకు నోటీసు ఇచ్చిందని గుర్తు చేశారు. కేసుకు సంబంధించిన సమాచారంతో పాటు, పత్రాలను అందివ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారని, ఏ అంశాలపైన సమాచారం కావాలో స్పష్టత ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా తాకు న్యాయబద్ధంగా ఉన్న హక్కుల్ని కాపాడితే పూర్తిగా సహకరిస్తానన్నారు. హైకోర్టు తుది తీర్పు తర్వాత ఈ కేసులో ముందుకు వెళ్లాలని కోరారు.

9న రండి... ఒక్కరే రండి

ఫార్ములా ఈ కారు రేస్ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ మరోసారి నోటీస్‌లు జారీ చేసింది. సోమవారం ఉదయం కేటీఆర్ ఉదంతం తర్వాత న్యాయ నిపుణులతో చర్చించి, సాయంత్రం మరోసారి నోటీస్‌లు జారీ చేశారు. గురువారం 9వ తేదీన విచారణకు రావాలని కోరారు. న్యాయవాదుల్ని అనుమతించేది లేదని అందులో స్పష్టం చేశారు.

ఈడీ విచారణ వాయిదా

ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు హాజరయ్యేందుకు కేటీఆర్ గడువు కోరారు. ఈడీ నోటీసుల మేరకు మంగళవారమే విచారణకు హాజరు కావాల్సి ఉంది. గడువు కోరుతూ కేటీఆర్ సోమవారం సాయంత్రం ఈమెయిల్ పంపించారు. ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని హైకోర్టులో వేసిన కేసులో తీర్పు రిజర్వులో ఉందని ఈడీ దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు తీర్పు వెలువరించే వరకు ఈ అంశంలో తనకు సమయం ఇవ్వాలని ఈడీ అధికారుల్ని కేటీఆర్ కోరారు. దాంతో ఈడీ విచారణను వాయిదా వేసింది. విచారణ తేదీని నిర్ణయించలేదు.

నమ్మకం లేకే న్యాయవాదులతో వచ్చా..

ఏసీబీ అనుమతి కోసం ఎదురు చూస్తున్న సమయంలోనే కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. పోలీస్‌లపై నమ్మకం లేకనే న్యాయవాదులతో కలిసి విచారణకు వచ్చానన్నారు. చట్టాన్ని గౌరవించి ఏసీబీ కార్యాలయానికి వస్తే ప్రభుత్వం తన రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రాజ్యాంగం అమలవుతోందా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఇటీవల పట్నం నరేందర్ రెడ్డిని కూడా ఇలాగే విచారణ పేరుతో పిలిచి అసత్యాలతో కూడిన ప్రకటనను మీడియాకు వదిలారని ఆరోపించారు. తన వెంట న్యాయవాదులు ఉంటే ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. న్యాయవాదుల సహకారం తీసుకునే హక్కు తనకు లేదని ప్రభుత్వం లిఖితపూర్వకంగా రాసివ్వాలని సవాలు విసిరారు. తనను విచారణ పేరుతో ఏసీబీ కార్యాలయంలో ఉంచి, తన ఇంటిపైన ఏసీబీ దాడులు నిర్వహించి, చట్ట వ్యతిరేకమైన వస్తువులు, పత్రాలు నా ఇంట్లో పెట్టి, సోదాల్లో పట్టుబడ్డాయని చెప్పించే కుట్ర రేవంత్‌రెడ్డి చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. సోమవారం రోజు తన మామగారి రెండో సంవత్సరీకం పూజ జరుగుతోందని, ఆ సందర్భంగా సోదాలు చేస్తారనే సమాచారం తనకు ఉందని చెప్పారు. గతంలో దీపావళి చేసుకుంటుంటే కూడా పోలీసులతో సోదాలు చేయించారని వ్యాఖ్యానించారు. ఆ సోదాల్లో డ్రగ్స్ పట్టుబడ్డాయని స్వయంగా శాసనసభ వేదికగా సీఎం అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. తాను ఏ తప్పు చేయనందునే ధైర్యంగా ఏసీబీ విచారణకు వచ్చానన్నారు. రైతు భరోసాలో కోత ద్రోహం నుంచి రైతుల దృష్టిని మళ్లించేందుకు రేవంత్ కుట్ర పన్నారని ఆరోపించారు. ఎన్ని ఎత్తుగడలకు పాల్పడ్డా 420 హామీలను అమలు చేసేదాకా వదిలిపెట్టేది లేదన్నారు. కేసులకు భయపడేది లేదని చెప్పారు. తాను ప్రభుత్వంలో మంత్రిగా నిర్ణయం తీసుకున్నానని, ఏసీబీ అధికారులు తనను అడుగుతున్న సమాచారం మొత్తం ప్రభుత్వం వద్దే ఉందన్నారు. లిఖిత పూర్వకంగా సమాధానం ఇద్దామనుకుంటే కనీసం లోపలికి అనుమతించలేదని చెప్పారు. రాజమౌళిని మించిన సినిమా కథలను పోలీసులు అల్లుతున్నారని ఎద్దేవా చేశారు.

ఆ సంస్థలపై ఫెమా కింద కేసు

ఫార్ములా ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈవో), ఎస్ నెక్ట్స్ జెన్ సంస్థల ఆర్థిక లావాదేవీలపైనా ఈడీ కూపీ లాగుతోంది. ఈ సంస్థలపై విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టం(ఫెమా) కింద మరో కేసు నమోదు చేసేందుకు ఈడీ రంగం సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి ఏసీబీ నుంచి అవసరమైన సమాచారాన్ని ఈడీ అధికారులు సేకరించింది. ఫెమా కింద కేసులు నమోదు చేసి ఆ రెండు సంస్థలకు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న రీజనల్ కార్యాలయాలకు ఈడీ నోటీస్‌లు జారీ చేయనుంది. ఇప్పటి వరకు మనీలాండరింగ్ కోణంలోనే విచారణ జరుగుతోంది. విచారణలో లభించే సమాచారం ఆధారంగా త్వరలో ఫెమా కింద కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

దొంగ ఫైళ్లు పెట్టించి కేటీఆర్‌ను ఇరికించే కుట్ర

- రేవంత్ యత్నం బెడిసికొట్టింది: జగదీశ్‌రెడ్డి
- సర్కారును ప్రశ్నిస్తున్నందుకే కేసు: వేముల

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కక్షపూరితంగా కేటీఆర్‌పై పెట్టిన కేసులో బలం లేదని బీఆర్ఎస్ నేత జగదీశ్‌రెడ్డి అన్నారు. ఏసీబీ అధికారులను కేటీఆర్ ఇంటికి పంపించి.. వారి ద్వారా దొంగ ఫైళ్లను పెట్టించి.. ఎలాగైనా ఆయన్ను కేసులో ఇరికించాలని సీఎం రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్ ఇంటిపై ఏసీబీ సోదాలు చేసి ఏవో ఫైళ్లు దొరికాయని లేనిది ఉన్నట్లు భ్రమింపచేయాలన్న ప్రయత్నం జరుగుతోందన్నారు. 'కేటీఆర్‌పై పనికిమాలిన చెత్త కేసు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రయత్నాలు చేస్తోంది. 'రాజ్యాంగం పట్ల గౌరవంతో కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఏసీబీని ఉసిగొల్పి.. డ్రామా చేయాలనుకున్న రేవంత్‌రెడ్డి ప్రయత్నం బెడిసికొట్టింది. దీంతో ఎన్నికల బాండ్ల విషయాన్ని కొత్తగా కనిపెట్టినట్లుగా సీఎం మీడియాకు లీకులు ఇచ్చారు. ఇందులో కొత్తేముంది..?' అని ప్రశ్నించారు. ఏసీబీ నుంచి కాకుండా మీడియా సంస్థలకు సీఎం ఆఫీసు నుంచే లీకులిచ్చారని ఆరోపించారు. 'మీ పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తే.. నీ పేరు చెప్పకుంటే.. జైల్లో పెడతావా? రేవంత్‌రెడ్డి.. అసలు నువ్వు రాష్ట్రానికి గుర్తుండిపోయేలా ఏమైనా చేస్తేకదా.. నీ పేరు గుర్తుండేది' అంటూ మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఫార్ములా-ఈ కేసులో పారదర్శకంగా విచారణ జరగాలని ప్రభుత్వం కోరుకుంటే కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించాలని, లేదంటే కోర్టు అనుమతితో కేటీఆర్ విచారణకు హాజరవుతారని చెప్పారు. ఫార్ములా-ఈ రేసింగ్‌కు సంబంధించి ఏసీబీ కేసుపై కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో తీర్పు రిజర్వులో ఉండగానే.. ఆయనకు ఏసీబీ నోటీసు ఎందుకు ఇచ్చారని మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక.. దృష్టి మళ్లించేందుకే జనంలో కేటీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు.

ఫార్ములా-ఈలో క్విడ్ ప్రోకో!

(మొదటి పేజీ తరువాయి)

ఈ సంస్థ రూ.41 కోట్ల విరాళాలు ఆ పార్టీకి అందజేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. 2022 ఏప్రిల్ 8న ఒకేరోజు రూ.31 కోట్లు, అక్టోబరు 10న మరో పది కోట్లు గ్రీన్‌కో, అనుబంధ సంస్థలు కలిపి చెల్లించుకున్న విషయాన్ని ప్రస్తావిస్తున్నాయి. విరాళాలు అందజేసిన రెండు నెలల్లోనే గ్రీన్ కో డైరెక్టర్లు అయిన అనిల్ చలమలశెట్టి, మహేష్ కొల్లి కలిసి రాష్ట్రంలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ కోసం అప్పటికప్పుడు ఏస్ నెక్స్ట్‌జెన్ అనే సంస్థను ఏర్పాటు చేయడాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆ తర్వాత అదే సంస్థతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫార్ములా ఈ కార్ల రేసు నిర్వహణకు ఒప్పందం చేసుకోవడం గమనార్హం. గ్రీన్‌కో ఎనర్జీస్‌తో పాటు దాని అనుబంధ కంపెనీలు గ్రీన్‌కో సోలార్ పవర్, గ్రీన్‌కో శ్రీసాయికృష్ణ హైడ్రో ఎనర్జీ, గ్రీన్‌కో రాయల విండ్ పవర్, సనోలా విండ్ ప్రాజెక్ట్, రాయలసీమ విండ్ ఎనర్జీ, ఆస్మాన్ ఎనర్జీ, అనంతపుర విండ్ ఎనర్జీస్, గంగ్‌దారీ హైడ్రోపవర్, సరోజ రెన్యువబుల్స్, శ్రేయాస్ రెన్యువబుల్ ఎనర్జీస్, ఆచింత్య సోలార్ పవర్, పెన్నార్ రెన్యువబుల్స్, సువర్చాస్ సోలార్ పవర్, విశ్వరూప సోలార్ పవర్, సనోలా విండ్ ప్రాజెక్ట్స్, గ్రీన్‌బ్రీత్ సోలార్ పవర్ బీఆర్ఎస్‌కు విరాళాలు ఇచ్చిన సంస్థల్లో ఉన్నాయి. ఒక్కో సంస్థ రూ.కోటి నుంచి నాలుగు కోట్ల వరకు బీఆర్ఎస్‌కు విరాళాలు ఇచ్చాయి. గ్రీన్ కో దాని అనుబంధ సంస్థల ద్వారా విరాళాలుగా ఇచ్చిన రూ.41 కోట్లకు ప్రతిఫలంగానే గ్రీన్‌కో డైరక్టర్లు ప్రారంభించిన ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీకి ఫార్ములా ఈ రేస్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2022లో బీఆర్ఎస్‌కు బాండ్లు అందిన తర్వాతే 2023 ఫిబ్రవరిలో ఫార్ములా ఈ రేసు జరిగిందని గుర్తు చేస్తున్నాయి.

గ్రీన్ కో బాహుబలి సంస్థ

గ్రీన్‌కో ఎనర్జీస్ కంపెనీ ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ కేంద్రంగా 2000 సంవత్సరంలో ఏర్పడింది. చాలా తక్కువ కాలంలోనే భారీ కంపెనీగా ఎదిగింది. అటు వ్యాపార వర్గాల్లో, ఇటు రాజకీయ, సినీ ప్రముఖుల్లో గ్రీన్ కో సుపరిచితమైన పేరు. చలమలశెట్టి అనిల్ గ్రీన్‌కో డైరెక్టర్‌గా ఉన్నపుడు ఆయన సోదరుడు సునీల్ అన్ని రాజకీయ పార్టీలతో సన్నిహిత సంబంధాలను నిర్వహించారు. వ్యాపార సామ్రాజ్యానికి అధిపతిగా పైకి అనిల్ కనిపించినా కంపెనీకి కావాల్సిన అండదండలను రాజకీయ పార్టీల నుంచి సమకూర్చేది సునీల్‌నేనని సమాచారం. సునీల్ అన్ని రాజకీయ పార్టీలకూ సన్నిహితుడే. సునీల్ కాకినాడ లోక్‌సభ నియోజకవర్గంలో 2009లో ప్రజారాజ్యం నుంచి, 2019లో టీడీపీ నుంచి, 2024లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మూడు సార్లు మూడు పార్టీల నుంచి బరిలో దిగి ఓడిపోయినా అసలు లక్ష్యం నెరవేరింది. రాజకీయ సంబంధాలు ఆయనకు వ్యాపార విస్తరణకు ఉపయోగపడ్డాయని అంటారు. గ్రీన్ కో ద్వారా పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి రంగంలో అనేక ప్రాజెక్టులు చేపట్టారు. ప్రస్తుతం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే రూ.25 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ఈ సంస్థ చేతిలో ఉన్నాయి. అనుబంధ సంస్థలు వివిధ రాష్ట్రాల్లో దక్కించుకున్న ప్రాజెక్టులన్నీ కలిపితే సంస్థ పనులు రూ.లక్ష కోట్ల వరకు ఉంటాయని అంచనా. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న గ్రీన్‌కో కంపెనీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్‌తో పాటు 15 రాష్ట్రాల్లో 7.5 గిగావాట్ సామర్థ్యం కలిగిన భారీ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను నిర్వహిస్తోంది. తమిళనాడులో ఏకంగా 33 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్ కేంద్రాలు పెట్టేందుకు ఈ సంస్థ అక్కడి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలులోని పిన్నాపురం వద్ద 1680 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్‌ను నిర్మిస్తోంది. తెలంగాణలో పదేళ్లు ఏలిన బీఆర్ఎస్ ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలున్న గ్రీన్‌కో దేశమంతటా విస్తరించినా రాష్ట్రంలో మాత్రం విస్తరించలేక పోయింది. పదేళ్ల కిందట తెలంగాణలో పవన విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసి, ప్రభుత్వానికి సమర్పించింది. ములుగు జిల్లాలో రూ.18,203 కోట్లతో 3960 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ దీనికి క్లియరెన్స్ ఇవ్వడానికి వీలుగా విచారణ విధి విధానాలను కూడా జారీ చేసింది. ఈ రెండు కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చకుండానే ఆగిపోయాయి.

కాకినాడలోనే 17వేల కోట్ల పెట్టుబడి

కాకినాడలో అమ్మోనియా ఎరువును తయారు చేసే నాగార్జున ఫర్టిలైజర్స్ సంస్థను గతంలో రూ.1700 కోట్లతో కొనుగోలు చేసిన గ్రీన్‌కో అక్కడ ఏఎం గ్రీన్ అమ్మోనియా అనే సంస్థను ఏర్పాటు చేసింది. ఏ అంటే అనిల్, ఎం అంటే మహేష్ కొల్లి. ఆ ప్లాంటు ఉత్పత్తి ప్రక్రియను పూర్తిగా మార్చేశారు. గ్యాస్‌తో కాకుండా హైడ్రోజన్‌తో గ్రీన్ అమ్మోనియాను తయారుచేసే సాంకేతికను ప్రవేశ పెడుతున్నారు. ఇందుకు రూ.12,500 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. ఇక్కడ నీటిలో భారీ ఎలక్ట్రోలైజర్లను పెట్టి, నీటిలోని ఆక్సిజన్‌ను హైడ్రోజన్‌ను విడదీసే మరో ప్లాంటును రూ.2,800 కోట్లతో పెడుతున్నారు. ఇలా విడదీసిన ఆక్సిజన్‌ను వాణిజ్యపరంగా అమ్ముకునేందుకే హైడ్రోజన్‌కు నైట్రోజన్ కలిపి గ్రీన్ అమ్మోనియంను తయారు చేయనున్నారు.

కేటీఆర్ జైలుకెళ్లడం ఖాయం

- బీఆర్ఎస్ శకం ముగిసింది
- సంక్రాంతి తర్వాత నామినేటెడ్ పదవులు: మహేశ్‌గౌడ్
- కేటీఆర్‌ను ఏసీబీ పిలుస్తోందనే రైతుల జపం: సీతక్క


సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్. చిత్రంలో మంత్రి సీతక్క, దీపాదాస్ మున్షీ తదితరులు

ఆదిలాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇక కేటీఆర్ పని అయిపోయిందని.. జైలుకెళ్లడం ఖాయమని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. తొలుత జైలుకు వెళ్లేందుకు సిద్ధమని చెప్పిన ఆయన మళ్లీ పనికి రాని కేసు అన్నారని.. ఏసీబీ నోటీసులు, గవర్నర్ అనుమతి ఇవ్వగానే కోర్టును ఎందుకు ఆశ్రయించారని ప్రశ్నించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. అనంతరం పార్లమెంట్ విస్తృత స్థాయి ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశంలోనూ ప్రసంగించారు. ఇక బీఆర్ఎస్ రాజకీయ శకం ముగిసిందని.. ఆ పార్టీలో కేసీఆర్, కేటీఆర్ మాత్రమే మిగులుతారని జోస్యం చెప్పారు. బీజేపీ చరిత్రను తిరగ రాయడంతో పాటు రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. పార్టీనే నమ్ముకుని పని చేసిన కార్యకర్తలు, నేతలకు ప్రాధాన్యతనిచ్చి సంక్రాంతి తర్వాత అన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులను కేటాయిస్తామని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 90శాతానికి పైగా స్థానాల్లో గెలవాలన్నారు. ఎమ్మెల్సీ కవిత ఏం ముఖం పెట్టుకుని జిల్లాల్లో పర్యటిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబం కల్లిబొల్లి మాటలు చెబుతూ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. వరంగల్ తర్వాత ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టును నిర్మించి తీరుతామని స్పష్టం చేశారు. కేటీఆర్‌ను ఏసీబీ పిలుస్తోంది కాబట్టే బీఆర్ఎస్ నేతలు రైతుల జపం చేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు వారికి బీసీలు, రైతులు కనిపించలేదా అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కొందరు సహకరించకపోవడంతోనే ఓడిపోవాల్సి వచ్చిందన్నారు. నియోజకవర్గ స్థాయి నేతలు అందరినీ కలుపుకొని ముందుకు పోవాలని సూచించారు. నామినేటెడ్ పదవుల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: దీపాదాస్

ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బలంగా కనిపించడం లేదని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలంతా గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కాంగ్రెస్‌కు శక్తిమంతమైన కార్యకర్తలు ఉన్నారని, ఐక్యమత్యంగా పనిచేస్తే కేంద్రంలోనూ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు.

ఔషధ పర్యవేక్షణకు జిల్లాల్లో త్రిసభ్య కమిటీలు

» ఫార్మసీ, ఈ ఔషధి వర్క్‌షాప్‌లో మంత్రి దామోదర



హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తరచూ ఔషధాల కొరత ఉన్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఈ అంశంపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాలోనూ ముగ్గురు సభ్యులతో కమిటీ వేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ కమిటీలో డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, జిల్లాలోని టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ ఉంటారని వెల్లడించారు. అన్ని ఆస్పత్రుల్లో ఔషధాలుండేలా కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్‌డీలో ఫార్మసీ, ఈ-ఔషధి వర్క్ షాపును మంత్రి రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందుల విషయంలో సమస్యలుంటే ఫార్మసిస్టులు కమిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫార్మసిస్టులు, డాక్టర్లు, హాస్పిటల్ సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి జిల్లాలోనూ సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఔషధాల పంపిణీకి వాహనాలు సమకూర్చినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో ఇండెంట్ పెట్టిన ఔషధాలన్నింటినీ ఇస్తున్నప్పటికీ, మందులు లేవని వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం ఏమిటో హాస్పిటల్ సూపరింటెండెంట్లు, ఉన్నతాధికారులు గుర్తించాలని, ఎక్కడైతే నిర్లక్ష్యం జరుగుతుందో అక్కడ సంబంధిత అధికారి, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

26 నుంచి రైతుభరోసా: మంత్రి పొన్నం



అక్కన్నపేట/హుస్నాబాద్, జనవరి6(ఆంధ్రజ్యోతి): జనవరి 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరంలో రూ.25 కోట్లతో చేపట్టే హుస్నాబాద్-రామవరం డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. హుస్నాబాద్‌లోనూ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు ఏడాదికి రెండు దఫాలుగా ఎకరానికి రూ.12వేలు రైతుల అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పారు. గుట్టలు, రాళ్ల రప్పలు, రోడ్లు, నాలా కన్వెన్షన్ ఉన్న భూములకు రైతు భరోసా పథకం వర్తించదని స్పష్టం చేశారు. భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ కానుక కింద రూ.12వేలు అందజేస్తామని తెలిపారు. జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.

సెమీ కండక్టర్ పరిశ్రమలకు హైదరాబాద్ అనుకూలం:మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జనవరి6(ఆంధ్రజ్యోతి): సెమీ కండక్టర్ (చిప్‌ల తయారీ), దాని అనుబంధ పరిశ్రమలకు హైదరాబాద్‌లో అత్యంత అనుకూల వాతావరణం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. సోమవారం సచివాలయంలో పీటీ డబ్ల్యూ గ్రూప్ ఏషియా విభాగం ప్రతినిధులతో మంత్రి సచివాలయంలో మాట్లాడారు. సెమీకండక్టర్ పరిశ్రమకు అవసరమైన విడిభాగాలు, పునర్నిర్మాణం, ఆటోమేషన్, పరికరాలను సరఫరా చేసే ఈ సంస్థకు ప్రాంతీయ కార్యాలయం సింగపూర్‌లో ఉంది. అయితే రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటు చేసే పక్షంలో ప్రభుత్వ విధానాల ప్రకారం రాయితీలు, ప్రోత్సాహకాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి వారికి వివరించారు. రూ. వెయ్యి కోట్ల పెట్టుబడితో ఉత్పాదక కేంద్రం మొదటి దశ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నట్టు పీటీడబ్ల్యూ ఏషియా విభాగం ఎండీ టార్ స్టెన్ సెయ్ ఫ్రైడ్ చెప్పారు. సమావేశంలో సంస్థ స్థానిక భాగస్వామి బార్ ట్రానిక్స్ ఎండీ విద్యాసాగర్ రెడ్డి, సింగపూర్‌కు చెందిన కన్సల్టెంట్ సంస్థ 'టాప్2 పిటిఇ' సీఈఓ రావు పనిదపు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీకి పీవీ స్మారక అవార్డు

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : దివంగత ప్రజాకవి కాళోజీ నారాయణరావుకు పీవీ నరసింహారావు స్మారక అవార్డు-2024ను ప్రకటించినట్లు పీవీ మెమోరియల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. అనిల్‌కుమార్ తెలిపారు. రవీంద్రభారతిలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో కాళోజీ తరఫున కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, రచయిత నలిమెల బాస్కర్ ఈ అవార్డును స్వీకరిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

భూమిలేని 'కూలీ'ల కుటుంబాలు 10 లక్షలు!

» ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ల ప్రాథమిక నివేదిక

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలు 10 లక్షల వరకు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ల నుంచి ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక చేరింది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖ వారం రోజుల్లో లబ్ధిదారుల లెక్కలు తేల్చే అవకాశాలున్నాయి. ఆ తర్వాత ప్రభుత్వం లబ్ధిదారుల జాబితాను వెల్లడించి... ఈనెల 26వ తేదీన వ్యవసాయ కూలీలకు 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 10 లక్షల మంది లబ్ధిదారులుగా తేలితే... ఈ పథకానికి తొలి విడతకు రూ.600 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ఈ నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయనున్నారు. భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం విదితమే! ఈ ఆర్థికసాయాన్ని రెండు విడతలుగా పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాగా ప్రాథమిక నివేదికలు, ఇతరత్రా సమాచారాన్ని క్రోడీకరించి లబ్ధిదారులను గుర్తించే బాధ్యతను ప్రభుత్వం 'సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్' కు అప్పగించింది.

పారిశ్రామిక కారిడార్‌కు భూములిస్తాం

» కలెక్టర్‌ను కలిసిన లగచర్ల రైతులు

దుద్యాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల పరిధిలో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు సర్వే నంబర్ 102లోని అసైన్డ్ భూములు ఇచ్చేందుకు లగచర్ల గ్రామానికి చెందిన 13 మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి భూములు ఇస్తామని లిఖిత పూర్వకంగా తెలిపారు. ఆ వెంటనే పట్టాదారు పాస్‌బుక్‌లను అందించారు.

ఐఏఎంసీకి ఐదు ఎకరాలు కేటాయింపు సబబే

» కేసీఆర్ సర్కారు నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం సమర్థన

» హైకోర్టుకు నివేదిక

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం.. ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కి ఐదు ఎకరాల భూమిని కేటాయించడం కేటాయించడం సరైన నిర్ణయమేనని రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. ప్రైవేటు ట్రస్టు అయిన ఐఏఎంసీకి రాయదుర్గంలో అత్యంత విలువైన ఐదెకరాల భూకి కేటాయించడంతోపాటు, నిర్వహణకు ప్రభుత్వం ఆర్థికసాయం చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ సుజనలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ.. ఐఏఎంసీకి భూకేటాయింపు సరైనదే అని పేర్కొన్నారు. హైదరాబాద్ వంటి నగరంలో వ్యాపారాలను ప్రోత్సహించాలంటే ఐఏఎంసీ వంటి ఆర్బిట్రేషన్ సంస్థలు ఉండాలని తెలిపారు. ఇది ప్రభుత్వం తీసుకున్న విధానపర నిర్ణయమని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేసింది.

రాజీ పడం.. మోదీతో కొట్లాడతాం

హైదరాబాద్ అభివృద్ధికి ఎంఐఎంతో కలిసి నడుస్తాం.. మెట్రో విస్తరణపై ప్రధానితో మాట్లాడా

» పాతబస్తీలో ప్రతి గల్లీ తెలుసు..

» అక్బరుద్దీన్, నేను చిన్ననాటి స్నేహితులం

» జూపార్కు- ఆరాంఘర్ వంతెన ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్



జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్; చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్రమోదీతో కొట్లాడాల్సి వస్తే.. కొట్లాడతానని, అసదుద్దీన్‌తో కలిసి పనిచేయాల్సి వస్తే.. కలిసికట్టుగా పనిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో ఉన్నది బీజేపీ ప్రభుత్వమని, తాను కాంగ్రెస్ సీఎంను అని అనుకుంటే రాష్ట్రానికి కావాల్సిన పనులు జరగవన్నారు. రాష్ట్రానికి వాటాగా దక్కాల్సిన నిధులు సాధించుకోవాలని, పనులు చేయించుకోవాలని, అందుకే తాను అందరినీ కలుస్తానని ప్రకటించారు. ఇదంతా రాష్ట్రం కోసమేనని స్పష్టం చేశారు. సోమవారం జూ పార్కు నుంచి ఆరాంఘర్ వరకు రూ.799 కోట్లతో నాలుగు కిలోమీటర్ల మేర నిర్మించిన వంతెనను మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చర్లపల్లి టర్మినల్ అభివృద్ధి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని, తాను ఎంపీగా ఉన్నప్పుడు ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించానని అన్నారు. ముఖ్యమంత్రి అయ్యాక ఆస్తుల సేకరణ, ఇతరత్రా సమస్యలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్ణయాలు తీసుకొని టర్మినల్ పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. "చర్లపల్లి టర్మినల్ వర్చువల్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోదీతో మాట్లాడాను. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్‌లో మెట్రోరైల్ నిర్మాణం మొదలైందని, తెలంగాణ ఏర్పాటు అనంతరం పదేళ్లపాటు గత ప్రభుత్వం ప్రాజెక్టు విస్తరణకు ప్రయత్నించలేదని చెప్పాను. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపామని, కేంద్ర మంత్రివర్గం ఆమోదించి విస్తరణకు అనుమతి నివ్వాలని, అవసరమైన నిధులూ కేటాయించాలని కోరాను" అని రేవంత్ వివరించారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు..

మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్ తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు వెంట రీజనల్ రింగ్ రైల్ నిర్మాణానికీ సహకరించాల్సిందిగా కోరానన్నారు. ఇవన్నీ జరిగితే ఢిల్లీ, గురుగ్రామ్, హరియాణా కలిపినా.. తెలంగాణ అభివృద్ధితో పోలిస్తే తక్కువే అవుతుందన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేస్తామని, తెలంగాణ ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని వెళ్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి కాంగ్రెస్, ఎంఐఎం అన్నదమ్ముల్లా కలిసి పని చేస్తాయని ఉద్ఘాటించారు. రాష్ట్రం కోసం కేంద్రంతో కొట్లాడే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఇక నగరంలో అతి పొడవైన పీవీఎన్ఆర్ వంతెనను వైఎస్ఆర్ హయాంలో అందుబాటులోకి తీసుకువచ్చామని, ఇప్పుడు నాలుగు కిలోమీటర్ల రెండో పెద్ద వంతెనను ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. రహదారుల విస్తరణ, మెట్రో నిర్మాణం, వంతెనలు, ఎస్టీపీలు, మీరాలం చెరువుపై కేబుల్ వంతెన నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తామని, పనులు చేసే బాధ్యత ఇక్కడి ప్రజాప్రతినిధులదేనని అన్నారు. 1908లో వరదలు వచ్చినప్పుడు.. మూసీ, ఈసా నదులు నిర్మించి నగరంలో వరద ప్రవాహ వ్యవస్థ మెరుగుదుల, తాగునీటి సౌకర్యం కల్పించారని, చెరువులు, తోటలతో గతంలో చేసిన అభివృద్ధిని కాపాడుకొని ఉంటే.. ప్రపంచంలో హైదరాబాద్‌తో పోటీ పడే నగరమే ఉండేది కాదన్నారు.

వంతెనకు మన్మోహన్ పేరు..

జూపార్కు- ఆరాంఘర్ వంతెనకు దివంగత ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరు పెడుతున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. పీవీ హయాంలో ఆర్థిక మంత్రిగా, పదేళ్ల ప్రధాన మంత్రిగా దేశ కీర్తిప్రతిష్ఠలు ప్రపంచానికి చాటిన మహనీయుడి సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించారు.

ప్రతి గల్లీ తెలుసు..

"ఇది ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ. నగరాభివృద్ధికి ఏం చేయాలన్న దానిపై 11 లేదా 12న ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సచివాలయంలో సమావేశం నిర్వహిస్తాం." సీఎం రేవంత్ తెలిపారు. వారంలో గోషామహల్ మైదానంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. ప్రస్తుతం దుర్గం చెరువుపై కేబుల్ వంతెన చూసేందుకు వెళ్తున్నారని, రెండేళ్లలో మీర్ ఆలం ట్యాంక్‌పై కేబుల్ బ్రిడ్జి చూసేందుకు వస్తారని అన్నారు. "సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట మీదుగా మా ఊరికి వెళ్తుంటా. ఇక్కడి గల్లీ గల్లీ నాకు తెలుసు. పాతబస్తీ అభివృద్ధి కోసం చేపడుతున్న చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు, మెట్రో, రోడ్ల విస్తరణకు అవసరమైన నిధులు కేటాయిస్తాం. బడే భాయ్, చోటా భాయ్.. ఇద్దరూ పెద్ద జాబితాను నా ముందుంచారు. వాటన్నింటినీ మా శ్రీధర్‌బాబు రాసుకున్నారు. సాధ్యమైనంత మేర పనులు చేసేందుకు కృషి చేస్తాం" అని సీఎం చెప్పారు. అక్బరుద్దీన్, తాను చిన్ననాటి స్నేహితులమని, ఉర్దూ గల్లీలో ఇద్దరం కలిసి తిరిగే వాళ్లమన్నారు. ఎంఐఎం ప్రతిపక్ష నేత అవుతానని అక్బర్, సీఎంను అవుతానని తాను అనుకోలేదని రేవంత్ గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

సంక్రాంతి లోపే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హనుమకొండలో 50ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభం



వరంగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్లను సంక్రాంతి లోపు మంజూరు చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఈ ఏడాది తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఇదివరకు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోనివారు ఉంటే, మండల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. తొలివిడతలో ఇళ్లు రాకుంటే ఆందోళన చెందవద్దన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో గృహ నిర్మాణాలపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. తర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. రాబోయే నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టిందని పొంగులేటి విమర్శించారు. నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జనవరి చివరి నాటికి పంపిణీ చేస్తామన్నారు. నిర్మాణం పూర్తి కాని ఇళ్లను పూర్తి చేసి ఇస్తామన్నారు. కాగా, జనవరి 26 నుంచి రైతు భరోసా కింద ప్రతీ సంవత్సరం ఒక్కో ఎకరానికి రూ.12వేల పెట్టుబడి సాయాన్ని అందిస్తామన్నారు. సాగు చేసే భూములకే రైతు భరోసా వర్తిస్తుందని, రియల్ ఎస్టేట్ భూములకు పెట్టుబడి సాయం ఇవ్వబోమని స్పష్టం చేశారు. కేసీఆర్ 200 ఎకరాల్లో వ్యవసాయం చేస్తే.. ఆయనకు కూడా 200 ఎకరాలకు రైతు భరోసా సాయం అందుతుందని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. అలాగే భూమిలేని పేదలకు కూడా ఏటా రూ.12 వేల సాయం అందిస్తామని తెలిపారు. అర్హులైన పేదలకు జనవరి 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని పొంగులేటి చెప్పారు. కాగా, హనుమకొండలో 50 ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను పొంగులేటి ఈ సందర్భంగా ప్రారంభించారు.

ఇంకా ఎందరు జైలుకు వెళ్తారో!

» ప్రతి నేత జైలుకు వెళ్తారు.. వెళ్లాలి

» వెళ్లినప్పుడే వారికి కష్టాలు తెలుస్తాయి

» జైల్లో తనకు వండి పెట్టిన వ్యక్తిని సీఎం రేవంత్ ఇప్పటికీ మర్చిపోలేదు

» నేనూ 50 రోజులు జైలులో ఉన్నా

» మెట్రో కోసం పాతబస్తీ ఎదురుచూపులు

» గత సీఎంలు దీన్ని పట్టించుకోలేదు

» రేవంత్ మాత్రమే హామీని నెరవేర్చారు

» కాంగ్రెస్ సర్కార్‌ను పాతబస్తీ గుండెల్లో పెట్టుకుంటుంది: అసదుద్దీన్ ఒవైసీ

మదీనా/హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 'రాజకీయ నాయకులు జైలుకు వెళ్తారు. వెళ్లాలి కూడా. ఇందులో ద్వంద్వార్థం లేదు. నేనూ చంద్రబాబు హయాం(1998)లో 50 రోజులు జైలులో ఉన్నా. ప్రతి రాజకీయ నేత ఏదో సందర్భంలో జైలుకు వెళ్తాడు. వెళ్లినప్పుడే కష్టాలు తెలుస్తాయి. ఇంకా ఎంత మంది వెళ్తారో తెలియదు' అని మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ ఎవరినీ మర్చిపోయే వ్యక్తి కాదని, జైలులో తనకు వండి పెట్టిన వ్యక్తితో ఫొటో తీసుకున్న విషయాన్ని ఇటీవల ఒక మీడియా ప్రతినిధి తనతో చెప్పారని పేర్కొన్నారు. జైలులో వెంట ఉన్న వ్యక్తినే రేవంత్ మరవలేదని, రాజకీయ నేతలు అలాగే ఉండాలని వ్యాఖ్యానించారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో కారిడార్ నిర్మాణంలో ఆస్తులను కోల్పోతున్న నిర్వాసితులకు సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో చెక్కుల పంపిణీ, జూపార్కు-ఆరాంఘర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో అసదుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో రైలు కోసం పాతబస్తీవాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు మెట్రో ఏర్పాటుకు ప్రణాళికా వేసినా కుదరలేదని, వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడూ ఆలస్యమైందని గుర్తు చేశారు. ఆ తర్వాత సీఎంలుగా చేసిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిలను అడిగినా పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు సీఎంగా ఉన్న కేసీఆర్‌ను కోరినా ఫలితం దక్కలేదని చెప్పారు. ఒక్క రేవంత్‌రెడ్డి మాత్రమే పాతబస్తీకి మెట్రో ఆవశ్యకతను గుర్తించారని వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు ఫలక్‌నుమాలో ఓల్డ్‌సిటీ మెట్రో పనులకు శంకుస్థాపన చేశారని, దీన్ని పూర్తి చేస్తే పాతబస్తీ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకుంటారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ లాల్‌దర్వాజ మహంకాళి ఆలయ అభివృద్ధి కోసం గత ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసినా.. విడుదల కాలేదని గుర్తు చేశారు.

జంక్షన్‌గా చాంద్రాయణగుట్ట:ఎన్వీఎస్ రెడ్డి

మొదటి దశలోని అమీర్‌పేట్, జేబీఎస్ ఇంటర్ చేంజ్ స్టేషన్ల మాదిరిగా చాంద్రాయణగుట్ట స్టేషన్‌ను జంక్షన్‌గా తీర్చిదిద్దుతామని హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. పాతబస్తీలో మెట్రో రైల్ కారిడార్ కోసం భూములను ఇచ్చేందుకు చాలా మంది స్వచ్ఛందంగా వస్తున్నారని, గజానికి రూ.81వేల పరిహారం చెల్లిస్తున్నామని వెల్లడించారు. రూ.2,741 కోట్ల వ్యయంతో పనులు చేస్తున్నామని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, నిర్మాణ ఖర్చులన్నీ కలుపుకొని ఒక్కొక్కరికి రూ.లక్ష వరకు పరిహారం అందుతుందన్నారు. మెట్రో కారిడార్‌లో ఆస్తులు కోల్పోతున్న 1100 మందిలో ఇప్పటివరకు 169 మంది సమ్మతి పత్రాలు అందజేయగా.. తొలివిడతగా 41 మందికి రూ.20 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు.

సాగు భూమికి రైతు భరోసా ఇస్తామంటే ఎందుకు కడుపు మంట?

» రైతు భరోసాకు ఎలాంటి కోతలు పెట్టడం లేదు

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సాగు భూములకు రైతుభరోసా ఇస్తామంటే ప్రతిపక్ష పార్టీ నాయకులకు ఎందుకు కడుపు మండుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. కొన్ని పత్రికలు, కొందరు ప్రతిపక్ష నాయకులు ప్రచారం చేసినట్లుగా రైతుభరోసా అమలుకు ఎలాంటి కోతలు పెట్టడంలేదని, ప్రభుత్వ ప్రకటన చూసి మింగలేక, కక్కలేక నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఓ ప్రకటనలో విమర్శించారు. మొదటి పంటకాలంలోనే 25,35,963 మంది రైతులకు రూ.20,617 కోట్లు మాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్నే వేలెత్తి చూపుతారా? అని ఆయన ధ్వజమెత్తారు. రైతుకూలీలకు రూ.12 వేలు ప్రకటించడం ద్వారా ప్రభుత్వం అన్నివర్గాలకు ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోందన్నారు. మొదటి ఏడాదిలో ఉచిత విద్యుత్‌కు రూ.10,444 కోట్లు, పంటల కొనుగోళ్లకు రూ.12,413 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని, రైతుల ఖాతాల్లోకి నేరుగా రూ.28,833 కోట్ల నగదు బదిలీ చేసినట్టు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ఇతర పథకాలకు రూ.1,965 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పథకాన్ని సక్రమంగా అమలుచేయని విషయం రాష్ట్ర రైతులందరికీ తెలుసన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని బీజేపీ ఎన్నికల్లో హామీ ఇచ్చిందని, కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ ఇప్పటికీ ఆ ఊసెత్తటంలేదన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలోనే 35 శాతం నిధులను వ్యవసాయరంగానికి కేటాయించింది. రైతు సంక్షేమానికి ఏడాదిలో రూ.63,808 కోట్లు ఖర్చు చేసింది. 41.03 లక్షల మంది రైతులకు రూ.1433.33 కోట్లతో రైతు బీమా పథకం అమలుచేస్తోంది. సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తోంది. ఇప్పటివరకు రైతులకు రూ.1,108 కోట్లు చెల్లించింది. సోయాబీన్ సేకరణలో దేశంలో అగ్రస్థానంలో ఉన్నాం. ముడి పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని పెంచేందుకు కేంద్రంపై ఒత్తిడి చేయడంతో గెలల ధర రూ.14,392 నుంచి రూ.20,413కు పెరిగింది' అని తుమ్మల తెలిపారు. అతి త్వరలో రంగారెడ్డి జిల్లా రైతులకే కాకుండా రాష్ట్ర అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో రూ.2,000 కోట్లతో కోహెడలో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తామని తుమ్మల వెల్లడించారు.

22న కేసీఆర్ విచారణ..!

» 23, 24 తేదీల్లో హరీశ్‌రావు, ఈటల కూడా



హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ వైఫల్యాలతోపాటు ఆర్థిక అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఈనెల 22వ తేదీన మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించాలని యోచిస్తోంది. ఈనెల 17న జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు రానున్నారు. 18న విచారణ ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. 20, 21వ తేదీల్లో.. అధికారుల క్రాస్‌ఎగ్జామినేషన్ చేయనున్నారు. 22వ తేదీన విచారణకు హాజరవ్వాల్సిందిగా మాజీ కేసీఆర్‌కు సమన్లు పంపనున్నట్లు సమాచారం. ఒకవేళ కేసీఆర్ తాను నేరుగా రాలేనని, వర్చువల్‌గా హాజరవుతానని కోరినా.. కమిషన్ దానికి సమ్మతించే అవకాశాలున్నాయి. స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మాజీ ఎస్ఈ మురళీకృష్ణ అమెరికాలో ఉండగా.. ఆయనను కూడా వర్చువల్‌గా విచారించిన విషయం తెలిసిందే..! ఒకవేళ కేసీఆర్ అనారోగ్య సమస్యలను కారణంగా చెబుతూ.. లేఖను రాసినా, దాన్ని ప్రామాణికంగా చేసుకుని, విచారణను కొనసాగించే అవకాశాలున్నట్లు సమాచారం. విద్యుత్తు విచారణ కమిషన్ కూడా ఇదే విధానాన్ని అవలంబించింది. జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ రాసిన లేఖనే ఆయన అభిప్రాయంగా పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ మదన్ భీంరావు లోకూర్ ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కాగా.. జస్టిస్ ఘోష్ కమిషన్ కాళేశ్వరం విషయంలో ఈనెల 23న మాజీ మంత్రి హరీశ్‌రావును, 24న ఆర్థిక శాఖ మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను విచారించే అవకాశాలున్నాయి. వీరిద్దరూ కూడా క్రాస్ ఎగ్జామినేషన్‌కు కచ్చితంగా హాజరు అవుతారని కమిషన్ భావిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని హెడ్‌వర్క్‌లతోపాటు ఇతర ప్రధాన పనులు జరిగినప్పుడు ఈటల బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఆయనను బీఆర్ఎస్ నుంచి పొమ్మనలేక పొగబెట్టారని, ఈటలను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని కమిషన్ భావిస్తోంది. ఈటల సంచలన విషయాలను వెల్లడించే అవకాశాలున్నట్లు రాజకీయ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. కాగా.. 17న హైదరాబాద్ రానున్న జస్టిస్ పీసీఘోష్.. నెలరోజుల పాటు ఇక్కడే బస చేస్తారని సమాచారం. ఫిబ్రవరి నెలాఖరులోగా ఆయన ప్రభుత్వానికి నివేదికను సమర్పించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

మేడిగడ్డ ఇంజనీర్లపై చర్యలు

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయం తెలిసిందే..! ఆ బ్యారేజీ నిర్మాణం జరగకున్నా.. పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రం ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతిరావు, ఆ పత్రంపై కౌంటర్ సంతకం చేసిన ఎస్ఈ, ప్రస్తుత మహబూబ్‌నగర్ చీఫ్ ఇంజనీర్ బి.రమణారెడ్డిపై ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసింది. కమిషన్ విచారణలో భాగంగా సర్టిఫికెట్లు జారీ చేసిన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారని ఇదివరకే ప్రశ్నించింది. దీంతో.. ఆ ఇద్దరు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ ప్రభుత్వానికి లేఖ రాయడం.. అధికారుల వివరాలన్నీ తీసుకుని.. అభియోగాల నమోదుచేస్తూ నీటిపారుదల శాఖ ఇటీవలే జీవోలను జారీ చేసింది. 17వ తేదీన హైదరాబాద్‌కు రానున్న కమిషన్‌కు అధికారులు ఈ పరిణామాలను నివేదించే అవకాశాలున్నాయి.

కోహీర్ @ 8.1 డిగ్రీలు

» సిర్పూర్ (యూ)లో 8.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

» వరుసగా ఆరోరోజు పలు జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

కోహీర్/ ఆసిఫాబాద్/ సిరిసిల్ల/ ఆదిలాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గడం లేదు. పలు జిల్లాల్లో వరుసగా ఆరో రోజూ సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో సోమవారం ఉదయం 8.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 8.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణి మండలం గిన్నెధరిలో 9.1, కెరమెరిలో 10.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో 11 డిగ్రీలు, తంగళ్లపల్లి, బోయినపల్లిలో 12.6, రుద్రంగి, ఇల్లంతకుంటలో 13 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో 8.9, బోథ్‌లో 9.5, బేలలో 9.8, ఉట్నూర్‌లో 11.0, తలమడుగులో 11.7, మావలలో 12.1, ఇంద్రవెల్లిలో 13.7, గుడిహత్నూర్‌లో 14.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రతకు ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఉదయం వేళ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి వరకు రాష్ట్రంలో చలి ప్రభావం తీవ్రంగానే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

సాగుభూముల సర్వే ఎలా చేద్దాం?

» నేడు ఎంసీహెచ్ఆర్డీలో 4 జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26 నుంచి విడతల వారీగా రైతు భరోసా సొమ్ము చెల్లించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఈ లోపే సాగుభూముల సర్వే చేపట్టేందుకు సన్నద్ధమైంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మంగళవారం రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో సమావేశం ఏర్పాటు చేశారు. ఎంసీహెచ్ఆర్డీలో నిర్వహించే ఈ సమావేశానికి రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మెదక్ జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ), ఏడీ సర్వే, ఏడీ వ్యవసాయం, తహసీల్దార్లు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు హాజరుకావాలని సోమవారం రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ సర్క్యులర్ పంపారు. సమావేశంలో సాగు విస్తీర్ణంపై ఏ తరహా సర్వే చేపట్టాలనేదానిపై అధికారుల నుంచి వివరాలు సేకరించనున్నట్లు తెలిసింది.



ద వైర్ తెలుగు న్యూస్ పోర్టల్ ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న సీనియర్ జర్నలిస్టు సంజయ్‌బారు

ద వైర్ తెలుగు న్యూస్ పోర్టల్ ఆవిష్కరణ

బర్కత్‌పుర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ద వైర్ తెలుగు న్యూస్ పోర్టల్ సోమవారం ప్రారంభమైంది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆ న్యూస్ పోర్టల్‌ను సీనియర్ జర్నలిస్టు సంజయ్‌బారు ఆవిష్కరించారు. రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఘంటా చక్రపాణి, తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

బాలికకు కిమ్స్ వైద్యుల అరుదైన సర్జరీ

- గుండె గదులకు రంధ్రం.. గుండె, ఊపిరితిత్తుల మధ్య కణితికి ఆపరేషన్
- తప్పిన ప్రాణాపాయం.. 5 రోజుల్లో డిశ్చార్జి

హైదరాబాద్ సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గుండె, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఓ పదిహేనేళ్ల బాలికకు కిమ్స్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయం నుంచి తప్పించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కూలి పని చేసుకునే దంపతుల కుమార్తెకు పుట్టుకతోనే గుండె సంబంధిత సమస్యలు ఉన్నాయి. అయితే ఈ విషయం తల్లిదండ్రులకు తెలియదు. ఇటీవల తీవ్ర ఆయాసంతో బాధపడుతున్న బాలికను కొండాపూర్‌లోని కిమ్స్‌కు తీసుకువచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు.. గుండె గదులకు రంధ్రంతో పాటు గుండె-ఊపిరితిత్తుల మధ్యలో కణితి ఏర్పడిందన్నారు. కణితి అప్పటికే గుండెపై పొరను కప్పేయడంతోపాటు, కొంతవరకు ఊపిరితిత్తులకు కూడా అతుక్కుపోయిందని గుర్తించారు. ఈ క్రమంలోనే ఆమెకు అక్కడి వైద్యులు నిసర్గ, సి.రోహన్‌రెడ్డి తదితరులు సర్జరీ నిర్వహించారు. ముందుగా గుండె పొరపైనున్న కణితిని తొలగించి.. గుండె గదుల మధ్య గోడకు ఉన్న పెద్ద రంధ్రాన్ని కూడా పూడ్చేసినట్లు తెలిపారు. త్వరగానే కోలుకోవడంతో శస్త్రచికిత్స చేసిన ఐదు రోజులకే ఆమెను డిశ్చార్జి చేశామని వివరించారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి



వెంకటేశ్ (ఫైల్)

మహబూబ్‌నగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి సిబ్బంది సీపీఆర్ చేస్తూ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. సీసీకుంటకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్(45) మహబూబ్‌నగర్‌లోని మర్లులో నివసిస్తూ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం జిల్లా జైలులో ఉన్న ఖైదీలను కోర్టులో హాజరుపరిచి తిరిగి వారిని జైలు వద్దకు తీసుకెళ్ళారు. జైలు వద్దకు రాగానే వెంకటేశ్‌కు కొద్దిగా గుండెపోటు ప్రారంభమైంది. నొప్పితో కుప్పకూలిపోయిన ఆయనకు వెంటనే జైలు సిబ్బంది సీపీఆర్ చేస్తూ వాహనంలో జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్ళారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మరణించాడు.

పీవీ సాహితీ వ్యక్తిత్వం గొప్పది

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ



న్యూఢిల్లీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు సాహితీ వ్యక్తిత్వం ఘనమైనదని, ఆయన రాజకీయాల్లో కాకుండా సాహిత్యంలో కొనసాగి ఉంటే ఇంకా గొప్ప రచనలు వచ్చేవని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ అన్నారు. ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు పీవీ సాహిత్య జీవితంపై తాను రచించిన పుస్తకాన్ని సోమవారం తనకు బహూకరించిన సందర్భంగా జస్టిస్ నరసింహ ఈమేరకు వ్యాఖ్యానించారు. పీవీ సాహిత్య జీవితంపై కేంద్ర సాహిత్య అకాడమీ పుస్తకాన్ని ప్రచురించినందుకు ఆయన అకాడమీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు, రచయిత కృష్ణారావును అభినందించారు.

లగచర్ల ఘటనలో ముగిసిన సురేశ్‌రాజ్ కస్టడీ

బొంరాస్‌పేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌పై దాడికి సంబంధించి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లగచర్ల ఘటనలో ఏ2 నిందితుడు సురేశ్ రాజ్ మూడు రోజుల పోలీసు కస్టడీ సోమవారంతో ముగిసింది. వికారాబాద్‌లోని పోలీసు శిక్షణా కేంద్రంలో సురేశ్ రాజ్‌తో పాటు మరో నిందితుడు శివకుమార్‌ను పోలీసులు విచారించారు. శివకుమార్ రెండు రోజుల కస్టడీ ఆదివారం ముగియడంతో అతన్ని చంచల్‌గూడ జైలుకు, ఏ-2 సురేశ్‌రాజ్ కస్టడీ సోమవారం ముగియడంతో అతన్ని చర్లపల్లి జైలుకు తరలించినట్లు బొంరాస్‌పేట్ ఎస్సై తెలిపారు. కాగా, ఈ విచారణలో చాలా విషయాలు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. మరిన్ని వివరాల కోసం పోలీసులు మరికొంత మంది నిందితులను విచారించనున్నట్లు తెలిసింది. అవసరమైతే మరోసారి సురేశ్‌రాజ్‌ను తమ కస్టడీలోకి తీసుకొని పోలీసులు విచారించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



ఉప్పల్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి అతని కొడుకుతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్న ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి మాధవి

'మందు తాగి బండి నడపనని ప్రామిస్ చెయ్ నాన్న'

- డ్రంకెన్ డ్రైవ్‌లో చిక్కిన వ్యక్తికి కొడుకుతో కౌన్సెలింగ్

ఉప్పల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): "నాన్నా నువ్వు నాకు కావాలి. నువ్వు మందు తాగి బండి నడపనని నాకు ప్రామిస్ చెయ్" అని డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి అతని కుమారుడితోనే కౌన్సెలింగ్ ఇప్పించి వార్తల్లో నిలిచారు ఉప్పల్ ట్రాఫిక్ ఎస్సై లక్ష్మీమాధవి. దీంతో ఆ తండ్రి కొడుకును హత్తుకొని ముద్దిచ్చి అతన్ని తీసుకొని వెళ్లిపోయాడు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కొందరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తీరును ప్రశంసిస్తుండగా, మరి కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ట్రాఫిక్ రూల్స్‌ను ఉల్లంఘిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం శిక్షలు అమలు చేయాలేగానీ, ఇష్టారాజ్యంగా సొంత రాజ్యాంగం ప్రకారం శిక్షలు వేయడం సరైంది కాదని అంటున్నారు.

వికసిత్ భారత్‌లో

రైల్వేల అభివృద్ధి కీలకం

మౌలిక సౌకర్యాలను ఆధునీకరిస్తున్నాం.. ప్రయాణికులకు అధునాతన సదుపాయాలు కల్పిస్తున్నాం

- వారి ఆలోచనలకు అనుగుణంగా పనిచేస్తున్నాం
- 100% రైల్వేలైన్ల విద్యుదీకరణకు చేరుకోబోతున్నాం
- దేశంలో త్వరలోనే బుల్లెట్ రైలు పరుగులు తీస్తుంది
- రైల్వే ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ



ముస్తాబైన చర్లపల్లి టెర్మినల్

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సంకల్పాన్ని నెరవేర్చుకోవడంలో భారతీయ రైల్వేల అభివృద్ధి కీలకమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. నాలుగు అంశాల ఆధారంగా రైల్వేల అభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్నట్లు తెలిపారు. రైల్వే మౌలిక సౌకర్యాల ఆధునికీకరణ, ప్రయాణికులకు అధునాతన సదుపాయాల కల్పన, దేశంలో మూలమూలకూ రైల్వే కనెక్టివిటీ కల్పించడం, ఉద్యోగ కల్పన, పరిశ్రమలకు అండగా నిలవడంలో రైల్వేలకూ ప్రాధాన్యం కల్పించడం వంటి అంశాల ఆధారంగా భారతీయ రైల్వేల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. సోమవారం తెలంగాణలోని చర్లపల్లి రైల్వే టెర్మినల్‌తోపాటు జమ్మూ రైల్వే డివిజన్‌ను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. రాయగడ రైల్వే డివిజన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' మంత్రం అమల్లో కేంద్ర ప్రభుత్వం విశ్వాసపూరితంగా ముందుకెళ్తోందని చెప్పారు. పదేళ్లుగా దేశంలో రైల్వేల పురోగతి వేగవంతంగా జరుగుతోందన్నారు. 21వ శతాబ్దంలో అవసరమైన మౌలికవసతుల కల్పన జరుగుతోందని, కొత్త ఉపాధి కల్పన కూడా పెరుగుతుందని చెప్పారు. వందే భారత్, అమృత్ భారత్, నమో భారత్ రైళ్లు.. భారతదేశానికి కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయని వివరించారు. సుదూర ప్రయాణాలను సైతం తక్కువ సమయంలో పూర్తిచేసే ఆలోచనతో ప్రజలు ఉన్నారని, వారి ఆలోచనలకు అనుగుణంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైలు.. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడం చూసి చాలా సంతోషం కలిగిందని చెప్పారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, భారతదేశంలో బుల్లెట్ రైలు పరుగులు తీసే రోజు ఎంతో దూరంలో లేదని అన్నారు.

వంద శాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ..

2014 వరకు దేశంలో 35 శాతమే రైల్వేలైన్ల విద్యుదీకరణ జరిగిందని, ప్రస్తుతం వంద శాతం విద్యుదీకరణకు చేరుకోబోతున్నామని ప్రధాని మోదీ తెలిపారు. దేశంలో వెయ్యి కిలోమీటర్లకు పైగా మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. 30 వేల కిలోమీటర్ల కంటే ఎక్కువ కొత్త లైన్లు వేశామని, వేల సంఖ్యలో ఆర్‌యూబీ, ఆర్‌వోబీల నిర్మాణం పూర్తి చేశామని వెల్లడించారు. డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్స్‌ను నిర్మిస్తున్నామని, వీటి ద్వారా సాధారణ ట్రాక్‌లపై ఒత్తిడి తగ్గి, ప్రయాణికుల ప్రయాణ సమయం తగ్గేందుకు వీలవుతుందన్నారు. జమ్ము డివిజన్ ద్వారా.. ఆ రాష్ట్రంతో పాటు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లోని కొన్ని ప్రాంతాలు, లేహ్ లద్దాఖ్ ప్రాంతాల ప్రజలకు లాభం చేకూరుతుందని చెప్పారు. ఒడిసాకు సముద్ర తీరంతోపాటు.. విస్తృతమైన ఖనిజాల అవకాశాలున్నాయని, అందుకోసం అక్కడ రైల్వే అనుసంధానానికి సంబంధించి రూ.70 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయని అన్నారు. 2014లో దేశం మొత్తమ్మీద 74 విమానాశ్రయాలుంటే.. ఇప్పుడు ఆ సంఖ్య 150కు చేరిందని, అప్పుడు నాలుగు నగరాల్లో మెట్రో ఉంటే, ఇప్పుడు 17 నగరాల్లో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయని వివరించారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రుల సంవాదం

టెర్మినల్ అప్రోచ్ రోడ్డుపై..



- గ్రాంటు ఇవ్వండి.. కేంద్రానికి మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి
- మీదే బాధ్యత: కేంద్ర మంత్రి సోమన్న
- రాష్ట్రం పెద్ద మనసుతో పనులు చేపట్టాలి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి టెర్మినల్‌కు అప్రోచ్ రోడ్డు నిర్మాణం కేంద్ర, రాష్ట్ర మంత్రుల మధ్య సంవాదానికి దారితీసింది. ఈ రోడ్డు నిర్మాణ బాధ్యత మీదంటే.. మీదే అన్నట్లుగా వాగ్వాదం సాగింది. రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న, ఒకవైపు రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబుకు కేంద్ర వైఖరి స్పష్టం చేస్తూనే మరోవైపు రాష్ట్రం నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కిషన్‌రెడ్డి భుజాలపై భారం పెట్టారు. తొలుత శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, అప్రోచ్‌రోడ్డుకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ రోడ్డు అభివృద్ధికి కేంద్రం నిధులివ్వాలని కోరారు. సమీకృత ఎయిర్‌పోర్టు తరహాలో టెర్మినల్ రూపొందించినందున అప్రోచ్‌రోడ్డు కూడా ఆ స్థాయిలో ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇందుకుగాను కేంద్రం కొంత గ్రాంటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై, కేంద్ర మంత్రి సోమన్న స్పందిస్తూ, టెర్మినల్ అప్రోచ్ రోడ్డు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పారు. కర్ణాటక నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న తాను ఏడుసార్లు ఎమ్మెల్యేగా చేశానని, ఆరుసార్లు మంత్రిగా ఉన్నానని, రాష్ట్ర ప్రభుత్వ పల్స్ ఏమిటో తనకు తెలుసునని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కూడా విశ్వేశ్వరయ్య టెర్మినల్‌కు సంబంధించి ఇలాంటి పరిస్థితే ఏర్పడితే, తాను సీఎం సిద్దరామయ్యతో భేటీ అయి అప్రోచ్ రోడ్డుపై చర్చించానన్నారు. అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి ఆయన అంగీకరించారని చెప్పారు. 'పనులు జరుగుతున్నాయి.. మీరూ సీఎం రేవంత్‌తో సమావేశమై ఒప్పించండి' అని మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సూచించారు. కిషన్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా రైల్వేశాఖ తదనుగుణంగా పనిచేస్తుందని ప్రకటించారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, సికింద్రాబాద్ స్టేషన్‌తో పాటు చర్లపల్లి టెర్మినల్ అప్రోచ్‌రోడ్డుకు, రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. చర్లపల్లి టెర్మినల్‌కు అప్రోచ్‌రోడ్డు కీలకమని, రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసుతో పనులు చేయాలన్నారు.



చర్లపల్లి టెర్మినల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, సోమన్న, సంజయ్, ఎంపీ ఈటల

సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)



హైవేతోపాటు ప్రత్యేక రైల్వేలైన్ అందుబాటులోకి వస్తే రవాణా సులభతరమవుతుంది. ఇక్కడ డ్రైపోర్టు కూడా ఏర్పాటు చేస్తే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి దోహదపడుతుంది. హైదరాబాద్ నుంచే 35 శాతం బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతోంది. దీంతోపాటు ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి కూడా తెలంగాణలో పుష్కలంగా అవకాశాలున్నాయి. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు దక్షిణ కొరియా కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. సెమీ కండక్టర్ యూనిట్‌ను మంజూరు చేయండి. మరోవైపు 370 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు లో భాగంగా 170 కిలోమీటర్లకు సంబంధించి టెండర్లు పిలిచారు. దీంతోపాటు రీజినల్ రింగ్ రైల్ కూడా అవసరం. రెండోదశ మెట్రో ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్‌నూ మంజూరు చేయండి" అని రేవంత్‌రెడ్డి.. ప్రధాని మోదీని కోరారు.

ఆర్థిక ప్రగతికి రైల్వేల అభివృద్ధి కీలకం..

దేశ ఆర్థిక ప్రగతికి రైల్వేల అభివృద్ధి కీలకమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాలకు సైతం రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తుండడం అభినందనీయమన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో రైల్వేరంగం వినూత్న అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు. రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్న మాట్లాడుతూ.. భారతీయ రైల్వేలో ఇది చరిత్రాత్మకమైన రోజు అన్నారు. తెలంగాణలో గడచిన పదేళ్లలో 346 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించినట్లు, 40 ఆర్వోబీలు పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.430 కోట్లతో చర్లపల్లి టర్మినల్‌కు అత్యాధునిక సౌకర్యాలు కల్పించామన్నారు. దేశవ్యాప్తంగా 1400 రైల్వేస్టేషన్లను అప్‌గ్రేడ్ చేసినట్లు చెప్పారు. కాగా, అభివృద్ధిలో చర్లపల్లి టెర్మినల్ ట్రయల్ మాత్రమేనని, అసలు పండుగ ముందుందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ఐదు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, త్వరలోనే వందేభారత్ స్లీపర్ రైళ్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రూ.750 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రూ.350 కోట్లతో నాంపల్లి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో జాతీయ రహదారులకు కేంద్రం ఇప్పటివరకు రూ.లక్షా 20 వేల కోట్లు ఖర్చు చేయగా, మరో రూ.80 వేల కోట్లు ఖర్చు చేయబోతోందని చెప్పారు. వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కొమురవెల్లి రైల్వేస్టేషన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఇక రీజినల్ రింగ్ రోడ్డుకు రూ.26 వేల కోట్లు వెచ్చించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. కాగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం రాబోయే రోజుల్లోనూ కొనసాగాలన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా గుర్తించిన ప్రధాని మోదీ.. రైల్వే ప్రాజెక్టులకు పుష్కలంగా నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఒడిసా గవర్నర్ కంభంపాటి హరిబాబు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, తెలంగాణ ఐటీ మంత్రి డి.శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

..వారి వల్లే సంధ్య థియేటర్ దుర్ఘటన

- అల్లు అర్జున్ మేనేజర్, సెక్యూరిటీకి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- హైకోర్టులో పోలీసుల వాదన

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిన కేసులో నిందితులు పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. వీటిపై జస్టిస్ కే సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. అల్లు అర్జున్ మేనేజర్ ఎ.శరత్‌చంద్ర నాయుడు, వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బంది చెరుకు రమేశ్, శ్రీరాముల రాజులకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు కోరారు. ఓ మహిళ మృతి, ఓ చిన్నారి చావుబతుకుల మధ్య ఉండటానికి నిందితులు కారణమయ్యారని పేర్కొన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ..అది అనుకోకుండా జరిగిన దుర్ఘటన అని, ఆ ఘటన జరగాలని ఎవరూ కోరుకోలేదని తెలిపారు. ఆ ఘటనతో వారికి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ తొక్కిసలాట జరగడానికి పిటిషనర్లు కారణమయ్యారని పేర్కొన్నారు. మొత్తం 19 మంది నిందితుల్లో 10 మందిని అరెస్ట్ చేశామని తలిపారు. పది మంది వాంగ్మూలాలు నమోదు చేశామని పేర్కొన్నారు. థియేటర్ ఉద్యోగులు, సాక్షులు చెప్పినదాని ప్రకారం.. అల్లు అర్జున్ వస్తే అనుకోని సంఘటనలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ వారు పట్టించుకోలేదని తెలిపారు. ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోలేదని చెప్పారు. అల్లు అర్జున్ వ్యక్తిగత సిబ్బంది సైతం తోపులాటకు కారణమయ్యారని తెలిపారు. అల్లు అర్జున్‌ను చూసేందుకు పోలీసులు సయితం వెళ్లిపోయారు.. అక్కడ ఎవరూ లేరు అన్న ఆరోపణలు అబద్ధాలని పేర్కొన్నారు. బాధితులకు పోలీసులే సీపీఆర్ చేశారని పేర్కొంటూ అందుకు సంబంధించిన ఫొటోలను ధర్మాసనానికి సమర్పించారు. అల్లు అర్జున్‌కు సైతం హైకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇవ్వలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో పిటిషనర్లు ముందస్తు బెయిల్‌కు అర్హులు కాదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

పాడి కౌశిక్‌రెడ్డికి స్వల్ప ఊరట..

ఎన్నికల సందర్భంగా 'మా శవ యాత్రకు రండి' అంటూ చేసిన వ్యాఖ్యలపై నమోదు చేసిన కేసులో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి స్వల్ప ఊరట లభించింది. దిగువ కోర్టులో ప్రత్యక్ష హాజరునుంచి ఆయనకు మినహాయింపు ఇచ్చింది. తన వ్యాఖ్యలపై కమలాపూర్ పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలని కోరుతూ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. వివరణ ఇవ్వాలని ఫిర్యాదుదారు, పోలీసులకు నోటీసులు జారీచేస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

ఆగ్రోస్‌లో గ'లీజు' దందా!

- భూమి లీజుకిచ్చి చోద్యం చూస్తున్న సంస్థ
- ఏడాదికి రావాల్సిన ఆదాయం 3 కోట్లపైనే
- కోటి కూడా వసూలు చేయని పరిస్థితి
- నోటీసులు ఇచ్చి.. చేతులు దులుపుకొంటున్న ఆగ్రోస్

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజుల సొమ్ము... రాళ్ల పాలు అన్నట్లుగా తయారైంది తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (టీజీ- ఆగ్రోస్) ఆస్తుల పరిస్థితి. కోట్లాది రూపాయల విలువైన ఆగ్రోస్ భూముల్లో పెట్రోలు బంకులు, ఇతర వ్యాపార సంస్థలు నడుపుకొంటున్న లీజు దారులు... నెల నెలా అద్దె చెల్లించడానికి మాత్రం మొహం చాటేస్తున్నారు. నెలకు రూ.25 లక్షల చొప్పున... ఏడాదికి కనీసం రూ.3 కోట్ల అద్దె రావాల్సి ఉండగా... రూ.కోటి కూడా వసూలు కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. తెలంగాణ ఆగ్రోస్‌కు హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో భూములు, ఆస్తులు ఉన్నాయి. హైదరాబాద్‌లోని చింతల్‌లో సర్వే నంబర్లు- 221, 222లో 10 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఆగ్రోస్ బ్రాంచ్ కార్యాలయంతోపాటు డిస్‌ప్లే సెంటర్, అంతర్గత రహదారులు కలిపి 2 ఎకరాల 11 గుంటల విస్తీర్ణంలో ఉన్నాయి. ఆగ్రోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కర్షక్ పెట్రోల్ పంపు 12గుంటల స్థలంలో ఉండగా.. ఓ బీఆర్ఎస్ నాయకుడు దీన్ని నిర్వహిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో 54శాతం లాభం లీజుదారుడు తీసుకొని, 46 శాతం లాభాన్ని ఆగ్రోస్‌కు చెల్లించాలన్నది ఒప్పందం. ఈ స్థలానికి అద్దెను సైతం లీజుదారుడే చెల్లించాలి. అడపాదడపా 46 శాతం వాటా చెల్లిస్తున్న లీజుదారుడు.. 12 గుంటల స్థలానికి మాత్రం నయాపైసా అద్దె కూడా చెల్లించడం లేదు. అసలు.. ఈ లీజుకు సంబంధించిన ఒప్పంద పత్రాలేవీ ఆగ్రోస్ వద్ద లేకపోవడం గమనార్హం. ఈ స్థలానికి తక్కువలో తక్కువగా రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు అద్దె వచ్చే అవకాశం ఉన్నా.. ఆగ్రోస్ పట్టించుకోవడం లేదు. మరో 5 ఎకరాల స్థలాన్ని ఒక పెద్ద వ్యాపారికి ఇచ్చి, రూ.7.50 లక్షలు అద్దె చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఆ వ్యాపారి ఇప్పటిదాకా రూపాయి సైతం చెల్లించలేదు. ఆ ఒక్క వ్యాపారి అద్దె బకాయిలే రూ.కోటిపైగా ఉన్నాయి. అద్దె చెల్లించకపోతే స్థలం ఖాళీ చేయాలన్న నిబంధన ఉన్నా.. అధికారులు ఎలాంటి ఒత్తిడీ చేయడం లేదు. ఇక, అదే ప్రాంతంలో ఎకరం భూమిని చిన్న వ్యాపారాలు నడుపుకొనే వారికి లీజుకు ఇవ్వగా, చాలా మంది అద్దె చెల్లించడం లేదు. ఇటీవల 27 మందికి ఆగ్రోస్ సంస్థ నోటీసులు జారీ చేయగా.. ఒక లీజుదారుడు ఆగ్రోస్ కార్యాలయానికి వెళ్లి అధికారులపైనే దౌర్జన్యానికి దిగాడు. ఇక, నల్లగొండలో పెట్రోలు పంపు ఏర్పాటు చేసిన స్థలానికి నెల వారీ అద్దె కేవలం రూ.36 వేలుగా నిర్ణయించారు. ఇది చాలా రద్దీ ప్రాంతమైనా.. తక్కువ అద్దెను నిర్ణయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని సైతం లీజుదారుడు సక్రమంగా చెల్లించడం లేదు. ఇది కాకుండా వనపర్తిలో ఎకరం స్థలాన్ని రూ.1.50 లక్షలు, రాజేంద్రనగర్‌లో ఉన్న స్థలాన్ని రూ.70వేల చొప్పున లీజుకు ఇచ్చారు. అన్ని ప్రాంతాల్లో కలిపి నెలకు రూ.25లక్షల చొప్పున ఏడాదికి రూ.3కోట్లు అద్దె రూపంలో ఆగ్రోస్‌కు ఆదాయం రావాల్సి ఉండగా.. రూ.కోటి కూడా రావడం లేదు. రెన్యువల్ చేసుకుంటే ఎక్కడ కిరాయి పెరుగుతుందేమోనని చాలా మంది లీజు దారులు ముందుకు రావడం లేదు. అదే సమయంలో ప్రస్తుతం ఉన్న అద్దెలను సైతం సక్రమంగా చెల్లించడం లేదు.

నోటీసులు ఇచ్చాం.. వసూలు చేస్తాం

కొందరు లీజుదారులు అద్దె చెల్లించకుండా ఆగ్రోస్ ఆదాయానికి గండి కొడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై అధికారులతో ఇటీవల సమీక్ష నిర్వహించాం. అద్దె బకాయిలు ఉన్న వారికి నోటీసులు జారీ చేశాం. అద్దె చెల్లిస్తే ఆగ్రోస్ స్థలంలో ఎప్పటి మాదిరిగానే వ్యాపారం చేసుకోవచ్చని, లేకపోతే ఖాళీ చేసి వెళ్లిపోవాలని స్పష్టంగా పేర్కొన్నాం. కొందరు గడువు పూర్తయినా రెన్యువల్ చేసుకోవడంలేదు. లీజుదారుల నుంచి అగ్రిమెంటు ప్రకారం అద్దెలతోపాటు బకాయిలు వసూలు చేస్తాం.

- కాసుల బాలరాజు, తెలంగాణ ఆగ్రోస్ ఛైర్మన్

పీడీఎస్ బియ్యం కేసులో తొర్రూరు సీఐ అరెస్టు

- లారీని విడిచిపెట్టేందుకు రూ.5లక్షల లంచం డిమాండ్
- ఫోన్‌లో రికార్డు చేసి ఏసీబీకి ఇచ్చిన బాధితులు
- విచారించి సీఐను అదుపులోకి తీసుకున్న అధికారులు

తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సీజు చేసిన రేషన్ బియ్యం లారీని విడిచేందుకు రూ.5లక్షల లంచం డిమాండ్ చేసిన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సీఐ కె.జగదీశ్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లిలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీని 2024 అక్టోబరు 2వ తేదీన పోలీసులు పట్టుకుని ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. లారీని విడిచిపెట్టేందుకు తనకు రూ.5 లక్షలు లంచం ఇవ్వాలని సీఐ జగదీశ్ డిమాండ్ చేయగా బాధితులు రూ.2లక్షలు చెల్లించారు. మరో 3 లక్షలు ఇవ్వాల్సిందేనని సీఐ పట్టుపట్టగా వారు విసుగుచెంది ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సీఐ జగదీశ్‌కు అనుమానం రావడంతో వారి నుంచి నేరుగా డబ్బులు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో మిగతా రూ.3 లక్షలు ఇవ్వాలని ఫోన్‌లో అడగగా బాధితులు రికార్డు చేసి ఏసీబీ అధికారులకు అందించారు. దాంతో సోమవారం ఏసీబీ అధికారులు తొర్రూరులో ఉన్న సీఐ ఇంట్లో సోదాలు నిర్వహించారు. బాధితుల వద్ద నుంచి తాను రూ.2 లక్షలు తీసుకున్నానని సీఐ జగదీశ్ విచారణలో తెలపడంతో అతన్ని అరెస్టు చేసి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

ఆ ప్రాజెక్టుకు జైపాల్ పేరు పెట్టడం అభినందనీయం

- విపక్షాలూ స్వాగతించాలి: గుత్తా సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జైపాల్ రెడ్డి పేరు పెట్టడం అభినందనీయమని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. దీన్ని ప్రతిపక్ష పార్టీల నేతలూ స్వాగతించాలని కోరారు. ఆ ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడమంటే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచడమేనని పేర్కొన్నారు. శాసనమండలిలోని తన చాంబర్లో సోమవారం సుఖేందర్‌రెడ్డి మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి.. బంధు ప్రీతితోనే 'పాలమూరు-రంగారెడ్డి'కి జైపాల్‌రెడ్డి పేరు పెట్టారన్న దుష్ప్రచారం సరికాదన్నారు. సేద్యం చేస్తున్న భూమి అంతటికీ రూ. 12 వేల రైతు భరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం హర్షణీయమన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.